# అచుంబితం

క్రీశాల వార్షికోత్సవం. సాయంకాలమైంది - నగరంలోని ప్రముఖులంతా కుర్చీలలో ముందు వరుసలలో కూర్చున్నారు.

సరళ, పద్మావతమ్మను తీసుకువచ్చి లేడీస్ వింగ్‌లో కూర్చోబెట్టి, తమ గర్ల్‌ఫ్రెండ్స్ వైపుకు వెళ్ళింది.

సరళను చూడగానే కుర్చీల కవతల నిలబడివున్న బాయిస్ 'హుష్' అని ఈల వేశారు.

"బ్యూటీ అఫ్ ది ఇయర్" అని ఒక గొంతు, "మిస్ గుంటూర్" అని రెండో కంఠస్వరం. కలకల నవ్వింది గుంపు మొత్తం. "దేవికారాణి - కాంచన మాల - లిజ్ టేలర్ - నిరుపరాయ్-" సన్నగా మగపిల్లల వ్యాఖ్యానాలు!

ఇంతలో ఛీఫ్‌గెస్టును వెంటబెట్టుకొని ప్రిన్సిపాల్, వైస్-ప్రిన్సిపాల్ ఇత్యాదులు వచ్చారు. దానితో అల్లరిమూకల నిశ్శబ్దం, ఆసీనులైన పురజనులలో కలకలం.

ముఖ్య అతిథి, ప్రిన్సిపాల్, యూనియన్ ప్రెసిడెంట్ వేదిక నలంకరించారు. ప్రార్థనకు ముఖ్య అతిథి పిలిచాడు. సరళ బెర్లిన్ కుచ్చెళ్ళు సవరించుకుంటూ వేదిక ఎక్కింది.

కూతురు అందాన్ని వేదికమీద చూస్తున్న పద్మావతమ్మకు రెండుకళ్లూ చాలడంలేదు.

"ఏం మనిషి ఈయన? ఇన్ని వేలమంది ముందు కూతురు ప్రార్థన పాడుతున్నా, తనూ తన వ్యాపారమంటూ పొగాకు గిడ్డంగుల మధ్య కూర్చున్నాడు" అని మొగుణ్ణి మనస్సులోనే నిందించుకుంది పద్మావతి.

సరళ మైక్‌ముందు నిలబడి పాడింది.

"లక్ష్మీం! క్షీరసముద్ర రాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం దాసీ భూత సమస్త దేవవనితాం లోకైక దీపాంకురాం, శ్రీమన్మంద కటాక్షలబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరాం, త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుంద ప్రియాం"

అంతా చప్పట్లు చరిచారు.

"లతా మంగేష్కర్" అన్నదొక గొంతు, "సుశీలా! సుశీలా!" అంది ఇంకో గొంతు.

యూనియన్ ఎన్నికల్లో ఓడిపోయిన గ్రూపు అల్లరిచేస్తున్నదని ప్రెసిడెంటు పసిగట్టినట్లున్నాడు, నలుగురు విద్యార్థి వస్తాదులను అవైపుకు పంపాడు కట్టుదిట్టానికి. అల్లరి కాస్త సద్దుమణిగింది. కార్యదర్శి నివేదికయిత్యాదులైనాయి. ముఖ్య అతిథి రంగనాథరావు ప్రముఖ న్యాయమూర్తి నగరంలో. న్యాయాన్ని గూర్చి, ధర్మాన్ని గూర్చి, విద్యార్థులలో వ్యక్తిగత సౌశీల్యం పెంపొందవలసిన అవసరం గూర్చి ప్రసంగిస్తున్నాడు ఇంగ్లీషులో.

ఉపన్యాసం ధారాప్రవాహంగా సాగిపోతున్నది.

ఇంతలో "మంత్రిగారొచ్చారు- మంత్రిగారొచ్చారు" అని కలకలం.

కారు దిగి, మంత్రిగారు వచ్చారు. ప్రిన్సిపాల్ వేదికమీదినుండి దిగి వచ్చి మంత్రిగారికి స్వాగతం చెప్పారు.

ముఖ్య అతిథి ప్రసంగం ఆపి, అలాగే మైక్ ముందు నిలబడ్డాడు.

"తమరు నగరంలోనే వున్నారని మాకు తెలియదు" ప్రిన్సిపాల్ నొచ్చుకుంటూ అన్నాడు మంత్రిగారితో.

"మేమేదో అంతరంగిక విషయాలపై ఇలావచ్చి, అనుకోకుండా మీ వార్షికోత్సవం చూడాలనుకున్నాం" మంత్రిగారి పక్క నిలబడ్డ పర్సనల్ అసిస్టెంటు సమాధానం.

మంత్రిగారిని వేదికపైకి ఆహ్వానించాడు ప్రిన్సిపాల్.

మంత్రిగారు వేదికనెక్కారు. న్యాయమూర్తి రంగనాథరావు, మంత్రిగారికి నమస్కారం పెట్టాడు. మంత్రిగారు తాను మాట్లాడతానన్నట్లు మైకును ఇవ్వమని అడిగాడు. తన ప్రసంగం పూర్తికాకపోయినా మంత్రిగారిని కాదనలేక రంగనాథరావు పక్కకు తప్పుకున్నాడు. మంత్రిగారు మైకుముందు నిలబడ్డాడు.

బాయిస్ కూర్చున వింగ్‌నుండి చప్పట్లు. మంత్రిగారు మాట్లాడరు, చప్పట్లు ఆగవు!

ప్రిన్సిపాల్ సంగతేమిటో తెలియక యిరకాటంలో పడ్డాడు. చివరకు మంత్రిగారికి సభమీద దయ వచ్చినట్లుంది! మైక్ చేత్తో పట్టుకొని,

"దిస్ ఈజ్ ఎ ఫాన్సీ డ్రెస్ ప్లీజ్!" అన్నాడు అని, ఇక ప్రిన్స్‌పాల్ చేతికి దొరకకుండా వేదికమీది సైడు వింగ్‌లోకి పరుగెత్తాడు.

సభ మొత్తం నవ్వుల సముద్రంలో మునిగిపోయింది.

అలల పొంగు తగ్గి మళ్ళీ ప్రశాంత సముద్రం కావడానికి చాలా సేపు పట్టింది. ఇంతలో "సోది చెపుతానమ్మ సోది చెపుతాను" అంటూ ఒక ఎరుకల సాని లేడీస్ వింగ్‌లో ప్రవేశించింది. అయితే మంత్రిగారి తమాషావల్ల ఎరుకల సాని నెగ్గలేదు. ఆ అమ్మాయి ఫాన్సీడ్రస్ ప్రహసనం స్త్రీలు ముందే గుర్తించేశారు.

ప్రిన్సిపాల్‌గారు లేచి, "ఫాన్సీడ్రస్‌లు సభమధ్యలో ప్రవేశించి కార్యక్రమాలకు అంతరాయం కల్పించరాదు. ఇకమీద అలాచేస్తే వాటిని బహుమతి సందర్భంలో పోటీలో పరిగణించము." అని ప్రకటించాడు.

రంగనాథరావు మళ్ళీ తన ప్రసంగం మొదలుపెట్టాడు. అయితే ప్రజలలో మొదటి మూడ్ లేకపోవడం పసిగట్టిన రావు, తన ప్రసంగాన్ని క్లుప్తంగానే ముగించి ఔచిత్యాన్ని పాటించాడు.

తర్వాత యూనియన్ నిర్వహించిన వివిధ పోటీలకు సంబంధించిన బహుమతులను రంగనాథరావు అందజేస్తున్నాడు విజేతలకు వరుసగా.

"కళాశాల నిర్వహించిన కథానికల పోటీలో ప్రథమ బహుమతి శ్రీ కె. ఆనందమూర్తి, బి.ఏ. ఫైనల్."

విద్యార్థులంతా కరతాళ ధ్వనులు చేశారు. ఆనందమూర్తి వేదికమీదికి వచ్చాడు. రంగనాథరావు ఆనందమూర్తి వంక ఆశ్చర్యంగా చూచాడు. సరళ హృదయంలో పాలపొంగులు! పద్మావతమ్మ కళ్ళ వెంట జల జల రాలాయి ఆనందభాష్పాలు.

ఆనందమూర్తి ప్రిన్సిపాల్ గారికీ, ముఖ్య అతిథికీ వినయంగా నమస్కరించి నిలబడ్డాడు. ప్రిన్స్‌పాల్ గర్వంగా ముఖ్య అతిథి వైపు 'చూడండి! మా కళాశాల గర్వకారణం' అన్నట్లు చూచి, ఆనంద్ భుజాన్ని తట్టాడు. ముఖ్య అతిథి బహుమతినిస్తూ, "ప్లీజ్! మీట్ మీ వన్స్, ఆఫ్టర్ దిస్ ఫంక్షన్" అన్నాడు.

ఆనందమూర్తి బహుమతిని తీసుకొని వేదిక దిగాడు. మిత్ర బృందం మళ్ళీ కరతాళ ధ్వనులు చేసింది. తర్వాత వరుసగా చాలా మంది బహుమతులు

తీసుకున్నారు. వ్యాస రచన పోటీలో, గేమ్స్‌లో, మ్యూజిక్‌లో - ఒక్కొక్కరు వేదిక మీదికి వస్తుంటే వారివారి మిత్రులు చప్పట్లు కొడుతున్నారు

అయితే పద్మావతమ్మకు ఈ చప్పట్లేవీ వినిపించడంలేదు. ఆమె ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నది వెనక్కి వెనక్కి తిరిగి ఆనందమూర్తి వెళ్ళిన దిక్కుకే చూస్తున్నది

## 2

రింగ్ రోడ్‌కు అవతల కొంత నిర్మానుష్యంగా వున్న ఒక ప్రదేశం - గుబురుగా చెట్లు - దూరంగా రోడ్డు పగలంతా పని చేసి అలసిపోయిన సూర్యుడు విశ్రాంతి తీసుకోవడానికి వెళ్తున్నాడు. గాలి బాగా వీస్తున్నది రివ్వున. ఆకాశం ఎందుకో మబ్బు పట్టినట్లుంది. సరళ మోకాళ్ళకు తల ఆనించుకొని కూర్చున్నది ఆనంద్ వెల్లికలా పడుకున్నాడు ప్రకృతిని చూస్తూ. సరళ మధ్య ఆగుతూ ఆగుతూ ఏమిటేమిటో కబుర్లు చెబుతున్నది ఆనంద్ వింటున్నాడు మబ్బుపట్టిన ఆకాశాన్నే చూస్తూ.

"మా అమ్మ పొంగిపోయింది మొన్న నీకు ప్రైజు రావడం చూచి."

"ఊఁ !"

"మా ఫ్రెండ్స్ అంతా - ఒహ్! నిన్ను తెగ పొగిడేస్తున్నారు మామయ్య !"

"ఊఁ !"

"నీకో తమాషా చెప్పనా ?"

'ఏమిటి ?' ఓ గడ్డి పూవును కోస్తూ అన్నాడు ఆనంద్.

'మా ఫ్రెండ్స్‌కు ఎవ్వరికి తెలియదు మన చుట్టరికం.'

'అలాగా ?'

'ఔను. అందుకే రేవతీ, రాధికా నా ఎదుటే నిన్ను తెగ పొగిడేస్తుంటారు నీవేదో వాళ్ళకు కాబోయే మొగుడివైనట్లు.'

"అప్పుడు నువ్వు చెప్పవలసింది 'అమ్మాయిలూ ! నాకు కాబోయే మొగుణ్ణి మీరిట్లా పొగడటం అన్యాయం - నేను భరించలేను' అని."

"ఫో మామయ్య ! వాళ్ళ ముందు నేనెందుకు బయటపడాలి ?"

కొంచెం ఆగి ఆనంద్ అన్నాడు - "హాస్టల్లో నా సంగతి అట్లాగే వుంది. మోహనూ, కోటేశ్వరరావూ నిన్ను తెగ పొగిడేస్తుంటారు నా ముందే. కాని నేనెప్పుడూ చెప్పలేదు 'చవటల్లారా ! ఆ పిల్ల నా కాబోయే భార్యరా !' అని.

సరళ పద్మంలా ముడుచుకొని పోయింది. సూర్యుని వెలుగు రేఖలు వెనక బడ్డాయి చీకటి వ్యాపిస్తున్నది. తెల్ల నల్ల పోగులతో అల్లిన నేత చీరవలె వుంది ప్రకృతి.

"మామయ్యా! చీకటి పడుతున్నది" ఫక్కున నవ్వింది సరళ.

సరళ నవ్వు ఆనంద్ కు చురకబెట్టినట్లనిపించింది ఎందుకంటే సరళ ఆనందమూర్తికి నిశాచరుడని పేరు పెట్టింది.

ఆనంద్ కు సూర్యాస్తమయం యిష్టం. సూర్యోదయం కష్టం. ఈ రెండింటి మధ్యగల ప్రకృతి ఇష్టం. అందుకే జనసమ్మర్దానికి దూరంగా రాత్రిళ్లు చీకట్లో సంచరిస్తూ వుంటాడు ప్రకృతి అంతా గాఢ నిద్రలో వున్న సమయంలో, ఆనంద్ మేలుకునే వుండి ఏమిటేమిటో కలలు కంటూవుంటాడు.

"మామయ్యా! రాత్రి అయింది. ఇక నేను వెళ్తాను బాబూ!"

మళ్ళీ నవ్వింది సరళ.

ఆనంద్- "చాల్లే నోర్మూయ్. ఎక్కడికెళతావ్?"

"అదేమిటి? ఇంటికి వెళతాను."

"ఏ ఇంటికి?"

"మా ఇంటికి."

"ఏది మీ ఇల్లు? మీ నాన్నగారిల్లా?"

"కాదు-మీ అమ్మగారిల్లు."

"మరి మన ఇల్లు మాట?" ఆనంద్ అడిగాడు ఆసక్తితో.

"ఆలూ లేదూ చూలూలేదన్నట్లు అప్పుడే మన ముఖానికో ఇల్లా? ముందు పెళ్ళి, తర్వాత ఉద్యోగం, ఆ తర్వాత పిల్లలు, ఆపైన ఇల్లు..."

"లేదు ముందే ఇల్లు కట్టుకుందాం! మీ నాయన్ను ఓ నాలుగు పొగాకు బండిల్స్ అటు పారెయ్యమను."

"అప్పుడా యిల్లు పొగాకు వాసనే వస్తుంది బాబూ! మీరు రచనలమీదే సంపాదించి ఇల్లు కట్టింది. అప్పుడు సరస్వతీ మందిరంలా వుండి, ఇటుకలూ సిమెంటూ కూడా అగరువత్తుల వాసనలు వెదజల్లుతూ వుంటాయి."

"అబ్బో! చాలా కవిత్వం నేర్చావే?"

"నీ భార్యకు ఆ మాత్రమన్నా రాకపోతే, రేపు నలుగురూ నవ్వుతారని కష్టపడి కవిత్వం నేర్చుకుంటున్నాను మామయ్యా!"

"సరేకాని సరళా! మీ నాన్న మన పెళ్ళికేమన్నాడు?"

సరళ కొంచెం ఆగి, "ఆయన అనేదేమిట్లేకాని, మొన్న అమ్మా, నాన్నా ఏదో మాట్లాడుకుంటూ నన్ను చూచి టక్కున ఆగిపోయారు. దాన్నిబట్టి ఏదో కాన్ఫిడెన్షియల్ అనుకున్నాను" అని కొంచెం ఆగి "ఇది అయిన తరువాత ఎం. ఎస్ సి కి పంపాలని మాత్రం ఆయనకు లేదు" అన్నది సరళ

"అందీ ఈ శలవల్లోనే చేస్తాడా మన పెళ్ళి?"

"మన పెళ్ళి చేస్తాడో లేదో నాకు తెలియదుకాని, నా పెళ్ళి మాత్రం నాన్న." మళ్ళీ కిలకిలా నవ్వింది సరళ. ఆ నవ్వు చీకట్లో మెరుపుతీగలా తళ తళ మెరిసింది.

"అలా కలలోకూడా అనకు సరళా! నేను భరించలేను." అన్నాడు ఆనంద్ ఆవేశంగా.

'కూ-కూ' అని కూస్తూ ఓ పక్షి రివ్వున వాళ్ళ తలల మీదినుండి దూసు కుంటూ పోయింది. టప-టప చినుకులు పడుతున్నాయి.

"మామయ్యా! నాకు భయంగా వుంది. ఇంటికి వెళతాను" అన్నది సరళ.

"అలాగే!" అని అయిష్టంగా ఆనంద్ లేచి కూర్చున్నాడు. సరళ లేవ బోయింది. ఆనంద్ ఆమె పమిటను పట్టుకొని గుంజాడు, సరళ కూర్చోక తప్పలేదు.

"సరళా?"

"ఏమిటి?"

ఆనంద్ తన చేత్తో సరళ నడుమును చుట్టి వంగాడు. సరళ ముఖం పక్కకు తిప్పుకొని, "ఏమిటిది?" అన్నది.

"ముద్దు పెట్టుకుంటాను సరళా?" అన్నాడు

"మామయ్యా! ఊరుకో. ఆ మూడుముళ్ళూ పడేవరకు ఇలా వుండటమే మంచిది" అని ఆనంద్ చేతులను విడిపించుకున్నది.

ఆనంద్ ఉద్రేకాన్ని స్వాధీనపరచుకున్నాడు. సరళ దూరంగా జరిగింది పమిట సర్దుకున్నది. లేచి నిలబడింది.

"అయ్యో! నిశాచరులవారూ! వస్తానిక."

"మంచిది."

"మంచిదేమిటి నీమొహం!అంటే నన్ను యీ చీకట్లో పొమ్మనా నీ అర్థం? దారిలో ఎవడైనా రేప్‌చేసినా దిక్కులేదు."

ఆనంద్ లేచి ని బడ్డాడు. ఇద్దరూ కలిసి నడుస్తున్నారు.

"చదువెలా వుంది?" ఆనంద్ ప్రశ్నించాడు.

"పరవాలేదు. సీలాగా ఫస్టులో రాలేకపోయినా పాసు అవుతాను."

ఆనంద్ నిశ్శబ్దంగా నడుస్తున్నాడు.

ఆనంద్ మదిలో కవిత కదిలింది.

"ఎవరితో పోల్చను నిన్ను అనుపమా!!

పోలికే లేని దివ్య సౌందర్యరాశివి ప్రియతమా!!"

సరళ మాట్లాడేసరికి ఆలోచనా ప్రవాహానికి బ్రేక్ పడి, కవిత ఆగి పోయింది!!

"అన్నట్లు మొన్న విశాఖపట్టణంలో కళానికేతన్‌వారు కథల పోటీ ప్రకటించారు. చూచావా?" సరళ అడిగింది.

'లేదే!'

'నాకు తెలుసు. రాజావారు దినపత్రిక చదువుతారా ఏమిటి?'

రోడ్డు వచ్చింది. సరళ ఓ స్ట్రీట్‌లైట్ పోల్‌ముందు ఆగింది. తన పార్కర్ పెన్ తీసి ఆనంద్ చేతికిచ్చింది. తన పుస్తకాల్లోంచి ఓ చిన్న వైట్ పేపర్ చింపింది. తన ఖరీదైన డైరీతీసి తాను నోట్‌చేసుకున్న కళానికేతన్ అడ్రస్, లాస్టుడేట్ చెప్పింది. ఆనంద్ నోట్ చేసుకున్నాడు కాగితంమీద. రివ్వున సుడిగాలి వచ్చింది. కాగితం గాలికెగిరింది. పెన్ జేబులో పెట్టుకొని పరుగెత్తిపోయి ఆ కాగితాన్ని పట్టుకున్నాడు ఆనంద్. చినుకులు పెద్దవవుతున్నాయి.

'అమ్మ చంపేస్తుందివ్వాళ. నాకు తెలుసు' అనుకుంటూ సరళ గబగబ నడిచింది. ఆనంద్ అనుసరించాడు ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ.

నగరం వచ్చింది - జనసాగరంలో జలజంతువులవలె మనుషులు మళ్ళీ గుంపులు గుంపులుగా కనపడ్డారు వానకు పరుగెత్తుతూ రోడ్డుమీద.

'మామయ్యా! వాన వస్తోంది, ఇంట్లోకి వస్తావా?' సరళ అడిగింది రాదని

తెలిసికూడా.

'వద్దులే. వెళ్ళిరా '

సరళ పరుగె త్తింది లేడిలా ఇంట్లోకి

ఆనంద్ ఓ షాపుముందు పంచలోకి దూరాడు. వాన బాగా ఎక్కు వైంది. ఉరుములతో మెరుపులతో ఆకాశం భయపడుతూ భయపెడుతున్నది.

ఆనంద్ హాస్టల్ చేరేసరికి అక్కడ పరంధామయ్య కన్పించాడు.

'ఏమిటిది? ఎక్కడినుంచి రావడం?' అంటూ గదిలోకి వచ్చి తడిబట్టలు విప్పాడు ఆనంద్.

పరంధామయ్యది అమరావతి. పనులమీద గుంటూరువస్తే తన గదికి వస్తుంటాడు - పడుకోడానికో, ఏదైనా పనిలో సహాయం పొందడానికో. వాన వల్ల పడుకోడానికి తన గదికి వచ్చాడనుకున్నాడు పరంధామయ్యనుచూచి ఆనందు.

'బాబూ! ఎక్కడికెళ్ళావు?' పరంధామయ్య మాటల్లో ఏదో ఆదుర్దా ధ్వనిస్తున్నది.

'ఏమిటి విశేషం?' అని అడిగాడు ఆనంద్ తడితలను టవల్‌తో తుడుచుకుంటూ.

'ఈయన పాయంత్రమనగా వచ్చాడు ఆనంద్ నీకోసం, ఇలా కాలుకాలిన పిల్లిలా తిరుగుతూవున్నాడు' అన్నాడు రూంమేట్ వెంకట్.

ఆనందు పరంధామయ్య ముఖంవైపు చూచాడు. 'బాబూ! నాయనకు ఉదయంనుండి ఏం బాగోలేదు. నువ్వు వెంటనే అమరావతి రావాలి' అన్నాడు పరంధామయ్య.

ఆనందు గుండెలు దడదడలాడాయి. 'తండ్రికి సీరియస్‌గా వుందన్న మాట! గడియారం చూచుకున్నాడు - తొమ్మిదయింది.

'ఎలా వెళ్ళడం?' ఆనందు అడిగాడు భయంగా.

'తొమ్మిదిన్నరకో బస్సువుంది. లేకుంటే తుళ్లూరు బస్సు ఖాయంగా దొరుకుతుంది. దానిలో అడ్డరోడ్డు దగ్గర దిగి ఏ లారీలోనన్నా వెళదాము.' ఆనందు గబగబా పొడిబట్టలు వేసుకున్నాడు. రూం జాగ్రత్తను వెంకట్‌కు అప్పగించాడు.

'పరవాలేదు. నువ్వు ముందు పో' అన్నాడు వెంకట్. రెండుజతల బట్టలూ, టూత్ పేస్టూ, బ్రష్షూ, బ్రీఫ్ కేస్‌లో వేసుకొని ఆనందు బయలుదేరాడు. పరంధామయ్య అనుసరించాడు. అప్పటికే తొమ్మిదింబావు దాటింది. అయినా అనుకోకుండా వాళ్ళకు అమరావతి బస్సు అందింది. ఇద్దరూ బస్సెక్కారు చీకట్లో బస్సు పడమరవైపుకు దూసుకుంటూ పోతున్నది.

'అక్కయ్యకు ఈ వార్త కబురుపెట్టారా?' ఆనందు అడిగాడు.

'ఆఁ! ఆమె మీ బావగారు ఇంకా ఇంటికి రాలేదని ఎదురుచూస్తున్నది నేను చెప్పినప్పటికీ.'

విశ్వేశ్వరరావుకు కారు వుంది వాళ్ళు తలచుకుంటే ఏ రాత్రికైనా బయలు దేరి రాగలరు కారులో.

'ఊఁ..ఇంకా....'

'శ్యామలమ్మ కూడా వచ్చింది' అన్నాడు పరంధామయ్య.

'అంతా అయిపోయిందన్నమాట' అనుకున్నాడు ఆనందు. లేకుంటే తండ్రి శ్యామలమ్మకు కబురుపెట్టడు. కబురుపెట్టినా శ్యామలమ్మ రాదు. శ్యామల ఆనందు రెండో అక్క. భట్టిప్రోలులో వుంది. భర్తపోయినా అత్త, ఆడబిడ్డలు రాచిపాడినా అత్తింటినే అంటిపెట్టుకొని వుంది.

తండ్రి రమ్మన్నా ఎన్నడూ అమరావతి రాలేదు. అట్లాంటిది శ్యామలమ్మకు కబురు అంది వచ్చిందట!!

బస్సు వేగంగా పోతున్నది. దారికి రెండువైపులా చింతచెట్లు పిశాచాల్లా తలలు విరబోసుకొని గాలికి నర్తిస్తున్నాయి. బస్సు లైట్ల వెలుగులో రోడ్డు పక్క పడుకున్న బర్రెలు, గోవులు - యమభటుల సమూహంలా అనిపిస్తున్నాయి. బస్సు లైట్ల వెలుగులో పచ్చగా మెరుస్తున్న కళ్ళతో దూరంగా ఎగురుతున్న మిణుగురు పురుగులు, చితినుండి రేగిన రవ్వల్లా వున్నాయి. నల్లటి చీకటి ఆనందమూర్తి శోకంలా గడ్డకట్టింది. బస్సు అమరావతి చేరింది. ఆనందమూర్తి. పరంధామయ్య, దేవాలయం వీధికి పోయారు. ఆనందమూర్తిని చూడగానే గొల్లుమన్నారు ఇంటిల్లిపాది. ఆనంద్ లోపలికిపోయి చూచాడు.

నిద్రిస్తున్న వాసిలా పడుకొని వున్నాడు వెంకటరత్నం ! ! ఆనంద్ తండ్రి పాదాల వద్ద తల పెట్టుకొని కూర్చున్నాడు. సుశీలమ్మ కొడుకు వచ్చాడని విని ఇంకా పెద్దగా రోదించింది పక్కగదిలోంచి.

వాళ్ళూ వీళ్ళూ వెంకటరత్నానికి అకస్మాత్తుగా ఎట్లా ముంచుకొచ్చిందీ పూసగుచ్చినట్లు వివరిస్తున్నారు - ఉదయంనుండి జరిగిన చరిత్రనంతా ఆనంద్ తో. ఆనందు నిర్లిప్తంగా వింటున్నాడు.

జననం, మరణం - మానవుడు ఇంకా ఛేదించని రెండు ప్రకృతి రహస్యాలు. తెరచాప ఎత్తిన పడవ రేవుకు చేరకపోతే ఎలా ?? తెర ఎత్తిన తర్వాత నాటకానికి మళ్ళీ తెర దించకపోతే కథ ముగియవద్దూ ?

ఆనందు కొన్ని కథల్లో విషాద దృశ్యాలు వర్ణించాడు కాని, విషాదమంటే ఇలా వుంటుందని తెలియదు. ఊహించి రాసిందే !

"ఊహకు, నిత్యానుభూతికీ చాలా తేడా వుంది' అనుకున్నాడు ఆనందు.

రాత్రి తెల్లవార్లూ అదోలాగ గడిచింది. తెల్లవారాక ఆనందు దహన సంస్కార కార్యక్రమం ప్రారంభించాడు. అప్పటికి వచ్చారు విశ్వేశ్వరరావు, పద్మావతమ్మ, సరళ లు స్వంత కార్లో.

శవం వెంట అంతా నడుస్తూ వచ్చారు స్మశానందాకా - ఆనందు కర్మలన్నీ యథావిధిగా నిర్వహించాడు. అంతా ముగిసిన తర్వాత కృష్ణలో స్నానాలు చేశారు బంధువులు.

విశ్వేశ్వరరావు ఆ సాయంత్రం దాకా వున్నాడు. "అర్జంటు పనులున్నాయి. నేను గుంటూరు వెళ్ళి మళ్ళీ వస్తాను." అని పద్మావతమ్మనూ, సరననూ అక్కడే వదిలి కారులో ఒక్కడే వెళ్ళిపోయాడు. నలుగురూ ఆనందును ఓదార్చారు. ఆనందు శ్యామలమ్మనూ, సుశీలమ్మనూ ఓదార్చాడు. వాతావరణమంతా చాలా బరువుగా వుంది ఆ రోజు కూడా. మూడోనాడు పరంధామయ్య గ్రామంలోని మరో ఇద్దరు పెద్దలు వెంకటరత్నం వ్రాసిన విల్లు ప్రసక్తి ఆనందు ముందు తెచ్చారు.

తండ్రి విల్లు రాశాడని ఆనందుకు తెలియదు. రాయవలసి వస్తుందని కూడా ఆనందు ఊహించలేదు.

"ఏం రాశారాయన ?" అన్నాడు అనాసక్తిగానే. విల్లులోని విశేషాలు చెప్పారు పెద్దలు. ధరణికోటలోని అయిదెకరాల పొలం శ్యామలమ్మ పేర దాన, విక్రయ సర్వాధికారాలతో రాశాడట.

ఇల్లూ, హరిశ్చంద్రపురంలోని జామతోటా సుశీలమ్మ పేర సర్వాధికారాలతో వ్రాశాడట. బ్యాంకిలో వున్న అయిదువేలతో ఆనందు చదువు ముగించుకోవాలని వ్రాయబడి వుందట విల్లులో.

తండ్రి ఎందుకిలా చేశాడో ఆనందు తేలికగానే వూహించ గలిగాడు. ఈ కొత్త ఆస్తి వల్ల శ్యామలమ్మకు అత్తగారింట్లో కొంత గౌరవ ప్రతిష్టలు లభిస్తాయి. బ్రతుకు వెనకటిలా దుర్భరంగా వుండదిక. తల్లికి మినిమం గ్యారంటీ కింద ఏర్పాటు చేశాడు ఇల్లూ, తోటా, కొడుకు చూడవచ్చు - చూడకపోవచ్చు - ఆమె బతుకు ఆమె బతకగలదిక.

తనకు మాస్టర్ డిగ్రీకి కావలసినంత ఏర్పాటు మాత్రం చేశాడు. రెక్కలిచ్చి ఎగిరి పొమ్మన్నాడు తండ్రి!

"ఎంత చక్కని సమయస్ఫూర్తి! ఎంతటి దూరదృష్టి!" అనుకున్నాడు ఆనందు. రెండు రోజులుగా ఆనందు సరిగ్గా భోంచేయడంలేదు. ఇంట్లో తిరుగుతున్న మనుషులంతా నీడబొమ్మల్లా కనిపిస్తున్నారు. తండ్రి మొత్తం చూచుకుంటూ డబ్బు పంపిస్తే చదివిన పద్ధతి వేరు, ఇప్పటి ధోరణి వేరు. ఈ దుఃఖంతో పరీక్షలు రాసేదెట్లా? రాసినా భవిష్యత్తులో చదివేదెట్లా??

విశ్వేశ్వరరావు మళ్ళీ వచ్చాడు రెండురోజుల తర్వాత. పద్మావతమ్మనూ, సరళనూ తీసుకుపోవడంకోసమని గ్రహించారంతా.

అంతా కూర్చున్న సమయంలో వెంకటశేషయ్య ఆ మాటా ఈ మాటా చెపుతున్నాడు వెంకటశేషయ్య గ్రామపెద్ద. వెంకటరత్నానికి ప్రాణం. 'బాబూ! చివరి ఘడియవరకూ ఆయన మీ కోసం కలవరిస్తూనే వున్నాడు" అన్నాడు వెంకటశేషయ్య విశ్వేశ్వరరావుతో.

"నాకోసమా?" అన్నాడు విశ్వేశ్వరరావు ఆశ్చర్యంగా.

"ఔను బాబూ! ఆనందును మీ చేతుల్లో పెట్టి కళ్ళు మూయాలని ఆయన ఎంత తపన పడ్డాడో?'

విశ్వేశ్వరరావు మాట్లాడలేదు.

"సరళమ్మ - ఆనందుల మూడు ముళ్ళూ కళ్ళతో చూడలేక పోయినా కనీసం వాళ్ళ ఇరువురినీ పక్క పక్కన నిలబడివుండగా కడసారి చూడాలనుకున్నాడు. కాని ఆ అదృష్టం"

విశ్వేశ్వరరావు సిగరెట్ వాకిట్లో పారేసి మూతి కడుక్కోడానికన్నట్లు లేచి అవతలికి వెళ్ళిపోయాడు.

చూచిన వాళ్ళ మనసులు కలుక్కుమన్నాయి లోపల గదిలో సుశీలమ్మ మళ్ళీ పెద్దగా ఏడ్చింది. ఆ సాయంత్రం ఆనందు అటూ అటూ తిరుగుతూ బౌద్ధ శిల్పాలున్న మ్యూజియం వైపు వెళ్ళాడు. అక్కడి నుంచి కిందికి దిగాడు.

"ఇది మ్యూజియం - జనబాహుళ్యానికి శాంతినందించిన ప్రేమమూర్తిని రాళ్ళల్లో నిక్షేపించి కటకటాలలో బంధించిన మందిరం' అనుకుంటూ కిందికి దిగాడు గట్టమీది నుండి

అవతలి చైత్యం వద్ద విశ్వేశ్వరరావు పద్మావతమ్మలు మాట్లాడు కుంటున్నారు. మాటలు వినవచ్చేటంత దూరం.

"అదేం బాగుంటుంది చెప్పండి ! ఆయన బతికి వున్నప్పుడు ఆనందుకు మనం ఏమీ చేయలేకపోయాను వూళ్ళో అక్కా బావలువున్నా హాస్టల్‌లో వుండి చదువుకోవాల్సిన గతి పట్టింది వాడికి. కనీసం ఇప్పుడన్నా మీరు మా అమ్మతో ఓ చల్లని మాట అంటే ఆయన జీవం తరిస్తుంది."

'నువ్వు నోరు మూస్తావా పద్మా ! ఈ గడ్డ కాలికి తగిలేసరికి ఈ గూటి పలుకులు పలుకుతున్నావు. విన్నానుగా, నీ నాయన రాసిన విల్లు విశేషాలు - ఇల్లు లేదు. పొలం లేదు. తోట లేదు, దొడ్డిలేదు. దమ్మిడి విలువ చెయ్యని నీ తమ్ముడికి ఏమని ఇద్దామనుకుంటున్నావే ? అడగడానికి వాళ్ళకు సిగ్గులేదు సరే - నీకెలా లేకపోయింది ?'

"ఎందుకండీ అంతంత మాటలంటారు ? వాడేం అప్రయోజకుడా నలుగురిలోనూ 'ఫలానా' అని పేరు తెచ్చుకుంటున్నాడు కాలేజీలో. అమ్మాయికి కూడా...."

"పద్మావతీ ! నీ బుద్ధి సరిగ్గా పనిచేయడంలేదని నాకు తెలిసే ఇంటి ప్రయాణం కట్టిస్తున్నాను వెంటనే. ఇప్పటికే బాగా పైత్యం ఎక్కింది. ఇంకో రెండు రోజులిక్కడ వుంటే పూర్తిగా మతే పోయేటట్లుంది నీకు, ఈ అడ్డా కానీ అమరావతి మామకాదే నా కూతురుకు కాబోయే మొగుడు. అమెరికా - అమెరికా నుంచి తెస్తాను పద్మావతీ ! సరళకు వీడు ఎయిర్ కండిషన్‌డు కారు కొనగలడా ? ఢిల్లీలో ఓ ఫ్లాట్ కొనగలడా ? ఫ్రిజ్ కొనగలడా ? విమానాల్లో తిరగగలడా ? పిచ్చిపిల్ల దానికేం తెలుసు ? మామంటే మామ, బావంటే బావ. దాన్ని పరోక్షంగా నువ్వు చెడగొడుతున్నావని నాకు తెలుసు. ఇవ్వాళ 'మామ' అంటుంది పిణ్ణి. రేపు 'ఏమండీ !' అంటూ అల్లుకుపోతుంది మనం తెచ్చిన గొప్పవాడితో. తీగెదేముందే - మనం ఎలా అల్లబెడితే అలా అల్లుకుంటుంది."

విశ్వేశ్వరరావు ఉపన్యాసం కాలేదు, ఆనందుకు మాత్రం ఇలా చాటున వుండి వింటుంటే తానేదో తప్పు చేస్తున్నానని అనిపించింది.

"ఇప్పటికే అయిన రభస చాలు. ఆనందు ఏదైనా అల్లరి చేస్తే దానికి నీ కూతురు జీవితాంతం ఏడుస్తూ బాధపడాల్సి వస్తుంది. వ్యవహారం రచ్చకెక్కక ముందే నా జాగర్త నేను పడుతున్నాను. బొంబాయిలో ఓ ఇంజనీర్ సంబంధం చూస్తున్నాను. ఖాయమైతే వెంటనే ముడి పెట్టేస్తాను."

ఆనందు గుండెలను ఎవరో గునపాలతో పొడుస్తున్నట్లు అనిపించింది. మ్యూజియం పక్క వేపచెట్లు రివ్వున గాలి వీస్తున్నా ఆనందుకు ప్రాణవాయువు అందుతున్నట్లు అనిపించడంలేదు శరీరాన్ని మనస్సు మ్యూజియం వైపు నుండి నదివైపుకు లాక్కొని పోయింది ఆనందు అమరేశ్వరుడి కోవెలకవతల రాతి అరుగుమీద కూర్చున్నాడు.

సూర్యుడు అస్తమించాడు. లంకల్లోంచి పనులు ముగించుకొని ఇవతలికి రైతులు వస్తున్నారు కృష్ణ దాటి - రెక్కలు కొడుకున్న బాతులు గుంపుల్లా. పూజారి కోవెలలో దీపారాధన చేశాడు. చిరు గాలికి దీపలం రెపరెపలాడుతున్నది అమరేశ్వరుని ముందు, ఆనందు అశల్లా - కృష్ణ ఉలహీనంగా ప్రవహిస్తున్నది తూర్పు సముద్రం వైపుకు, కబేళాకు లాగుతున్న మేకలా. బాగా పొద్దుపోయింది. నది వైపుకు శ్యామలమ్మ వచ్చింది. ఎందుకో చీకట్లో.

చీకట్లో కూడా అక్కనుగుర్తించాడు ఆనందు.

"అక్కా !"

"నువ్విక్కడున్నావా బాబూ !" శ్యామలమ్మ దగ్గరికి వచ్చింది అమె వెంట సుశీలమ్మ కూడా వచ్చింది మెల్లగా.

"ఇంట్లో కూర్చోలేక ఇలా వచ్చాము - అమ్మకు కాస్త విశ్రాంతయినా లభిస్తుందేమోనని."

"వదామ్మవతక్క.. " ఆనంద్ ఏదో అడగబోయాడు.

"వాళ్ల సాయంత్రమే వెళ్ళిపోయారుగా!" శ్యామలమ్మ చెప్పింది.

ఆనంద్ ఏమీ మాట్లాడలేదు.

"ఏమి విల్లో, ఏమో! వాళ్ళకు బాగా కోపాలు వచ్చినట్లున్నాయి చూడు నీవేమీ అనుకోకపోతే ఓ మాట అంటాను."

'ఏమిట'న్నట్లు చూచాడు ఆనంద్.

"వాళ్ళ ధోరణి చూస్తే పదోనాడు వస్తారన్న నమ్మకం కూడా కన్పడటం లేదు. నాన్న ఆత్మకు శాంతి కల్గించడమే మన కర్తవ్యం. ఆనంద్! నా అభి

దెకరాలూ అక్కయ్య పేర పెడతాను ఇది ఎవరి వత్తిడివల్లా చేస్తున్నదికాదు. ఎలాగైనా పద్మావతి వచ్చేటట్లు చూడు. లేకుంటే నవ్వులపాలు అవుతాము."

చర్రున రోషంతో లేచింది సుశీలమ్మ. "వాళ్ళకంత ధనగర్వమయితే మనకేం? వాళ్ళకెక్కువ వుంటే వాళ్ళే తింటారు. మీ నాయనకు ఆత్మశాంతి పదోనాడు పద్మావతి వస్తే రాదు, ఆయన సంకల్పం అమలువరిస్తే వస్తుంది"

ఆనంద్ మనస్సు నదిలో సుడిలాగా గిరగిర తిరిగింది. "అమ్మా! నువ్వు బాధపడకు ఎలాగైనా అక్కా బావ వాళ్ళు వచ్చేటట్లు చూస్తాను."

"నువ్వు చూడక్కలేదనే నేను చెపుతున్నాను! ఎలా కావాలని వుంటే అలాగే అవుతుంది" సుశీలమ్మ కంట తడిబెట్టిందని చీకట్లో కూడా గాద్గద్యాన్ని బట్టి గుర్తించాడు.

ఆనంద్ ఇక మాట్లాడలేకపోయాడు. ఆ తర్వాత నిశ్శబ్దంగా ముగ్గురూ ఆలా చాలాసేపు చీకటితో తాదాత్మ్యం పొందారు.

ఆ పదోరోజు రానేవచ్చింది. సరిగ్గా ఎనిమిది గంటలయ్యేసరికి విశ్వేశ్వర రావు కారు వెంకటరత్నంగారింటిముందు ఆగింది. అంతా ఆశ్చర్యపోయారు. ఆనంద్ ఎడమకన్ను ఆనందంతో వణికింది. లోపలినుండి విశ్వేశ్వరరావు పద్మావతి దిగారు. "సరళ ఏదీ?" ఎవరో ప్రశ్నించారు.

"వచ్చే వీల్లేకపోయింది."

అంతా మనస్సులో నివ్వెరపోయారు. ఆనంద్ ఎడమకన్ను ఆశ్చర్యంతో వణికింది. 'బౌనుమరి పరీక్షలు.... పెద్ద పరీక్ష!!' పదవరోజు జరకవలసిన కర్మ కాండ ముగియగానే పద్మావతిని మాత్రం వదలి విశ్వేశ్వరరావు మళ్ళీ గుంటూరు వెళ్ళిపోయాడు. ఆనంద్ కర్తవ్యాన్ని నిర్లిప్తంగా నిర్వహించాడు. వెంకటేశేషయ్యా పరంధామయ్యలు ఎక్కడా ఏలోటూ రాకుండా దగ్గర నిలబడి చేయించారు. పదకొండోరోజు పన్నెండోరోజు కూడా విశ్వేశ్వరరావు సరిగ్గా భోజనాలవేళకు గుంటూరునుండి వచ్చి భోజనం కాగానే వెళ్ళిపోయాడు. పదమూడోరోజు పద్మావతి గుంటూరు వెళ్ళిపోయింది. పద్మావతి వున్న రెండు రోజులూ చాలా ముభావంగానే వుండిపోయింది. ఒక్క రాత్రి మాత్రం సుశీలమ్మతో ఏదో తీవ్రంగా సంభాషణ జరిగింది. సుశీలమ్మ ఏడ్చింది. పద్మావతి గదిలోంచి బయటకు వెళ్ళిపోయింది. అంతే!! శ్యామల భట్టిప్రోలు వెళ్ళిపోయింది. లంకంత కొంపలో సుశీలమ్మ ఒక్కతే మిగిలింది. ఆనంద్‌కు భవిష్యత్తు మసక మసకగా కనపడ్డది.

"హాస్టల్‌కు వెళ్ళి చదువుకో." అని సుశీలమ్మ బలవంతం చేసింది.

తల్లిమాట కాదనలేక ఆనంద్ మళ్ళీ గుంటూరు ముఖం పట్టాడు ఒక్కడే.

## 4

ఆనంద్ హాస్టల్‌కు వచ్చేసరికి వెంకట్ చదువుకొంటూవున్నాడు.

"ఒరే! ఇదేమిట్రా! ఇట్లా అయిపోయావు?" అన్నాడు వెంకట్.

"ఎట్లా అయిపోయాను?"

ఈ పదిరోజుల్లోను దాదాపు పదేళ్ళ ముసలితనం నీ కళ్ళల్లో కన్పడుతున్నదిరా!" అన్నాడు వెంకట్. పదేళ్ళేమిటి? ఇంకా చాలా ఎదిగాడు. ఇంత కాలం తండ్రిచాటున బిడ్డ. ఇప్పుడు తన కాళ్ళమీద తాను నిలబడాలి. తన విలువ సమాజంలో ఎంతో తానే నిర్ణయించుకోవాలి తాను రాయో రత్నమో ఈ సమాజానికి తెలియజేయవలసిన తరుణం తనకు వచ్చిందని ఆనంద్‌కు తెలిసిపోయింది. ఆనంద్ పుస్తకం ముట్టుకున్నాడు. కాని మనస్సు నిలపడంలేదు.

ఒకరోజు బ్రాడీపేట ఓవర్‌బ్రిడ్జి దగ్గరనుంచి వెళ్తూంటే అకస్మాత్తుగా సరళ కన్పించింది. సరళ తనను చూచి ఎందుకో బెదిరిపోయింది. ఆనంద్ నిలబడిపోయాడు. సరళ దగ్గరకి వచ్చింది.

"నేనే నిన్ను కాంటాక్టు చేద్దామనుకుంటున్నాను. ఇంతలో కనిపించావు."

ఆనందు ఏమీ మాట్లాడలేదు

"సాయంత్రం ఓసారి అలా రింగ్‌రోడ్ వైపు వస్తావా?"

ఆనందు 'సరే'నని తల వూపాడు.

సాయంత్రం కాగానే తన పాతచోటు దగ్గరికి పోయాడు.

అప్పటికింకా సరళ రాలేదు. ఆనందు ఆలోచిస్తున్నాడు. ఇవ్వాళ ఎందుకో ఈ ప్రదేశం తనకే కొత్తగా అనిపిస్తున్నది. 'సాహిత్యం సుఖంలోనుండి రాదు, పరితాపంలో నుండే వస్తుంది. వాల్మీకికైనా శోకంలోంచే వచ్చింది' అనుకున్నాడు ఆనందు. కనీళ్ళను గుండెల్లోనే దాచుకున్న మబ్బులు కురవకుండా అరవకుండా మౌనంగా వున్నాయి పైన. గత పదిరోజులుగా ఎన్నో భావాలు 'నన్ను చెప్పు-నన్ను చెప్పు' అని ఆనందును వేధిస్తున్నాయి. అయితే ఆనందు వాటికి అక్షరాలతో ఆవిష్కారం ఇవ్వలేకపోతున్నాడు వెనుకటిలాగా. 'నేను చిక్కిపోయింది బయట జరిగిన సంఘటనలకు' అనుకున్నాడు ఆనందు. పురివిప్పిన నెమలిలాగా సరళ వచ్చింది. ఆ రావడంకూడా వెనకటిలాలేదు.

పులి గుహవద్దకు వచ్చిన మేకపిల్లలా వచ్చింది. వేటగాణ్ణి చూచి నక్కిన కుందేలులా వచ్చి కూర్చొని తానే సంభాషణ మొదలుపెట్టింది. ఆ మాటల్లో క్రమంలేదు, పొందికలేదు, విశేషమైన భావాలూ లేవు. ఏదో మాట్లాడాలి కాబట్టి మాట్లాడాలని కల్పించుకొని మాట్లాడుతున్నట్లు చాలా కృతకంగా వున్నట్లు అనిపించింది ఆనందుకు.

"నాన్న తొందర పడుతున్నాడు. ఆలస్యమైతే అమృతం విషమవుతుందట. ఈ సమ్మర్‌లోనే నా పెళ్ళి చేయాలని అనుకుంటున్నాడు."

ఆనందు వింటున్నాడు తనకేమీ పట్టనట్లు.

"మామయ్యా! ఎట్లా ఈ సమస్యకు పరిష్కారం? చెప్పు మామయ్యా?"

ఆనందు విచిత్రంగా నవ్వాడు. ఆ నవ్వులో చాలా భావాలున్నాయి. అందులో కొన్ని మాత్రం సరళకు అర్థమై చిన్నబుచ్చుకుంది. మళ్ళీ మాట్లాడదానికి సాహసించలేదు. అప్పుడు ఆనందు మొదలుపెట్టాడు.

"సరళా! ఇందాక నేను బ్రాడీపేటలో కన్పించకపోతే ఏం చేసేదానివి?"

"ఏం చేసేదాన్ని? నీకోసం కబురుపెట్టించేదాన్ని."

"నేను హాస్టల్‌లో వున్నానని నీకు తెలుసా?"

"తెలుసుకుంటాను"

"కాదు సరళా! నీవు తెలుసుకోవు, తెలుసుకోలేవు. నీ మనస్తత్వం నాకు అర్థమైంది. నీవు చాలా సామాన్యమైన ఆడపిల్లవు సరళా! అది నీ అదృష్టం. బుద్ధిమంతురాలివి, తల్లిదండ్రుల మాటలను జవదాటలేవు. వాళ్ళు నన్ను మొదట్లో 'నీ మామ' అన్నారు కాబట్టి 'ఓహో! కాబోయే మొగుడు అనుకున్నావు. వీడు దమ్మిడీ ఠికాణా లేనివాడు అని తేల్చిన మరుక్షణం నేను ఆ బజార్లో వున్న నూరుమందిలో నూట ఒకటోవాణ్ణి అయిపోయాను."

"అంటే నేను డబ్బు కాశిస్తున్నాననా?" సరళ కంట తడిపెట్టింది. నీటి కుండల్లో చేపల్లాగా కదిలాయి రెండు కళ్ళు.

"కాదు సరళా, కాదు. నీవు డబ్బు కాశిస్తున్నావని నేను అనలేదు. కేవలం తల్లిచాటున బిడ్డవని మాత్రమే అంటున్నాను. నీకొక వ్యక్తిత్వంలేదు, అభిరుచులు లేవు. నీ అభిరుచి నీ వ్యక్తిత్వం మీ అమ్మా నాన్న తీర్చి దిద్దుతారు. నీమొగుణ్ణి నీవు నిర్ణయించుకోలేవు. నీ తల్లిదండ్రులు నిర్ణయించిన వాడిలోనే నీ మొగుడు నీకు కనిపిస్తాడు."

"అంటే నీతో లేచి రమ్మంటావా మామయ్యా!"

ఆనందు ఫక్కున నవ్వాడు. ఆ నవ్వులోంచి సూర్యునినుండి రాలినట్లు వేడి భగ్గున పొడిపొడిగా రాలింది.

"నిన్ను అంతటి పాపకార్యం చేయమని నేననడంలేదు బుజ్జమ్మగారూ! అసలు నీవలాంటి పని చేయలేవు మరో జన్మ మెత్తితే తప్ప-పైగా నిన్ను సాహసాలు చేయమని అడిగిందెవరు సరళా? వద్దు-తల్లిదండ్రులు నిర్ణయించినవాడిని వరించు సమస్యలు క్షణంలో పరిష్కారమవుతాయి."

సరళ ఏడ్చింది వెక్కి వెక్కి. ఆనందు గంభీరంగా ఉండిపోయాడు.

"మానాన్న నామీదా అమ్మమీదా అన్ని అస్త్రాలూ ప్రయోగించాడు. నన్ను నీకిచ్చి చేస్తే తాను విషం పుచ్చుకు చస్తానని అమ్మను బెదిరించాడు. నేనేం చెయ్యను మామయ్యా? ఆడదాన్ని అసహాయురాలిని-తల్లి చాటున బిడ్డను."

సరళ ఏడుస్తూవుంది. ఆనందు సరళను అర్థంచేసుకున్నాడు. ఆమె కన్నీళ్ళు తుడిచాడు.

"ఛ - పిచ్చిపిల్లా! ఏడవకు. పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయని సామెత వుంది. తెలుసుగా? దాన్నే మనం బ్రహ్మరాత అంటుంటాంలే! ఏది ఎలా కావలసి వుంటే అలాగే అవుతుంది. అనవసరంగా దిగులు పెట్టుకోకు కాలమే అన్ని సమస్యలనూ పరిష్కరిస్తుందిలే" అన్నాడు.

సరళ లేవలేదు. "నేను నిన్ను మళ్ళీ కలియగలనో లేనో మామయ్యా!" భయం భయంగా అన్నది సరళ.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత సరళ అన్నది.

"మామయ్యా!"

"ఏమిటి?"

"లోగడ నువ్వొక కోరిక కోరావు. అప్పుడు నేను తీర్చలేదు."

'ఏమిటి?'

'... మామయ్యా! నన్ను ముద్దుపెట్టుకో మామయ్యా! ఇప్పుడు కాకుంటే మళ్ళీ జీవితంలో నీకది ఇవ్వగలనో లేనో?'

ఆనందు సరళ రెండు భుజాలు విచిత్రంగా పట్టుకొన్నాడు. ఆనందు ముద్దుపెట్టుకొంటాడని సరళ అనుకున్నది.

అయితే ఆ భుజాలను అసరాగా చేసుకొని ఆనందు కేవలం లేచి నిలబడ్డాడు. నిటారుగా నిలబడ్డాడు.

'ఇదేమిటి? మామయ్యా సాలవృక్షంలా ఇంత పొడుగ్గా వున్నాడు ఈవేళ!' అనుకుంది సరళ చీకట్లో ఆనందును చూచి.

'పద సరళా! చీకటి పడింది. నిన్ను మీ ఇంటిదాకా వదిలేస్తాను' అన్నాడు, అని వెంటనే నడక మొదలుపెట్టాడు చకచకా. సరళ అనుసరించింది నిశ్శబ్దంగా.

## 5

శ్రీశైలవుల్లో సరళ పెళ్ళి అయిపోయింది. అమరావతికి కూడా ఒక శుభలేఖ వచ్చింది విశ్వేశ్వరరావునుండి. పద్మావతమ్మ ఒకరోజు ఒంటరిగా కారుమీద వచ్చి పిలిచి పోయింది పుట్టింటివాళ్లను. కన్నీళ్లతో ఆమె కారుదిగింది కన్నీళ్లతోనే మళ్ళీ కారు ఎక్కింది. పెళ్ళిని చాలా పెద్దఎత్తున చేశాడు విశ్వేశ్వరరావు. సరళ మొగుడు బొంబాయిలో ఇంజనీర్. లక్షాధికారిసంబంధం! అంతా వచ్చి శుభాకాంక్షలు చెప్పి విందు భోజనాలు చేసి బహుమతులు చదివించి వెళ్ళారు.

బహుమతులు ఇచ్చేటప్పుడు ఒక విచిత్రం జరిగింది. అందరూ టేబిల్ లైట్స్, స్టీల్ యు టెన్‌సిల్స్, ఆల్బమ్స్ వంటివి చదివిస్తున్నారు.

ఇంతలో రిక్షాలో పరంధామయ్య దిగాడు. ఆయనా, రిక్షావాడూ కలసి ఒక పెట్టెను మోసుకొచ్చి వివాహవేదిక వద్దకు తెచ్చారు. అంతా అటువైపు చూచారు.

పద్మావతమ్మ మాత్రం పరంధామయ్యను గుర్తుపట్టింది.

'అమరావతినుండి సుశీలమ్మగారు సరళ వివాహ సందర్భంలో ఆశీర్వదించి బహూకరించిన...' అని పురోహితుడు అడిగాడు. కొయ్యపెట్టె మూత తియ్యడం వెంటనే సాధ్యపడలేదు.

'సరే తర్వాతది కానివ్వండి' అన్నారు పక్కవారు. మళ్ళీ వేరే చదివింపుల్లోకి వెళ్ళిపోయాడు పురోహితుడు.

ఆ తర్వాత పెట్టెను తెరిచి చూచారు. అందులో గౌతమబుద్ధుని పాలరాతి శిల్పం బస్టుసైజ్‌డి వుంది. 'మూడువేల రూపాయల ఖరీదు పైమాటే!' నిపుణులు అంచనాకట్టారు.

విశ్వేశ్వరరావు నివ్వెరపోయాడు 'ఈ వెధవ వాళ్ళ ఇంటి పక్కనే మ్యూజియంలోంచి దొంగిలించి పంపలేదు కదా!' అని కూడా అనుకున్నాడు ఒక్క క్షణం.

తర్వాత పరంధామయ్యను అడిగాకు అనుమానం తీర్చుకోవడానికి. పరంధామయ్య చెప్పాడు - 'మద్రాసునుండి తెప్పించాడు ఖరీదిచ్చి' అని.

విశ్వేశ్వరరావు మౌనంగా ఊరుకున్నాటు.సరళ ఆనందుపంపిన బొమ్మను ఒంటరిగా గదిలో పెట్టుకొని కన్నీళ్లతో అభిషేకం చేసింది ఒక్కసారి. 'మామయ్యా! నువ్వే స్వయంగా వచ్చి ఇచ్చినట్లయితే ఎంత సంతోషపడేదాన్ని' అనుకున్నది కాసేపు. 'ఔను! ఎలావస్తావు నువ్వు ఇక్కడికి? నీకోసం మా నాన్న తలుపులు మూసేసినప్పుడు ఏమని వచ్చి తలుపులు కొట్టగలవు నువ్వు?' అనుకొంది.

ఆనందు స్వయంగా వస్తాడు, వచ్చి బహుమతి యిస్తాడు, అప్పుడు వంద ప్రశ్నలు రావచ్చు- 'ఎవరీ అబ్బాయి? ఎందుకు వచ్చాడు? ఎందుకింత బహుమతి ఇచ్చాడు?? ఏమిటి వీళ్ల సంబంధం??'- అని.

'అపుకోలేని ప్రేమను అందాల శిల్పంగా ఘనీభవింపజేసి అదృశ్యహస్తంతోనే నామీద అమృతవర్షం కురిపించావా మామయ్యా నా క్షేమంకోసం' అనుకుంది కళ్లుమూసుకొని సరళ.

ఇంతలో గదిలోకి శ్రీకాంత్ వచ్చాడు. భర్త రాకతో సరళ ధ్యానం భంగమయింది. ఆనందు స్థానాన్ని సరళ మనస్సులో శ్రీకాంత్ ఆక్రమించాడు మరుక్షణం.

x x x x

కొన్నాళ్ళకి పరీక్షా ఫలితాలు వచ్చాయి. సరళ ద్వితీయ శ్రేణిలో పాసయింది. ఆనందు పరీక్ష పోయింది.

"అమ్మా ! పరీక్ష పోయింది" అని చెప్పాడు ఆనందు సుశీలమ్మతో చాలా నిర్లిప్తంగా.

తల్లి ముఖంలో విషాద చ్ఛాయలు కనిపించాయి. సుశీలమ్మ తన కొడుకు భవిష్యత్తు గూర్చి ఆందోళన పడసాగింది. ఆనందు ప్రతిరోజూ ఉదయమే బౌద్ధ చైత్యం వద్దకు పోయేవాడు. తనలో ఫెల్లుబికే భావాలను కథలుగా, గాథలుగా

కాగితాలమీది కెక్కించేవాడు, అలా వ్రాయగానే ఆనందుకు కొంత రిలీఫ్ వచ్చేది. దానితో ఇంటి ముఖం పట్టేవాడు. సాయంత్రమయ్యే సరికి మళ్ళీ ఏదో దిగులు, మళ్ళీ ఏదో చీకటి. ఏవేవో సంశయాలు. తెల్లవారగానే అన్నీ భావాల క్రింద ఘనీభవించి అక్షరాల మూసల్లో పోత పోయబడేవి. దానితో కొంత మనశ్శాంతి.

అదీ, ఇదీ కాకపోతే కృష్ణ ఒడ్డునే హరిశ్చంద్రపురం వరకూ నడుచుకుంటూ పోయేవాడు. జామతోటల మధ్య గుండా, ఒకసారి బోరుపాలెం దాకా నడిచిపోయాడు నదీ తీరంలోనే. బోరుపాలెం సరిగ్గా అమరావతికీ, విజయవాడకూ మధ్యలో వుంది. ఆ ప్రకృతి సౌందర్యాన్ని రంగరించి రాసిన నవలే 'మధుబాల'

'ఒరే బాబూ ! నీకిక పిచ్చి ఎక్కేటట్లుందిరా !' అని సుశీలమ్మ ఏడ్చింది ఒకసారి.

ఆనందు నవ్వి 'ఓసి పిచ్చిదానా ! నా మీద నీ కెంత ప్రేమ. ఎంత ఆప్టిమిజం ! పిచ్చిఎక్కేటట్లుంది అని సంతృప్తి పడుతున్నావు, నా కెప్పుడో పిచ్చి ఎక్కింది" అన్నాడు.

సుశీలమ్మ మళ్ళీ ఏడ్చింది.

మరో నాలుగు రోజులయిన తర్వాత ఒకనాడు తల్లితో అన్నాడు. 'అమ్మా ! అక్కడి ప్రకృతి చాలా మనోహరమైనది. అందువల్ల అది నా మనస్సుకు మరింత పిచ్చెక్కిస్తున్నది. నాకు కొంత మార్పు అవసరం. నేనేదైనా ఉద్యోగం చూచుకొంటానమ్మా !'

'పరీక్ష పూర్తి చెయ్యవా ?'

'లాభం లేదమ్మా ! ఇప్పుడిక మళ్ళీ ఆ పుస్తకాలు తాకలేను. చదివి ప్రయోజనం లేదు."

సుశీలమ్మ మరింకేం మాట్లాడలేదు. మౌనంతో అంగీకారం తెలిపింది. ఆనందు భవిష్యత్తును గూర్చి ఆలోచించాడు. అకస్మాత్తుగా రంగనాథరావు గుర్తు వచ్చాడు. ఓ ఉదయం బస్సులో గుంటూరు వెళ్ళి రంగనాథరావుగారింటికి పోయాడు.

లోపలికి పోయి తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"ఓ, నీవా బాబూ ! రా, రా" ఆదరంతో ఆహ్వానించాడు రంగనాథరావు.

"నీ కథలంటే నాకు చాలా ఇష్టం" అని ప్రశంసించాడు. తర్వాత ఏవేవో ప్రశ్నలు వేశాడు. ఆనందు వినయంగా సమాధానం చెప్పాడు. తర్వాత ఆనందు దాచుకోకుండా పరీక్ష పోయిన సంగతి చెప్పాడు.

"ఇంటి పరిస్థితుల వల్ల ఇప్పుడు నేను దాన్ని పూర్తి చేయలేనండి ! ఏదైనా ఉద్యోగం చూచుకోవాలనుకుంటున్నాను" అన్నాడు ఆనందు.

రంగనాథరావుగారు నిశ్శబ్దంగా ఆలోచిస్తున్నాడు. కొంచెం మాగి, "నీవీ వూళ్ళో ఏం ఉద్యోగం చేస్తావు బాబూ !" అని అడిగాడు.

"నాకీ గుంటూరు బెజవాడలలో ఉద్యోగం వద్దండీ ! కొంత వాతావరణం మార్పు కావాలి. మద్రాసుకో హైదరాబాదుకో పోతాను."

రంగనాథంగారి ముఖం వికసించింది. వెంటనే లెటర్‌పాడ్ తీసుకొని ఓ జాబు రాశారు. తర్వాత దాన్నొక కవర్‌లో పెట్టి పైన 'శ్రీ శ్రీనివాస చక్రవర్తి, బరకత్‌పురా, హైదరాబాదు - 27" అని అడ్రసు రాశారు.

"బాబూ ! ఈ ఉత్తరం తీసుకుపో. నీకు తప్పక సహాయం లభిస్తుంది. గాడ్ బ్లెస్ యూ !" అన్నాడు రంగనాథరావుగారు.

ఆనందు కృతజ్ఞతలు చెల్లించి జాబు జేబులో పెట్టుకొని బయట పడ్డాడు. ఆ మధ్యాహ్నమే మళ్ళీ అమరావతి వెళ్ళాడు. సాయంత్రం తీరికగా కూర్చొని ప్రయాణానికి కావలసిన బట్టలు సర్దుకుంటుండగా పెట్టెలోనుండి పార్కర్ పెన్ క్రింద పడింది. విచిత్రంగా దాని వంక చూచాడు ఆనందు.

'ఎక్కడిదిది ?' అని ఆలోచించాడు గతంలోకి. ఆ పెన్ సరళదని గుర్తుకొచ్చింది.

అప్పుడు .. ఆ సాయంత్రం రింగు రోడ్డు వద్ద ఎలక్ట్రిక్ పోల్ వద్ద తన కిచ్చింది పెన్. ఏదో విశాఖ కథానికల పోటీ అడ్రస్ నోట్ చేసుకునేందుకు ఇంతలో గాలి. కాగితం ఎగిరిపోయింది. పెన్ జేబులో పెట్టుకొని పరుగెత్తాడు తాను. గాలి వాన - రూముకు వచ్చి తడి గుడ్డలు విప్పేసరికి మరణ వార్త మోసుకు వచ్చిన పరంధామయ్య నిలబడి వున్నాడు. తర్వాత హాస్టల్ రూం ఖాళీ చేశాడు ఆనందు.

వస్తువులతో గుడ్డలతోబాటు పార్కర్ పెన్ కూడా అమరావతి చేరిందన్న మాట! వర్తమానంలోకి వచ్చాడు మళ్ళీ.

కలాన్ని తీసి ముద్దుపెట్టుకుందామనుకొని పెదవులదాకా తెచ్చుకొని ఆగి పోయాడు. ఆనంద్ మనస్సులో ఏవో మెరుపులు మెరిశాయి పెదవుల ముందు నుండి కలాన్ని తీసి భద్రంగా తన సూట్ కేస్‌లో దాచిపెట్టుకున్నాడు. రంగనాథ రావుగారిచ్చిన లెటర్ కూడా పెట్టెలో పెట్టుకున్నాడు. మర్నాడు మధ్యాహ్నం అమరావతినుండి నేరుగా గుంటూరు చేరాడు. అక్కడినుండి బస్సుమీద విజయ వాడ వెళ్ళాడు. బస్సుస్టాండునుండి రైలుస్టేషన్ వెళ్ళేసరికి సాయంత్రమైంది. రాత్రి పదిగంటలకు మద్రాసు-హైదరాబాదు ఎక్స్‌ప్రెస్ వచ్చింది. ఆనంద్ డబ్బులిచ్చి ఓ స్లీపర్ కొనుక్కొని పడుకున్నాడు. బండి కూతపెట్టి హైదరా బాదు ముఖం పట్టింది.

## 6

"శ్రీనివాస చక్రవర్తిగారు ఉన్నారండీ?" అంటూ లోపలికి ప్రవేశించాడు ఆనంద్

ఎదురుగా సోఫాలో ఒక దొరబాబు కూర్చొని ఇంగ్లీషు మాగజైను పేజీలు తిప్పుతున్నాడు. ఆనంద్‌ను చూడగానే దొరబాబు చేతిలోని పత్రికను పక్కకు పెట్టి తీక్షణంగా పరిశీలనగా దృష్టి సారించాడు. ఆనంద్ మళ్ళీ అడిగాడు- "ఇది శ్రీనివాస చక్రవర్తిగారి ఇల్లేకదూ?"

"చిత్తం, అలాగే. పాలెస్ బయట బోర్డు ఉందికదూ?"

ఆనంద్ ఆ వ్యంగ్యానికి త్రుళ్ళిపడ్డాడు.

"ఇంతకూ మీరెవరు?" బాబు ఆనంద్‌ను ప్రశ్నించాడు.

'నేనే ...నేనే....'

'ఔను మీరే- ఎవరుసార్? ఏవూరునుంచి రావడం? పల్లెనుంచా? కామ కాంచనాల్లో దేనికోసం వచ్చారు?'

ఈయనెవరో కొంచెం వాగుడుకాయగా వున్నాడని పసిగట్టాడు ఆనందు. 'నేను శ్రీనివాస చక్రవర్తిగారితో పర్సనల్‌గా మాట్లాడాలని వచ్చాను.'

'నేనేనయ్యా ఆ శ్రీనివాసుణ్ణి, ఏడుకొండల వాణ్ణీని. రా-ఇటురా- ఈ కుర్చీలో కూర్చో. ఏం మాట్లాడుతావో మాట్లాడు?'

ఆనందు బిక్క చచ్చిపోయాడు. ఇవ్వాలా, వద్దా అని ఆలోచించి చివ రకు చల్లకు వచ్చి ముంత దాచడమెందుకని రంగనాథరావుగారి లెటర్ దొర బాబుకు ఇచ్చాడు.

దొరబాబు ఉత్తరం చించి చదివాడు. చదివి ఆనందు ముఖం ఒకసారి విచిత్రంగా చూచాడు. చూచి సీటు ంచి గభాలున లేచి ఆనందు రెండు భుజాలు పట్టుకొని, 'యూ-యూ మిస్టర్ ఆనంద్! హెహ్హెహే! వాట్ ఎ వండర్‌ఫుల్ థింగ్ ఇటీజ్!' అని ప్రశంసించాడు.

'నేను మీకెలా తె .సు?' ఆనందు ప్రశ్నించాడు.

'నీ రచనలు మేము చదివాం. మాకు నీవంటే ఇష్టం. తెలిసిందా?' అన్నాడు దొరబాబు.

ఆనందుకు ఏం మాట్లాడాలో తెలియలేదు కొంచెం ఆగి దొరబాబు అన్నాడు-

'రచనలు మీ వుళ్ళోనే చేయగలవా? ఏవూళ్ళో అయినా చేయగలవా?'

'ఏ వూళ్ళో అయినా చేయగలను. కాకుంటే రసాలు మారుతాయి- రంగులు మారుతాయి'

'రంగులేమిటి? బొమ్మలగూర్చి నేనడగటం లేదు- కథలనుగూర్చి.'

'ఔను వాటిగూర్చే చెపుతున్నాను నేను. అక్షరాలకు రంగులుంటాయి. అందులోనూ పైకి కొన్ని రంగులు కన్పడతాయి. కన్పడకుండా లోపల మరి కొన్ని రంగులుంటాయి.'

'వండర్‌ఫుల్! ఏ న్యూ థియరీ!' అని చప్పట్లు చరిచాడు పెద్దగా నవ్వుతూ దొరబాబు.

ఇతని పిల్లతనం చూచినమీదట ఎందుకో ఈయన శ్రీనివాస చక్రవర్తి అయివుండదని అనుమానం కలిగింది ఆనందుకు. ఇంతలో బిల బిల నలుగురు ఆడపిల్లలు పరుగెత్తుకొంటూ వచ్చారు. దొరబాబు వాళ్ళ భుజాలమీద చేతులు వేసుకొని మేడ పైకి వెళ్ళిపోయాడు.

ఆనందుకు ఏం చేయాలో తోచలేదు. పది నిమిషాలు కూర్చున్నాడు. ఇరవై నిమిషాలు కూర్చున్నాడు అర్ధగంట అయింది. ఇక వెళ్ళిపోదామని ఆనందు లేచి నిలబడ్డాడు. ఆనందు ఎప్పుడు నిలబడతాడా . అని ఎదురుచూచి మరీ మనిషిని పంపారా అన్నట్లు ప్యూన్ దిగివచ్చాడు.

'నేను వెళ్ళిపోతున్నానని మీ అయ్యగారితో చెప్పు' అన్నాడు ఆనందు.

ఫ్యూన్ కిసుక్కున నవ్వాడు అతడి నవ్వు ఆనందుకు అర్థంకాలేదు.

'ఎందుకలా నవ్వావు?' అని ప్రశించాడు.

'అబ్బే! నేనెక్కడ నవ్వానండీబాబూ!' ఫ్యూన్ తనకేమీ తెలియదన్నట్లు ముఖం పెట్టాడు.

ఇదేదో పద్మవ్యూహంలా అనిపించింది ఆనందుకు.

'మీకు ఉద్యోగం దొరికిందని చెప్పమన్నారండీ!' అన్నాడు ఫ్యూన్.

'అలాగా!' అన్నాడు ఆశ్చర్యంగా.

'ఔనండి. రేపు ఉదయం పది గంటలకు రమ్మన్నారు. ఇక తమరు దయచేయవచ్చు' అన్నాడు నౌకరు.

ఆనందు విచిత్రంగా మేడపైకి చూచాడు. గదిలో ఆడపిల్లల నవ్వులు పకపకా వినిపిస్తున్నాయి. ఆనందు బర్కత్‌పురానుండి మళ్ళీ చిక్కడపల్లి దోవ పట్టాడు. ఇదంతా అయోమయంగా అనిపించింది.

ఇప్పుడు వెంటనే హోటల్లో బసకుపోయి ఏం చేయాలో బోధపడలేదు. అందుకని బస్‌స్టాండువద్ద నిలబడి వచ్చిన బస్సును ఎక్కాడు. అది నెంబరు వన్ రూట్. కండక్టరు వచ్చాడు.

'ఈ బస్సు ఎక్కడిదాకా పోయి ఆగుతుంది?' అని ప్రశ్నించాడు.

'చార్మినార్‌దాకా'

'అయితే అక్కడిదాకా టిక్కెట్టు ఇయ్యి.'

టిక్కెట్టు జేబులో పెట్టుకొని రోడ్లనూ, భవనాలనూ చూస్తున్నాడు ఆనందు. బస్సు బడేచావడి, కోఠి, బస్‌డిపో, నయాపూల్ మీదుగా చార్మినార్ దగ్గర దిగాడు. అక్కడినుండి దుకాణాలనూ, వీధులను చూస్తూ చాలాసేపు తిరగాడు. నగరం ఇక్కడ చాలా పురాతనంగా వుంది. తానేదో కొత్త ప్రపంచంలోకి - అడుగుపెట్టానని గుర్తించాడు ఆనందు మర్వాడీల గుడ్డలషాపులూ,వెండి దుకాణాలు, ముస్లిముల మిఠాయిషాపులూ, చెప్పుల దుకాణాలూ, గాజులషాపులూ- అలా మరికొంతదూరం సాగిపోయాడు ఇరవై నిమిషాలకు పైగా. సన్నటి గల్లీ వచ్చింది. అక్కడ సంగీత వాద్యాలు విన్పిస్తున్నాయి. హిందుస్థాని సంగీతం, గజల్స్, కవాలీలు!

'ఇదేదో ప్రాచీన గోల్కొండ వైభవానికి మిగిలిన స్మృతిగీతంలావుందే!' అనుకున్నాడు.

ఎవరితోనైనా మాట్లాడాలని ఆనందు అనుకున్నాడు. కాని అక్కడ తెలుగువచ్చిన ముఖమేమీ కన్పించలేదు మళ్ళీ కాళ్ళీడ్చుకుంటూ చార్మినార్ దాకా వచ్చాడు.

గుర్తుగా మళ్ళీ నెంబరు వన్‌లో ఎక్కాడు. అది సికిందరాబాదు స్టేషన్ వరకూ పోయే రూట్- చిక్కడపల్లి రాగానే దిగిపోయాడు. ఆనందు భోజనంచేసి హోటల్లో పడుకుని సాయంత్రం బజారులోకి వచ్చాడు. బస్స్టాండువద్ద సత్యనారాయణ నిలబడి వున్నాడు.

'నారాయణా!' అంటూ దగ్గరికి పోయాడు ఆనందు

'ఆనందు! ఇదేమిటి? నువ్విక్కడ... ??' ఆశ్చర్యపడ్డాడు నారాయణ.

ఆనందు తాను ఉద్యోగ నిమిత్తం వచ్చినట్లు చెప్పాడు.

'చాలా కష్టం బాయీ! అంటే హైదరాబాదు భాషలో బహుత్ ముష్కిల్ హై!' అన్నాడు.

తర్వాత తానేం చేస్తున్నదీ ఎక్కడ వున్నదీ చెప్పాడు సత్యనారాయణ. సత్యనారాయణది అమరావతే. గుంటూరులో బి.ఎస్.సి. పాసైనాడు. ఉద్యోగం కోసం విజయవాడ, గుంటూరు, తెనాలి తిరిగి తిరిగి చివరకు హైదరాబాదు వచ్చాడు. ఓ ఎల్.డి.సి. పోస్టు దొరికింది ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చేంజి ద్వారా. చిక్కడపల్లిలో చింతతోపు దగ్గర ఓగది తీసుకొని వుంటున్నారట - సత్యనారాయణా మరో ఇద్దరు మిత్రులు.

'ఆనందూ! నువ్వు అదృష్టవంతుడివిరా. నీకు నేను కనబడటంతో హైదరాబాదులోని మేజర్ ప్రాబ్లమ్ సాల్వ్ అయింది. ఇక ఉద్యోగానికేం? ఎప్పుడో ఒకప్పుడు దొరుకుతుందిలే మెల్లగా.'

'దొరికిందిరా!' అని పొద్దున జరిగినదంతా చెప్పాడు.

నమ్మబుద్ధి పుట్టలేదు సత్యనారాయణకు. ఎందుకంటే హైదరాబాదులో రైలు దిగుతూనే ఉద్యోగం సంపాదించినవాళ్ళు చాలా అరుదు.

'ఇంకేం? ముందు పార్టీ ఇవ్వు.' డిమాండ్‌చేశాడు సత్యం. సత్యం, ఆనందు హోటల్లో స్వీట్సూ, పూరీ తిని కాఫీ తాగారు. అప్పుడే రూం ఖాళీచేసి సత్యం బసకు పెట్టి బెడ్డింగ్ మార్చేశాడు ఆనందు. ఆనందమూర్తిని తన రూం మీట్స్‌కు పరిచయం చేశాడు సత్యం.

'ఇదుగో, వీడు మా వూరివాడే! నాకన్నా చాలా అదృష్టవంతుడు-వస్తూనే ఉద్యోగం దొరికింది. సాయంత్రానికి ఇల్లు దొరికింది' అని.

ఆనందు విచారంగా నవ్వుకున్నాడు మనస్సులో. తన అదృష్టాన్ని సత్యం పొగుడుతున్నాడు!

అర్రాత్రి మొత్త సత్యం హైదరాబాదు నగర జీవితంలోని సాధక బాధకాలన్నీ వివరించాడు ఆనందుకు.

"అక్కడ సంగీత సాహిత్యాల పోషణ ఇంకా బాగానే వున్నట్లున్నదే!" అన్నాడు ఆనందు.

"నీకెట్లా తెలుసు ?"

"ఉదయం నెంబరు వన్ బస్సు దిగి చార్మినార్ నుండి నడుచుకుంటూ పోయాను. అక్కడొక సన్నటి వీధి వచ్చింది. ఆ వీధినిండా సంగీతాలే, కవాలీలే."

ఆ మాటలు విని రూంలోని ఆదిశేషూ, హనుమంతరావు విరగబడి నవ్వారు.

"చూశావా - చూశావా ! నీవుగొప్పవాడివని నేను చెప్పడానికిదే కారణం. హైదరాబాదులోకి దిగీ దిగకముందే నీవు మెహందీలోకి కాలు పెట్టావు" అని సత్యనారాయణ ఆనందును గేలి చేశాడు. స్నేహితులిద్దరూ మళ్ళీ నవ్వారు. ఆలా నవ్వులతోనూ కబుర్లతోనూ రాత్రి గడిచిపోయింది. మెహందీ అంటే హైదరాబాదులో వేశ్యావాటిక అని ఆనందుకు వాళ్ళ మాటల ద్వారా తెలిసింది.

మరునాడు పది గంటలకు ఆనందు బరకత్‌పురా పోయాడు. హాలులోకి పోయేసరికి అక్కడొక తల నెరిసిన పెద్దమనిషి కూర్చొని వున్నాడు. ఆనందు ఆయనకు నమస్కరించాడు.

"నీవు... ?"

"నా పేరు ఆనందు."

"ఓ - నీవా ! రాబాబూ, రా." అని పిలిచాడు ముసలాయన.

ఆనందును దగ్గర కూర్చోబెట్టుకున్నాడు ఆయన.

'నేను నిన్న వచ్చానండి !'

"ఆఁ ఆఁ ! నాకు అంతా తెలిసింది. నీకు అప్పుడే అమ్మాయి అపాయింటుమెంట్ ఆర్డర్ కూడా ఇచ్చిందటకదా ?"

ఆనందుకు తల తిరిగినట్లనిపించింది.

"ఆఁ - ఆఁ !" అన్నాడు అయోమయంగా.

'ఆనందూ ! నీవు పత్రికల్లో రాసే రచనలు చూచి బాగా తల నెరిసిన వాడినవి ఊహించుకుంటూ వుండేవాణ్ణి. కాని నిన్ను చూచాక ఇప్పుడు నాకు పునర్జన్మ సిద్ధాంతం మీద విశ్వాసం కలుగుతున్నది. నీది జన్మాంతర సంస్కారం బాబూ ?" అన్నాడు ఆనందంతో శ్రీనివాస చక్రవర్తి,

అక్కడినుంచి చక్రవర్తి తన స్వంత గొడవ చెప్పుకుపోతున్నాడు.

శ్రీనివాస చక్రవర్తి మంచి రచయిత. సంఘ సంస్కర్త. బోలెడంత ఆస్తీ ఎస్టేటూ వున్నాయి.

ఉన్న ఒక్క కొడుకూ అమెరికాలోనే ఉద్యోగం చేస్తూ ఆ దేశపు పిల్లనే చేసుకొని అక్కడే స్థిరపడిపోయాడు. ఇక వున్నది జయంతి, కూతురు. శ్రీనివాసచక్రవర్తి భార్య పోయింది ఇటీవలే. తలచెడ్డ అప్పచెల్లెలు ఒకామె చక్రవర్తిని ఆశ్రయించుకొని ఇంట్లో వుండి కుటుంబ విషయాలు చూస్తున్నది. చక్రవర్తికి ఒక మాసపత్రికా, పెద్ద ప్రెస్సూ వున్నాయి. ఇవికాక నగరానికి వెలువల ద్రాక్ష తోటలు వున్నాయి. ఇది స్థూలంగా చక్రవర్తి ఆనందుతో చెప్పిన కథ.

"రంగనాథరావంటే నాకు చాలా గౌరవం. ఆయన పంపాడంటే నీవు తప్పకుండా గొప్ప మేధావంతుడివనే నా ఉద్దేశం" అన్నాడు చక్రవర్తి మళ్ళీ.

"నేను చేయవలసిన పని...." ఆనందు అడిగాడు.

"ప్రెస్‌లో కూర్చో. అక్కడ శేషాచార్లున్నారు. మిగిలినదంతా ఆయనే చెపుతాడు" అన్నాడు చక్రవర్తి. అని చక్రవర్తి ప్రెస్‌కు ఫోన్ చేశాడు.

"బాబూ ! నువ్వు వెళ్ళు. నేను చెప్పాను ఫోనులో" అన్నాడు.

ఆనందు చక్రవర్తికి నమస్కరించి ప్రెస్ అడ్రసు తీసుకొని బయలు దేరాడు. ప్రెస్ హార్డీకర్ బాగ్‌లో వుంది.

'చక్రవర్తి ప్రింటర్స్' అని పెద్ద బోర్డ్. లోపల రాక్షసుల్లాగా మిషన్‌లు ధనధన రొద చేస్తున్నాయి న్యూస్‌ప్రింటును తమ కోరలతో కొరుకుతూ. ఆనంద్ లోపలికి పోయి శేషాచార్లుగారిని గూర్చి అడిగాడు.

"ఇక్కడే, ఇటురండి సార్! శేషాచార్లుగారు మీకోసం ఎదురుచూస్తున్నారు అర్ధగంటనుండి. చంద్రుడికోసం చకోరంలా" అని ఆనంద్‌ను ఒక గొంతు ఆహ్వానించింది.

తలెత్తి చూచాడు ముందుకు ఆనందు విన్నగొంతు - సన్నటి గొంతు!

"వీరే శేషాచార్లుగారు. వారి పంగనామాలను బట్టే వారు శేషాచార్లుగారని పోల్చుకోవచ్చును ఆనందబాబుగారూ!" అన్నదామె.

శేషాచార్లు ఆనందును ఆహ్వానించాడు.

"ఇప్పుడేచక్రవర్తిగారుపోనులోమీగూర్చిచెప్పారు"అన్నాడు శేషాచార్లుగారు.

ఆనందు ఆమెవైపు పరిశీలనగా చూశాడు. నిన్న పాంటూ, షర్టు వేసుకొని కూర్చున్న దొరబాబు ఈమేనని పోల్చుకున్నాడు.

"జయంతి- మన చక్రవర్తిగారి అమ్మాయిగారు. మనకు ఈమెగారే యజమానురాలనుకోండి" అని చిన్నగా నవ్వాడు శేషాచార్లు

"కోతలు కొయ్యవద్దు నాముందు శేషాచార్లుగారూ! ముఖప్రీతి మహా ప్రమాదం!" అన్నది జయంతి.

"మిస్టర్ ఆనంద్! ఇదే మీ సింహాసనం. కూర్చోండి. మళ్ళీ కలుద్దాం. బై-బై" అని లేడిలా గెంతుతూ వెళ్ళిపోయింది కంపోజింగ్ గాలీల మధ్యకు జయంతి.

శేషాచార్లుగారు ఆనందును కుశల ప్రశ్నలు వేశాడు.

"చూడండి! మీరేమీ భయపడవద్దు ఇక్కడి పని మొత్తం మీకు చక్కగా నేను నిదానంగా నేర్పుతాను. ఏమీ తొందరపడవలసిన అవసరం లేదు"అన్నాడు శేషాచార్లు.

శేషాచార్లు-ఆనందు- మాట్లాడుకుంటున్నప్పుడే జయంతి కారులో వెళ్ళిపోయింది. ఆనందు శేషాచార్లుగారిని పత్రిక గూర్చి ప్రశ్నించాడు.

"ఔను. పేరుకు జయంతి నడుపుతున్నట్లు డిక్లరేషన్ వుంది. కాని ఆ చావంతా నేనే చస్తున్నాను బాబూ!" అని శేషాచార్లుగారు నశ్యం బిగించాడు. గడియారం చూచుకొని రెండు టీలకు ఆర్డరిచ్చాడు.

"జయంతి మహా అల్లరిపుట్టం. మనలను ఏడిపించుకు తింటుంది.అయినా మనం తొణకకుండా పనిచేసుకుంటూ పోతేసరి. తెలిసిందా?"

తెలిసిందన్నట్లు తలూపాడు ఆనందు. అక్కడినుండి శేషాచార్లు ఆనందును వెంటబెట్టుకొని ప్రెస్‌లో ప్రింటింగ్ విభాగం, కంపోజింగ్ విభాగం, బైండింగ్ సెక్షన్, కటింగ్‌మిషన్ అన్నీ చూపించాడు. వర్కర్లను పరిచయం చేశాడు.

సాయంత్రందాకా శేషాచార్లు ఆనందుకు పని పాటలేవీ అప్పగించలేదు.

"చూడండి! మెల్ల మెల్లగా మీరే పని మొదలుపెట్టవచ్చు. వచ్చిన రచనలు చూడడం, కాస్త ప్రూఫులు చూచుకోవడం వగైరా రేపటినుండి ప్రారంభిద్దురు. జాబ్‌వర్క్ నేను చూచుకొంటాను" అన్నాడు శేషాచార్లు.

సాయంత్రం ఆరు కొట్టగానే బయటపడ్డాడు. శేషాచార్లు చెప్పినదాన్ని బట్టి తాను ఎడిటర్ కం ప్రూఫ్‌రీడర్ అని గ్రహించాడు. దానికి జీతమెంతో తెలియదు.

రూంకు వచ్చిన సత్యంతో చెబితే, "ఎంత ఇచ్చినా నోరు మూసుకొని తీసుకో. ఎం ఏ లు ఉద్యోగాలు లేక ఎల్ డి సి లుగా పనిచేస్తున్నారు" అన్నాడు సత్యం.

## 7

ఆనందుకు చిక్కడపల్లిలో నాలుగు గ్రీష్మాలు గడిచాయి.

అడపా దడపా ఇంటినుండి జాబులు వస్తూవుండేవి.

మొదటి రెండు సంవత్సరాలూ ఆనందు సూర్యాస్తమయం ఎలా వుంటుందో చూచి ఎరుగడు.

ఉదయమే లేచి ఎనిమిది గంటలకల్లా చక్రవర్తి ప్రింటర్స్‌కు పోయేవాడు. ఓ నాలుగు రోజులు చూచి చౌకీదార్ ఆనందుకే తాళంతీసే బాధ్యత అప్పగించాడు. చిరునవ్వుతో ఆనందు తాళాలు తీసుకున్నాడు.

ఆనందు ఎనిమిది గంటలకు వెళ్ళేవాడు. చౌకీదార్ తొమ్మిదింటికి వచ్చేవాడు. వర్కర్లు తొమ్మిదిన్నరకు వచ్చేవారు. శేషాచార్లు పదిన్నరకు వచ్చేవాడు. ఉదయం ఓసారి జయంతి వచ్చి వెళ్ళేది.

అప్పుడప్పుడూ సాయంత్రం చక్రవర్తి వస్తూ వుండేవాడు. ఆనందు ఎనిమిది గంటలకే పనిలో దిగిపోయేవాడు. వ్యాసాలు రాయడం, గాలీలు చూచుకోవడం, పేజీలు కట్టించడం కార్టూనిస్టును పిలవడం, మధ్యమధ్య చందాలు, ఎం. వోలూ సర్క్యులేషన్, పోస్టింగూ ఇలా పని తర్వాత పని తానే కల్పించుకొని యంత్రాలతోబాటు యంత్రంలాగా రాత్రి ఎనిమిది గంటలదాకా పనిచేస్తూనే వుండేవాడు.

రోటరీ సాయంత్రం ఆరు గంటలకే స్తంభించేది. దాన్ని నడిపే మావాటి వాడు ఆరు కాగానే వాహనం దిగేవాడు. కాని అనందు ఎనిమిది కొడితేనే కాని లేచేవాడుకాదు. ఒక్కొక్కప్పుడు అలా కథలు వ్రాస్తూ, చదువుతూ తొమ్మిది, పది వరకు కూడా ప్రెస్‌లోనే ఉండిపోయేవాడు.

అటు ఆనందు, ఇటు చౌకీదారు.

రాత్రి పది తర్వాత ప్రెస్సుకు తాళం వేసుకొని ఆనందే ఒక్కొక్కప్పుడు చివరగా ఇంటికి వెళ్ళేవాడు.

ఒకనాడు చక్రవర్తి ఆనందుకు చెప్పాడు డిగ్రీ పూర్తిచేయమని.

"నాకిక డిగ్రీలు వద్దు బాబుగారూ!" అన్నాడు అనందు.

చక్రవర్తి ఆనందును బాగా అర్థంచేసుకున్నాడు.

ఆనందు ఎంత ఎక్కువ ఆలోచిస్తాడో అంత తక్కువ మాట్లాడుతాడు. అంతేకాదు, మొండితనం ఆనందుకు లేదు. ఎదుటివాళ్ళు చెప్పేది అర్థంచేసుకుంటాడు.

"ఈ ప్రెస్సులూ, పత్రికలూ శాశ్వతాలుకావు. అయినా మన సంస్థ గౌరవార్థమయినా డిగ్రీ పూర్తిచెయ్యి" అన్నాడు చక్రవర్తి.

"మనిషిని డిగ్రీలతో కొలవడం మొదలుపెట్టిననాడే మన జాతి పతనమయింది. షేక్స్పియర్‌కూ పోతనకూ డిగ్రీలులేవు. కాని వాళ్ళమీద రీసెర్చి చేసి చాలామంది పిహెచ్.డి.లు తెచ్చుకున్నారు." అన్నాడు ఆనందు ఆత్మవిశ్వాసంతో.

చక్రవర్తి తెల్లని మీసాల మధ్యనుండి ఓ మల్లెలాంటి చిరునవ్వు విసిరాడు.

"అది ఆర్గ్యుమెంటు. నేనూ ఆర్గ్యూ చేస్తాను. 'గది గోడలనే కటకటాల మధ్యనుండి పిల్లలూ రండి, తూనిగల్లా ప్రకృతి మాత ఒడిలోకి. ప్రకృతినీ పొలాలనూ వదలి ఫాక్టరీలకు పారిపోతారెందుకు అమాయకుల్లారా!'-అని నేనూ ఉపన్యాసాలివ్వగలను. కాని ఉపన్యాసాలు వేరు, నిత్య జీవితం వేరు. డిగ్రీ వచ్చాక నీవీ మాటలంటే వాటికి గౌరవం ఎక్కువ వుంటుంది. లేకుంటే తనకు లేదని ఇలా అంటున్నాడు అని లోకం అనుకునే ప్రమాదం వుంది" అన్నాడు చక్రవర్తి.

చక్రవర్తిమీది గౌరవంతో ఆనందు బి.ఏ. పూర్తిచేశాడు. ఎం.ఏ. పూర్తి చేశాడు ప్రైవేటుగానే.

నాలుగవ గ్రీష్మం దాటాక ఎం.ఏ.లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైనట్లు పరీక్షా ఫలితాలు వచ్చాయి కళ్లు చెమ్మగిల్లాయి ఆనందంతో.

ఆనందు తల్లికిఈ వార్త జాబు రాయాలనుకున్నాడు.

ఆరోజే టెలిగ్రాం వచ్చింది సుశీలమ్మ స్వర్గస్థురాలైందని!

'ఏమిటీ విచిత్ర జీవితం? ఎందుకు నన్ను పరమేశ్వరుడు ఫక్కున నవ్వనీయుడు - భోరున ఏడ్వనీయడు?'

అని కంట తడిపెట్టాడు ఆనందు.

ఆనందు అమరావతి వెళ్ళి అన్ని కర్మలూ ముగించి వచ్చాడు.

"బౌద్ధ చైతన్యానికీ భాగ్యనగరానికీ మధ్యన వున్న నా చివరి అనుబంధం కూడా ముగిసిపోయింది ఈ చైన్‌లో లాస్ట్ లింక్ కూడా జారిపోయింది బాబుగారూ!"

అన్నాడు దుఃఖంతో ఆనందు.

చక్రవర్తి ఆనందుని ఓదార్చాడు.

ఇప్పుడు ఆనందుకు జీవితం చాలా అర్థరహితంగా కన్పించసాగింది.

ఎదురుగా ఏ ఆశయమూ, ఆదర్శమూ లేదు తనకు.

'తానెవరికోసం బ్రతకాలి?' అన్న ప్రశ్న ఉదయించింది హైదరాబాదుకు వచ్చిన నాలుగేళ్ళ తర్వాత ఆనందుకు.

"నాకోసం" అన్నాడు చక్రవర్తి ఒకనాడు.

"ఆనందూ! నీవు మా ఇంటికి వచ్చేయ్. ఎస్టేటు వ్యవహారాల్లో నాకు సహాయం చేస్తూవుండు" అని చాలా అనునయంగా అడిగాడు చక్రవర్తి.

ఆనందు చిక్కడపల్లి వదిలి బరకత్‌పురా చేరాడు. అయినా మనస్సుకు శాంతి దొరకలేదు. దానికితోడు జయంతి అల్లరి రోజురోజుకూ పెరుగుతున్నది.

ఒకరోజు తాను రాసుకుంటున్న పార్కర్ పెన్ దాచిపెట్టింది. ఆనాడు ఆనందు అన్నం ముట్టలేదు. ప్రెస్‌కు కూడా వెళ్ళలేదు.

"ఆనందు మహాశయా! ఏమిటిలా మౌనముద్ర వహించి గౌతమబుద్ధులై పోయారు? ఏదో సర్వస్వాన్ని పోగొట్టుకున్నట్టు బాధపడుతున్నారు. ఏమైనా కన్పడలేదా?" అంటూ గదిలోకి వచ్చింది జయంతి

"జయంతీ! నా పెన్ కన్పడలేదు!" అన్నాడు ఆనందు.

"ఎలాంటి పెన్? దానికి ఇంక్ పైనుంచి పోయాలా? కిందినుంచి పోయాలా? ఏరంగులో వుంటుంది? నేనెప్పుడైనా చూచి వుంటానా దాన్ని?" అని మొద్దబ్బాయి కథలోలా ప్రశ్నించింది.

"పార్కర్ పెన్. నీవు చాలాసార్లు చూచావు దాన్ని టేబిల్ మీద" అన్నాడు ఆనందు బాధగా.

"పోనీ, ఆ పార్కర్ పోతే ఇంకో పార్కర్ - లేదా బ్లాక్ బర్డు - నల్ల పక్షి. స్వాన్ - హంస, కామెల్-ఒంటె ఏదో ఒక జంతువో, పక్షో బజార్లో దొరుకుతుంది. అలాంటిది ఆ పెన్ మీదనే మీకంత మక్కువ ఎక్కువ ఎందుకు మహాశయ! ఏ ప్రియురాలైనా బహూకరించిందా?"

ఆనందుకు చప్పున దుఃఖం వచ్చింది.

అది చూచి జయంతి షాక్ తిన్నది.

"ఆయామ్ సారీ ఆనంద్! నేను నిన్ను అనవసరంగా బాధించాను" అని బయటకు వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఓ గంటకు ఆనందుకు మళ్ళీ తన గదిలోనే టేబిల్ మీదే పెన్ దొరికింది!

దొరికేటట్లు చేసింది జయంతి.

ఇంకొకరోజు ఇలాంటిదే తమాషా సంఘటన జరిగింది.

ఆనందు, నగరం వెలుపలి గ్రేప్ గార్డెన్స్‌కు వెళ్ళివచ్చాడు, చక్రవర్తి ఏదో కల్చరల్ ప్రోగ్రాంకు వెళ్ళాడు అప్పుడు. ఆనందు బాత్‌రూంలోకి పోయి స్నానం చేసివచ్చి దుస్తులు మార్చుకుందామనుకొని అద్దంముందు నిలబడి వుండగా అద్దంలో జయంతి కన్పించింది

వెనుదిరిగి చూచాడు.

ఆనందు రాసుకునే టేబిల్ ముందు కూర్చొని వుంది.

"జయంతీ ! ఏం చేస్తున్నావిక్కడ ? అన్నాడు ఆనందు కంగారుపడి.

"నీవున్నావో లేవోనని తొంగి చూచాను. తలుపు దగ్గరకు వేసి వుంది. లోపలికి వచ్చాను. టేబిల్ మీద ఏదో పుస్తకం వుంటే చూస్తున్నాను."

"అది ద్రాక్షతోటల లెక్క ! అన్నట్టు కిషన్‌లాల్, బాబూగారి కివ్వమని తోట దగ్గర రెండువేల రూపాయలు ఇచ్చాడు. అదీ టేబిల్ మీద వుంది చూడు" అన్నాడు టవల్‌తో తల తుడుచుకుంటూ.

జయంతి ఆనందు చూస్తుండగా ఆనందు పర్సును తీసింది, అందులో నుండి జయంతి ఫోటో, పాస్‌పోర్టుసైజుది కింద పడింది.

జయంతి తాచుపాములా పైకి లేచింది.

"ఏయ్ మిస్టర్ ! ఏమిటిది ?" అన్నది కోపంగా ప్రతి అక్షరాన్ని నొక్కుతూ.

ఆనందు అప్రతిభుడై గుడ్లప్పజెప్పి చూస్తున్నాడు.

"నా ఫోటో నీ పర్సులో పెట్టుకొని తిరగవలసిన అవసరం నీకేం కలిగింది ? నీవేం నా మేనత్త కొడుకువా ? తాళికట్టే మొగుడివా ? ఏమిటీ పనులు? ఈ బుద్ధులేమిటి ?" గట్టిగా కేకలు వేసింది జయంతి.

"నాకు - నాకేమీ తెలియదు జయంతి ! నీ ఫోటో నాకెందుకు ?" అన్నాడు నీళ్ళు నములుతూ ఆనందు.

"ఆ దొంగచూపులే చెపుతున్నాయి, అయ్యగారు చేసిన తప్పేమిటో ? ఏ స్థాయిలో వుండేవారు ఆ స్థాయిలోనే వుండటం మంచిది" అని రుసరుసలాడుతూ మేడ మెట్లెక్కి తన గదిలోకి పోయి రికార్డుప్లేయర్ ఆన్ చేసుకుంది.

పైనుంచి వెస్టర్న్ మ్యూజిక్ వస్తున్నది సన్నగా.

ఆనందు ఆ ఫోటో వైపు వెర్రి చూపులు చూస్తున్నాడు. 'జయంతిఫోటో ఎలా వచ్చింది తన పర్సులోకి ? ఎవరు పెట్టారు దాన్ని అందులో ?'

"ఏమిటే అమ్మాయీ అరుస్తున్నావు - కింద ఎవరిమీదా ?'

చక్రవర్తిగారి చెల్లెలు సుభద్రాదేవి అడుగుతున్నది.

"ఎవరో ప్రెస్‌లో పనివాళ్ళమీదలే. ప్రింటింగ్ మిస్టేక్స్ వచ్చాయి పేపర్లో ఫోన్లో అరుస్తున్నాను." జయంతి సమాధానం.

'ఈ పిల్ల నాతో ఆడుకుంటున్నది !' అని అనుకున్నాడు ఆనందు.

ఆనందు అనుకున్నట్లే అయింది. ఆ సాయంత్రం జయంతి మళ్ళీ ప్రెస్‌కు వచ్చింది.

అప్పుడక్కడ ఆనందు పేపరు పని ఏదో చూస్తున్నాడు ఆ రోజు రవీంద్రభారతిలోని డాన్స్ ప్రోగ్రాంకు సంబంధించి వంపిన కాంప్లిమెంటరీ పాస్‌ను జయంతి కిచ్చాడు శేషాచార్యులు.

ఆనందు కూర్చున్న చోటికి వచ్చి. "ఏంచేస్తున్నావ్ ?" అని అడిగింది.

'పేపర్ పని'

"వస్తావా బయటకు ?"

"రాను. పని వుంది "

"ఓహో !" అని తల వూపింది జయంతి.

"శేషాచార్లుగారూ ! ఆ పేపర్ పని మీరు చూస్తూ వుండండి. ఆనందుని అయ్యగారెందుకో అర్జంటుగా రమ్మన్నారు" అన్నది.

"చిత్తం అమ్మాయిగారూ !" అన్నాడు శేషాచార్లు.

"పద - ఆనంద్" అన్నది జయంతి.

వర్కర్లంతా తలలు వంచుకొని పనులు చేస్తూ అన్ని జతల చెవులు మాత్రం ఇటే పడేసి వుంచారు.

ఆనందు మారు మాట్లాడకుండా చేతిలోని పేపర్లు శేషాచార్ల ముందు పెట్టి బయటకు వచ్చాడు.

జయంతి కారు తలుపు తీసింది ఆనందు ఎక్కి కూర్చున్నాడు. హార్డీ కర్ బాగ్ నుండి లిబర్టీ మీదుగా సాగిపోతున్నది.

'ఇదేమిటి ? ఎక్కడికెళ్తున్నాం మనం ?' అన్నాడు ఆనందు.

'రవీంద్రభారతికి' అన్నది జయంతి.

'మీ నాన్నగారు ...'

"ఆయన మిమ్మల్ని రమ్మనలేదు సార్ ! నేనే రమ్మన్నాను. నేనయితేనేం - ఆయనయితేనేం ? మాలో ఎవరు చెప్పినా అది అఫీషియల్ వర్క్ కిందికే వస్తుంది."

"ఎట్లా వస్తుంది ? అవతల పేపర్ పని వదిలి, నీతో షికారుకు రావడం అఫిషియల్ వర్కు కాదు"

డ్రైవ్ చేస్తున్న జయంతి ఒకసారి వెనుదిరిగి అదోలా చూచి అన్నది, "అది అఫీషియల్ వర్కే ! రవీంద్ర భారతిలో ఇవ్వాళ నర్తకి దేవయాని నాట్యం వుంది. దాని మీద ఈ పత్రిక విడుదల కాకముందే నీవు సచిత్ర వ్యాసం ఇవ్వాలి."

ఆనంద్ మాట్లాడలేదు. కారు సెక్రటేరియట్ దాటింది.

"నీతో షికార్లు చేయడం నాకేమీ ముచ్చటకాదు. కో అంటే కోటిమంది కౌబాయిస్ ఇప్పుడు దూసుకుంటూ వస్తారు నా దగ్గరికి. ఏం గొప్ప నీ గొప్ప? గొప్ప రచయితవైనంత మాత్రాన నీ అంతస్థు మరచిపోకు. నీలాంటి వాళ్ళను డజన్లకొద్దీ అపాయింటు చేసుకోగలను నేను"

చాచి లెంపకాయ పెట్టి కారులోంచి దిగిపోవాలనిపించింది ఆనందుకు!

నిగ్రహించుకొని వూరుకున్నాడు.

కారు గోపీ హోటల్ దాటింది.

రవీంద్రభారతికి టరన్‌చేస్తూ అన్నది.

"అబ్బాయిగారు యివ్వాళ మంచి మూడ్‌లో లేరెందుకో? ఫోటో పర్సులో పెట్టుకున్నందుకు నేను .."

"నాకు ఫోటో సంగతి తెలియదు జయంతీ!"

గట్టిగా అన్నాడు ఆనందు.

"మైడియర్ యంగ్‌ఛాప్! ఆ ఫోటో నేనే నీ పర్సులో పెట్టి నాటకం ఆడాను. సరేనా! సంతృప్తి కలిగింది కదా! ఇక కారు దిగు" అన్నది కారును పార్కింగ్‌చేస్తూ జయంతి.

అప్పుడే అనుకున్నాడు ఆనంద్ ఈ జయంతిని హీరోయిన్‌గా చేసి ఒక రచన చేయాలని.

ఆనంద్, జయంతి రవీంద్రభారతి లోపలికి వెళ్ళారు.

నర్తకి దేవయానికి సన్మానం చేశారు కళాభారతి సంస్థవారు.

ఉపన్యాసాల అనంతరం, దేవయాని నృత్యం మొదలు పెట్టింది.

సంప్రదాయ నృత్యాలు, జానపద నృత్యాలు కూడా చేసింది.

మువ్వగోపాల పదం అభినయించింది. అన్నమయ్య, జయదేవుల పదాలు చేసింది. అద్భుతమైన ఒక పూజానృత్యాన్ని ప్రదర్శించింది.

"వ్యోమకేశునకు వందనము
ఉమామహేశునకు వందనము
జగదీశున కభివందనము
తారకలే పూజాక్షతలై

తల నెలవంకే తెలికప్పురమై
ప్రాచీప్రత్యూషాం కురధవళిమ
భస్మ రేఖయగు విశ్వ నటాగ్రణి ॥వ్యోమ॥
సాగరములు జలకేళికలై
సూర్యచంద్రులే నేత్రములై
గ్రహగోళములే కంఠహారమగు
కాలాతీతుడు మృత్యుంజయుడు ॥వ్యోమ॥
శబ్దార్థాధిష్ఠానదేవతై
అనాహతధ్వని కాదిమూర్తియై
రసగంగను దాల్చిన నర్తకుడు
పంచక్రియా ప్రవర్తకుడు
వ్యోమకేశునకు వందనము"

తర్వాత, జావళి. స్వయంగా దేవయాని పాడుతూ ఆడుతుంటే థియేటర్ మొత్తం ఉర్రూతలూగిపోయింది.

'ఈమె నిజంగా దేవ నర్తకి. మానవ నర్తకి కాదు' అనుకున్నాడు ఆనందు.

ప్రోగ్రాం అయిపోయాక కారులో కూర్చున్నాడు. జయంతి కారును ఏ.ఐ.ఆర్. ముందునుండి బషీర్‌బాగ్ వైపుగా నడిపిస్తున్నది.

"డాన్సు బాగుంది కదూ?" జయంతే ప్రశ్నించింది.

"చాలా బాగుంది జయంతీ! నిజంగా నన్ను నేను మరచిపోయాను."

కారు బషీర్‌బాగ్ చౌరస్తా క్రాస్ చేసింది.

"నన్ను క్లాసికల్ డాన్సు నేర్చుకోమంటావా ఆనంద్? అఫ్‌కోర్సు బాల్ రూం డాన్సులు వచ్చనుకో."

ఆనంద్ మాట్లాడలేదు.

"ఏం మాట్లాడవు? నీ కిష్టం లేదా?"

"నా ఇష్టంతో ఏం సంబంధం వుంది జయంతీ! మీ నాన్నగారి ఇష్టం వచ్చినట్లు చెయ్యి"

"ఆయనదంతా పాత చింతకాయ పచ్చడి ధోరణి. ఆయనకే డాన్సు నచ్చదు. నీ మాట చెప్పు?"

"నేనెవరిని చెప్పడానికి?" అన్నాడు ఆనందు.

"అయితే ఎవరు చెప్పాలట!" అన్నది జయంతి వ్యంగ్యంగా.

"ఎవరా? నీ మొగుడు చెప్పాలి" అన్నాడు ఆనంద్.

ఉదయంనుండి ఆనందు రగిలిపోతున్నాడు.

ఆనందుకు బాగా తెగింపు వచ్చింది. ఈ ఉద్యోగం లేకపోతే బతకలేక పోడు తాను. అయినా తనకు బతుకంటే ఏం పెద్ద లక్ష్యం వుంది కనుక?

అయితే జయంతికి కోపం రాలేదు. ఫెళ్ళుమని చిటికేశ్వరపు చెట్టు కొమ్మలు విరిగినట్లు నవ్వింది.

"నా మొగుడిని అడిగి ఆయనకిష్టమయితే అప్పుడు నేర్చుకోవాలంటావు డాన్సు-దట్సాల్ రైట్!" అని మళ్ళీ నవ్వింది.

కారు వై.యం.సి.ఏ వక్కగా బర్కత్‌పురాలోకి ప్రవేశించింది వేగంగా.

"ఏమిటంత రాష్‌గా డ్రైవ్ చేస్తున్నావు?" అన్నాడు ఆనందు.

జయంతి కి మాట విన్పడలేదు. ఆమె మనసు వేగంతో, కారు వందెం వేస్తున్నది. కారును గారేజ్‌లో పెట్టింది జయంతి.

ఆనందు తన గదిలోకి పోబోయాడు.

వరండాలో చక్రవర్తి, సుభద్రాదేవి కూర్చొని వున్నారు.

"ఎక్కడినుండి రావడం?" చక్రవర్తి పలకరించాడు.

"రవీంద్రభారతినుంచి- దేవయాని డాన్సు కవర్‌చేసి వస్తున్నాను" తలవంచుకొని జవాబుచెప్పాడు ఆనందు.

చక్రవర్తి ఇంకేం అడగలేదు. ఆనందు గదిలోకి వెళ్ళిపోయాడు.

జయంతి తాళంచేతులు బాగ్‌లో వేసుకొని సన్నగా ఈలవేస్తూ వస్తున్నది.

"చిలక గోరింకల్లా వున్నారు కదూ?" సుభద్రాదేవి అంది.

చక్రవర్తి నిండుగా నవ్వాడు తెల్లని గుబురు మీసాలను సర్దుకుంటూ.

## 8

"ఎందుకో పిలిపించారట?" డ్రాయింగ్ హాల్‌లోకి ప్రవేశిస్తూ అడిగాడు ఆనందు.

రమ్మన్నట్లు చిరునవ్వుతోనే పిలిచాడు చక్రవర్తి. ఆనందు వెళ్ళి దగ్గరగా కూర్చున్నాడు. ఇంట్లో ఎవరూలేరు.

"జయంతి లేనట్టుంది?" ఆనందు అడిగాడు.

"లేదు పిక్నిక్‌కు వెళ్ళింది"

"ఎవరితో?" ఆనందు అనాలోచితంగా అడిగాడు.

"ఎవరో వాళ్ళ కాలేజీ బాయిస్‌తో."

ఆనందుకు చక్రవర్తితో ఏదో చెప్పాలనిపించింది. తాను చక్రవర్తి ఉప్పు పులుసు తింటున్నాడు. చక్రవర్తికి ఆ మాత్రం సలహా చెప్పడం తన కనీస కర్తవ్యం. అనుకున్నాడు ఆనందు.

"మీరు మరోలా అనుకోకపోతే బాబుగారూ.... ఒక మాట చెపుతాను."

"ఏమిటి?"

"జయంతికి త్వరలో పెళ్ళిచేయడం మంచిది."

జయంతి పెళ్ళి టాపిక్ ఆనందు తీసుకువస్తాడని చక్రవర్తి ఊహించ లేదు. నిజానికి చక్రవర్తి పిలిపించింది కూడా ఆనందుతో జయంతి పెళ్ళిగూర్చి మాట్లాడేందుకే!

కొంచెమాగి చక్రవర్తి అన్నాడు. "నీకు కొన్ని సంగతులు చెప్పాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను. నేనా మరీ పెద్దవాణ్ణవుతున్నాను.

పెరిగే వయస్సే కాని వచ్చే వయస్సు కాదు. అబ్బాయి అమెరికానుండి రాడు. వాడికి ఆస్తి అక్కర్లేదు- ఆత్మీయులూ అక్కర్లేదు. కాకపోతే ఇక నాకు మిగిలిన బాధ్యత జయంతి! దాని బరువు నాకు లేకుండాపోతే నేనూ, సుభద్రా నిశ్చింతగా కన్నుమూస్తాము."

చక్రవర్తి పొడిదగ్గు దగ్గాడు.

"జయంతి అల్లరి, వయస్సుతోబాటు పెరుగుతున్నది"

ఆనందు నిర్భయంగానే అన్నాడు.

"ఔను ఆడపిల్లలకు అది సహజమే! ఆ మూడు ముళ్లూ పడితే అదే దారి లోకి వస్తుంది.

పైగా జయంతిని నేనొక విచిత్ర పరిస్థితులలో పెంచాను" అని చక్ర వర్తి గొంతు సవరించుకొని మళ్ళీ చెప్పాడు. "జయంతి తల్లి శ్రీలక్ష్మి. ఈ ఎస్టేట్ ఆమె తెచ్చిందే. అందువల్లనే శ్రీలక్ష్మికి 'ఈ సంపదంతా నాదే' నన్న అహంకారం వుండేది. నాకది అంతగా సరిపడేదికాదు. ఏదైనా మాట వస్తే 'మన సంపద మన ఎస్టేట్' అని నేను అంటూ వుండేవాణ్ణి. 'నా జవహరీ, నా ఎస్టేట్-నా ప్రెస్' అని శ్రీలక్ష్మి అంటూండేది. ఫలితంగా తరుచు మాకు

ఘర్షణలు జరుగుతూవుండేవి. ఈ ఘర్షణల ఫలితంగానే రమణకూ జయంతికీ కూడా తల్లిదండ్రుల మమకారం లభించవలసినంత, తగిన తరుణంలో లభించ లేదు. ఆవిడ నా బాధ పడలేక క్లబ్బులకూ మీటింగులకూ పోతూవుండేది. నేనేదో బిజినెస్ టూర్స్ పెట్టుకొంటూ వుండేవాణ్ణి. ఈ విధంగా పిల్లలిరువురూ చిన్నప్పటి నుండీ ఒక ఆర్డర్‌లో పెరగలేదు. రమణ మెడిసిన్ చేశాడు. తర్వాత అమెరికా వెళ్ళిపోయాడు. ఆ పౌరసత్వం తీసుకొని అక్కడ స్థిరపడ్డాడు. ఇక ఇంట్లో మిగిలింది జయంతి. అందువల్లనే జయంతి ఆడిందాట పాడింది పాట అయింది అటు తల్లి నిర్లక్ష్యం, ఇటు నా గారాబం జయంతిని పెంకిపిల్లను చేశాయి. అయినా నేను రమణనూ శ్రీలక్ష్మినీ కూడా జయంతిలోనే చూచుకుంటూ తృప్తి పడుతున్నాను"

చక్రవర్తి కళ్లు అర్ధ్రమైనాయి.

"శ్రీలక్ష్మి లేదు, రమణకూడా లేనివాళ్ళతోనే సమానమైనాడు. వాడిక ఈ దేశం రాడు. ఈ ఆస్తితో, ముసలి తండ్రితో వాడికి అక్కరేలేదు. ఎటుచూచి నాకున్నది జయంతి ఒక్కతే! అందుకే ఆమెను నేను మందలించలేకపోతున్నాను. పెళ్ళయితే దాని మొగుడే దాన్ని అదుపాజ్ఞలలో పెట్టుకుంటాడని ఊరుకున్నాను" అని చక్రవర్తి ఆగాడు.

"అయితే మంచి సంబంధాలేవైనా చూద్దాం. ఈ విషయంలో తమరు నన్నెక్కడికి వెళ్ళమంటే అక్కడికి వెళతాను బాబుగారూ!" అన్నాడు ఆనందు చాలా వినయంగా.

"బాబూ! నీవు నాకు అన్నివిధాలా సహాయం చేస్తావని నాకు తెలుసు. రంగనాథరావు దేవుతులాంటివాడు కాబట్టే నీవంటి బుద్ధిమంతుణ్ణి నా దగ్గరికి పంపించి నన్ను ఆదుకున్నాడు. అయితే చూడు! జయంతి మామూలు పిల్లకాదు. కేవలం ఆ పిల్లతోనే కాపురం చేయాలనే దృష్టితో సంసారపక్షంగా వచ్చేవాళ్లు అరుదు. ఎందుకంటే జయంతి అందమైనది, అందాన్ని మించిన ఆస్తి వుంది. కాబట్టి జయంతిని జయంతిగా కాక మరోలా చూచి వచ్చేవాళ్లు ఎక్కువ. అందు వల్లనే తగిన వరుణ్ణి నిర్ణయించడంలో చాలా ఆలోచించవలసి వస్తున్నది "

ఆనందు నిశ్శబ్దంగా వింటున్నాడు.

"ఆనంద్! నీవు ఐదేళ్లుగా నా కష్టసుఖాల్లో భాగాన్ని పంచుకొని నా నమ్మకాన్ని సంపాదించుకున్నావు - నా అభిమానానికి పాత్రుడివైనావు. అందుకు నీకు నేనొక మేలు చేయాలని అనుకుంటున్నాను."

"తప్పకుండా! మీరెప్పుడూ నా మేలు కోరుతారని నాకు తెలుసు" అన్నాడు ఆనందు.

'నిజానికి కేవలం అది నేను మేలు చేయడమేకాదు. నీవు నాకుకూడా చేయవలసిన మేలు' అన్నాడు చక్రవర్తి.

ఆనందు గుండె దడదడ కొట్టుకున్నది.

'ఆనంద్! ఈ ఎస్టేట్‌నూ, ప్రెస్‌నూ నేను చూస్తూ చూస్తూ అనర్హుడి చేతుల్లో పెట్టి వెళ్ళలేను. అందుకే దానికి తగిన వారసుడివి నీవేనని నేను నిర్ణయించాను. నా నిర్ణయం తప్పకాదెప్పుడూ. జయంతినీ, ఈ ఆస్తినీ ఇకమీద నీవే చూసుకోవాలి - ఇకమీద జయంతి నీ ఆస్తి'

ఆనందు వణికిపోయాడు.

'బాబుగారూ! బాబుగారూ!!'

ఆనందు నోటివెంట మాట రాలేదు.

'నా ఆరోగ్యం ఎప్పుడెలా వుంటుందో తెలియదు. అందుకే ఈ విషయాలు నీతో ఒకసారి వివరంగా మాట్లాడాలని చాలా రోజులుగా అనుకొంటున్నాను. నీవు 'సరే'నంటే జయంతిని కూర్చోబెట్టి ముఖాముఖి అన్ని విషయాలూ మాట్లాడుతాను. ఏమంటావు?'

'బాబుగారూ! ఇన్నాళ్లుగా ఇన్నేళ్లగా మీ ఆశ్రయంలో బతికాను నేను. మీ మాట ఎన్నడూ కాదనలేదు.'

'ఇప్పుడు కాదనవని నాకు తెలుసు.'

'బాబుగారూ! నన్నొకసారి ఆలోచించుకోనివ్వండి.'

'ఇందులో ఆలోచించవలసింది ఏముంది ఆనంద్? జయంతి అభిప్రాయం నేను గమనించాను. దానికి నీవంటే పంచప్రాణాలు. ఇక వెనుకా ముందు ఆలోచించవలసింది ఏమీలేదు పోనీ చెప్పవలసిన పెద్దలెవరైనా నీకున్నారా అంటే అదీలేదు. నీవు తీర్చవలసిన కమిట్‌మెంట్స్ కూడా ఏమీలేవు. ఇంక దేనినిగూర్చి ఆలోచన?'

ఆనందు సముద్రంలోంచి జాలరి వలలో వడ్డుకు లాగిన చేపలా గిలగిల కొట్టుకుంటున్నాడు. ఔనని అనలేడు. కాదని ఈ ముసలి ప్రాణంతో చెప్పలేడు.

'నీ అంగీకారం తెలిపితే తరువాత నేను ఆస్తిపాస్తులు జాగ్రత్తచేస్తూ విల్లు రాయిస్తాను ఎందుకంటే నా ఆరోగ్యం ఎంత అస్వస్థంగా వుందో నాకు తెలుసు, ఆ భగవంతుడికి తెలుసు.'

'బాబుగారూ! నేను జయంతికి అనర్హుణ్ణి బాబుగారూ!'

'అర్హతలు పరిగణించవలసింది మేము బాబూ! జయంతిని నీదాన్ని చేసుకొని నా తర్వాత ప్రాణప్రదంగా చూసుకుంటానని నాకు మాట ఇయ్యి' చక్రవర్తి చేయిజాపాడు.

వణికిపోతూ ఆనందు లేచి నిలబడి - 'నన్ను ఆలోచించుకోనివ్వండి బాబుగారూ!' అంటూ హాలులోంచి వెళ్ళిపోయాడు.

## 9

ఆనందు జయంతి పేర, ముందు తమ మాసపత్రికలో సీరియలైజ్ చేసి, తర్వాత పుస్తక రూపంలో తెచ్చిన 'రస రేఖలు'కు అవార్డు వచ్చింది!

దానితో జయంతికి పేరు ప్రతిష్ఠలు వచ్చాయి. జయంతికి ఆనందుమీద కొత్త గౌరవం ఏర్పడింది

'ఆనందుబాబూ! మీరు రేపో మాపో ఓ టాగూరు అయిపోతారు. అప్పుడీ చిన్నదాన్ని మరచిపోకండి సుమా!' అని పరాచికమాడింది.

చక్రవర్తితో సంభాషణ జరిగినప్పటినుండి ఆనందులో ఏదో మార్పు తెలియకుండానే వచ్చింది గాయం మానినట్లు గత చరిత్రను కాలం కొంత వరకు మాన్పింది. ఇప్పుడు ఆనందు మనస్సు జయంతివైపు మళ్ళింది. తన కొత్త నవలకు, కథలకు జయంతిని కేంద్రబిందువు చేసుకొని ఆనందు రచనా వ్యాసంగం సాగించాడు.

జయంతిలో అందం వుంది, జయంతి వెనుక ఐశ్వర్యం వుంది, జయంతి తనను కవ్విస్తున్నది, జయంతి తండ్రి తనను బలవంతపెడుతున్నాడు. నిజానికి ఇవేవీ తాను జయంతిచేత ఆకర్షింపబడడానికి తగిన కారణాలని ఆనందు అనుకోలేదు

ఆనందు ఈ అందాన్ని, ఐశ్వర్యాన్ని కూడా కోరుకోలేదునిజానికి! అయితే ఆనందుకు నేడొక ఆలంబన కావాలి. మూగబోయిన ఆనందు వీణ మోగించే వైణికులు రావాలి. ఆనందవంశిలో గాలిగా తానే నిండి ఆ పిల్లన గ్రోవిని ఆలాపించే ఒక మధుర కంఠం కావాలి.

జయంతి ఈ అవసరాన్ని తీరుస్తుందా?

జయంతి ఈ ఎత్తులకు ఎదగగలుగుతుందా??

దేవయాని రవీంద్ర భారతి కార్యక్రమంమీద ఆనందు రాసిన వ్యాసం పాఠకులకు నచ్చింది దేవయానిపై పరిచయాత్మక వ్యాసం కావాలని చాలా ఉత్తరాలు వచ్చాయి. దేవయానికి కబురు పెట్టాడు ఇంటర్వ్యూ కావాలని. తప్పకుండా రావలసిందని ఆహ్వానం అందింది. అడ్రసు తీసుకొని ఆనందు బయలుదేరాడు.

దేవయాని చార్మినార్ అవతల హుస్సేనియా ఆలం కమాన్‌కు ఇవతల ఒక పాత భవనంలో వుంది. అదికూడా మెహందీలో ఒక భాగమేనని ఆనందుకు తెలిసింది. ఆనందు లోపలికి రాగానే దేవయాని ఎంతో గౌరవంతో ఆహ్వానించింది.

'మీరు నా రవీంద్రభారతి ప్రోగ్రాం కవరుచేస్తూ వ్రాసిన సంచిక నాకు అందింది. కృతజ్ఞురాలిని' అన్నది దేవయాని.

ఆనందు దేవయాని ఇల్లు పరిశీలించాడు. ముగిసిన మొగలాయి వైభవంలా వుంది - చాందినీలు. ముఖమల్ పరుపులు, పాన్‌దాన్‌లు అంతా పాత వ్యవహారంలోనే వుంది అలంకరణ.

'ఎలావుంది మా భవనం?' చిరునవ్వుతో అడిగింది దేవయాని.

'చాలా బాగుంది కాకుంటే ఓల్డ్ మోడల్‌లోవుంది. ఏ బంజారాహిల్స్‌కో, బేగంపేటకో మారితే అందంగా వుండేదేమో!'

'ఎలా వుంటుంది? చార్మినార్‌వద్ద వున్నా, చంద్రమండలంవద్ద వున్నా దేవయాని దేవయానే అవుతుంది,' అన్నది దేవయాని.

దేవయాని అన్న ఈ మాట ఆనందుకు పూర్తిగా అర్థంకాలేదు.

'మనసులో, మాటలో, వయసులో, హొయలులో, అన్నింటా దేవయాని ప్రౌఢ' అనుకున్నాడు ఆనందు.

అక్కడినుండి దేవయాని తాను చేసిన నాట్య ప్రదర్శనలూ తాను ఏ.ఐ.ఆర్.లో ఇచ్చిన మ్యూజికల్ ప్రోగ్రామ్స్ వివరించడం మొదలుపెట్టింది.

ఆనందు ఓపికగా వింటున్నాడు మధ్య మధ్య పచ్చిపోకలు నములుతూ.

దేవయాని చెప్పేదంతా చెప్పనిచ్చి, 'పాఠకులు మీ జీవిత పరిచయం కావాలంటున్నారు' అన్నాడు.

'ఓహో! అంతేకదా! దానిని మీరు రాసి ప్రచురిస్తే సరిపోలేదా?' అన్నది దేవయాని నవ్వుతూ.

'ఎట్లా?' అన్నాడు ఆనంద్.

'ఎట్లాగేమిటి ఆనందబాబుగారూ? దేవయాని తండ్రి ప్రముఖ నాట్యాచార్యుడు గండ పెండేర కాశ్మీరభట్టు. సంగీత సాహిత్యాలు దేవయానికి వాళ్ళ తల్లి సాంధ్యశ్రీ ఉగ్గుపాలతో నేర్పింది. దేవయాని ప్రకృతిమాత ఒడినే బడిగా చేసుకొని నాట్యవిద్యనభ్యసించింది. భరతనాట్యం, కూచిపూడి, మణిపురి, కథక్. ఒడిస్సీ, దేవయానికి అరేళ్ళ లోపలే కరతలామలకాలు." అని, అలాగే కదా ఒక డాన్సర్‌ను మీరు పరిచయం చేస్తుంటారు."

"ఈమె గడసరి" అనుకున్నాడు ఆనందు.

దేవయాని ఆనందు వైపు అలాగే చూస్తున్నది.

"ఏమిటలా చూస్తున్నారు ?" అడిగాడు ఆనందు.

"ఏమీలేదు. మీ పాత్రలకూ మీకు చాలా తేడా వుంది. మీ పాత్రలు నవ్వుతుంటాయి, నవ్విస్తుంటాయి, ప్రేమిస్తుంటాయి, అపూర్వమైన త్యాగాలు చేస్తుంటాయి, అప్పుడప్పుడూ ఉపన్యాసాలిస్తుంటాయి. కాని మీరు మాత్రం ముభావంగా ముక్తసరిగా మాట్లాడుతూ, అమాయకంగా కూర్చున్నారే, అని మిమ్మల్ని చూస్తున్నాను."

"మీరు నా రచనలు చదివారా ?"

"అన్నీ చదివాను. చివరకు జయంతి పేర మీరు రాసిన 'రసరేఖలు' కూడా !"

"అదేమిటి ? జయంతి పేర నేను రాయడమేమిటి ?"

"దాచిపెట్టకండి ఆనంద్ బాబు ! నేను విపరీతంగా పుస్తకాలు చదువుతాను. ఏ కొత్త పుస్తకంలోనైనా ప్రముఖ రచయిత రాసిన నాలుగైదుపంక్తులు చదివి వినిపించండి చాలు - నేనా రచయిత పేరు చెప్పేస్తాను. శైలి కూడా మనిషిలాంటిదే ! శైలికి కిట్టూ బొట్టూ వుంటాయి. వగలూ, హొయలూ వుంటాయి. మనస్సు వుంటుంది, అక్షరాలకు బరువు ఉంటుంది. రంగు వుంటుంది. ఆత్మకూడా వుంటుంది. ఎవరి స్టైల్ వారిదే !"

'ఆషామాషి కబుర్లతో అపూర్వ కావ్య సిద్ధాంతాలు చెప్పేస్తున్నది దేవయాని' అనుకున్నాడు ఆనందు.

"మీ పుస్తకాలు చదివినప్పటినుంచీ మీరంటే తెలియని గౌరవం ఏర్పడింది. ముఖ్యంగా అమరావతి మ్యూజియంలోని శిల్పాలనూ, బౌద్ధ చైత్యాన్ని, నదినీ, లంకలనూ వర్ణిస్తూ మీరు రాసే కథలూ, నవలలూ నన్ను విపరీతంగా

ఆకర్షించాయి. అలాగే మీరు రాసె కథల్లో నాయిక ముగ్ధగా వుంటుంది. తల్లి చాటుబిడ్డ ప్రేమమయి, ఎవరో సజీవవ్యక్తి ఇలా మీ రచనల్లో నర్తిస్తున్నదా - అనిపించింది నాకు ముఖ్యంగా 'మధుబాల'లో"

ఆనందు నిర్వెరపోయాడు. తన రచనలను ఇంత నిశితంగా పరిశీలించి సమన్వయం చేస్తున్న వారున్నారన్న మాట లోకంలో !

దేవయాని చెప్పిన ప్రత్యక్షరమూ నిజం ! తన తొలి రచనలో అమరావతీ ప్రకృతిని కుండలతో కుమ్మరించాడు. అందులో ప్రతి అంగుళంలోనూ సరళ నాట్యమాడింది. దేవయాని ఆ రహస్యం గ్రహించింది.

"ఈమె సామాన్య నర్తకి కాదు. గొప్ప కళావేత్త. రససిద్ధి పొందిన మనీషి" అనుకున్నాడు ఆనందు.

"ఇంతకూ నేను వచ్చిన పని కాలేదు" అన్నాడు ఆనందు. దేవయాని నవ్వింది. పక్కనే బీరువాలోంచి ఓ సైక్లోస్టయిల్డ్ పేపర్ చేతి కిచ్చింది.

"ఇందులో అంతా రడీమేడ్‌గా వుంది. దాన్ని యథాతథంగా కంపోజ్ చేసుకుంటే చాలు. అంటే మీరు వచ్చిన పని పది సెకండ్లలో అయిపోయినట్లే" అన్నది నవ్వుతూ దేవయాని.

ఆ తర్వాత దేవయాని ఆనందుకు ఇల్లంతా చూపించింది. దేవయానికి చాలా పెద్ద లైబ్రరీ వుంది. అందులో చాలా ఇంగ్లీషు పుస్తకాలూ, ఫిలాసఫీ బుక్స్ కూడా వున్నాయి.

"మంచి టేస్ట్ " అనుకున్నాడు ఆనందు.

దేవయాని నవ్వింది.

"ఎందుకు నవ్వారు ?" అని అడిగాడు ఆనందు.

"ఏమీలేదు. యీ డాన్సర్‌కు చాలా మంచి టేస్ట్ వుందే - అని మీరు మనస్సులో అనుకున్నారు. అందుకని నవ్వాను" అన్నది దేవయాని మళ్ళీ నవ్వుతూ.

"అవలిస్తే పేగులు లెక్కబెట్టడమంటే ఇదే - దేవయాని అవలించకుండానే పేగులు లెక్కబెడుతున్నది' అనుకున్నాడు ఆనందు.

"ఆనంద్ బాబూ ! మీ నవలల్లో పాత్రలు బాగా వాగుతుంటాయి. కాని మీకు జీవితంలో స్వగతాలు ఎక్కువలా వుంది" అన్నది మళ్ళీ దేవయాని.

"కావచ్చు' అన్నాడు ఆనందు.

"నేను చూస్తున్నాను - మీరు వచ్చిన దగ్గరనుండి మీలో మీరే స్వగతాలు చెప్పుకుంటున్నారు. మొత్తం కలిసి ఓ పది మాటలు కూడా మాట్లాడలేదు. తమాషాగా వుంది కదూ !" అన్నది దేవయాని.

'ఒక్కసారి పరిచయంతో ఒక్క గంటలో తనను ఆమూలాగ్ర విశ్లేషణ చేసివేసింది ఈమె' అనుకున్నాడు ఆనందు మళ్ళీ.

'మరింక శలవుతీసుకుంటాను.' అన్నాడు ఆనందు.

'మీకా ఖిలాయించకుండానే పంపుతామా ?' అన్నది దేవయాని.

లోపలికి నెళ్ళి ఏదో ఒక తీపి వంటకం తెచ్చింది. అది కలాఖండ్‌కు కొంచెం సన్నిహితంగా వుంది.

"దీని పేరేమిటి ?" అని మాత్రం ఆనందు అడగలేదు.

'చాలా బాగుంది !' అన్నాడు.

"నేను స్వయంగా చేసాను " అన్నది దేవయాని కొంచెం కొంచెం తన కప్పులోది స్పూనుతో తింటూ

'మీరు స్వచ్ఛమైన తెలుగు మాట్లాడుతున్నారు....' అన్నాడు ఆనందు.

"పూర్వం ఇంకా స్వచ్ఛంగా మాట్లాడేదాన్ని. ఇప్పుడు కావాలనే కల్తీ అయిపోయాను" అన్నది దేవయాని.

ఇంతలో బజారునుండి కూరలు తీసుకొని ఓ ముసలావిడ వచ్చింది. ఆమె వెంట ఒక నౌకరు వున్నాడు.

'ఈమె మా అమ్మ ! అసలు పేరు చంద్రమ్మ. అందంగా లేదని చంద్రలేఖ అని నేనే మార్చాను మీ పత్రికా భాషకోసం. కావాలంటే దేవయాని తల్లి సాంధ్యశ్రీ సర్వకళాకోవిదురాలు అని మార్చి రాసుకోండి" అన్నది దేవయాని.

దేవయాని ఆనందుకు చంద్రలేఖను పరిచయం చేసింది.

చంద్రలేఖ నాటకీయంగా డైలాగులు చెప్పింది. 'మీరు రావడంవల్ల మా ఇల్లు నేకు పావనమయింది. మీవంటి కళారాధకులూ, కళా పోషకులూ నిరంతరం వస్తూంటేనే మా లలితకళలకు ఎనలేని సాఫల్యం."

"వల్లకాదు. నీ పోర్షన్ వప్పగించకు. ఆయన మనింటికివచ్చే మామూలు కళారాధకులు, కళాకారుల లిస్టులోకి రాడు. అయన ప్రెస్ రిపోర్టర్. నా గూర్చి పత్రికల్లో రాద్దామని వచ్చాడు.' అన్నది దేవయాని కోపంగా.

చంద్రలేఖ నాలుక కరుచుకొని లోపలికి వెళ్ళిపోయింది.

ఆనంద్ చేతులు కడుక్కున్నాడు.

'ఆనంద్ బాబూ ! నాదొక చిన్న కోరిక.' అన్నది దేవయాని.

'ఏమిట'న్నట్లు చూచాడు.

'మన జీవితాలలో ఎన్నో ఒడుదుడుకులు వస్తుంటాయి. అది మానవ సహజం. అయితే విశిష్టమయిన కళా జీవితం దేవుడు ప్రసాదించిన వరం. ఆ వరాన్ని మనం విర్లక్ష్యం చేయకూడదు' అన్నది దేవయాని.

దేవయాని చెప్పదలుచుకున్నదేమిటో ఆనందుకు సగం మాత్రమే అర్థమైంది.

ఆ విషయం దేవయానికి తెలుసు. అందుకే మళ్ళీ చెప్పింది.

'నేను జీవితంలో చాలా కష్టాలు అనుభవించాను. మరొకరైతే నా స్థితిలో ఆత్మహత్య చేసుకొని వుండేవారు అయితే నా కష్టాలనుండే నేను రోజురోజుకూ స్ఫూర్తి పొందడం నేర్చుకున్నాను దాని వల్ల నా కళ రోజు రోజుకూ, సాన పెట్టబడ్డది. ఇదే నా జీవన రహస్యం. ఆనంద్ బాబూ ! మీకిచ్చిన సైక్లొస్టైల్డ్ పేపర్‌లో వున్న విశేషాలన్నీ కేవలం ప్రచారానికి పనికివచ్చేవే !'

అన్యాపదేశంగా దేవయాని ఆనందుకు చెప్పదలచుకున్నదేమిటో ఆనందు అర్ధం చేసుకున్నాడు. కష్టాలనుండే స్ఫూర్తి పొందమని తనకు ఆమె సలహా ఇస్తున్నది. కలాన్ని ఆపవద్దని పరోక్షంగా సూచిస్తున్నది.

'ఏదో కోరికఅన్నారు ..."

'ఏమీలేదు. అఫ్‌కోర్సు - నేను అందరితోనూ కర్టసీ కోసం ఇలాగే అంటానని మీరు అనుకోవచ్చు కాని మీకిది స్పెషల్ రిక్వెస్టు, దయచేసి వీలైన ప్పుడల్లా మా ఇంటికి వచ్చిపోతూవుండండి.'

ఆనందు పేపర్లనూ, పార్కర్ పెన్‌నూ జేబులో పెట్టుకున్నాడు. వెడల్పుగా పరిచివున్న రంగుల తివాసీ మీదుగా నడుచుకుంటూ బయటకు వచ్చాడు. గుమ్మందాకా వచ్చి వీడ్కోలు చెప్పింది దేవయాని.

## 10

"మైడియర్ యంగ్ షేక్స్పియర్ ! ఏమిటి సీరియస్‌గా ఆలోచిస్తున్నావు?"

గడ్డిపూలు కోస్తూ అడిగింది జయంతి ఆనందును.

ఆనందు జూలో దూరంగా వున్న జంతువులను చూస్తున్నాడు.

'మావవ్వుడు - విచిత్రమైనవాడు. తన ఆనందం కోసం సమస్త సృష్టినీ బంధీ చేస్తాడు' అనుకున్నారు ఆనందు.

జయంతి ఆనందు వీపుమీద చరిచింది.

'అయ్యో, సోక్రటీసుగారూ ! మీరెప్పుడూ ఆలోచిస్తూ కూర్చుంటే జీవితం గడవదు. ఆలోచనలు జీవితం కోసం, అంతేకాని ఆలోచించడానికే జీవించడంలేదుగా ?' అన్నది జయంతి గడ్డిలో వెల్లికిలా పడుకొని.

'ఏమీటి జయంతీ !' ప్రేమగా అడిగాడు ఆనందు జయంతి కళ్ళల్లోకి చూస్తూ.

అతని మదిలో మళ్ళీ కవిత మెదిలింది.

'ఎవరితో పోల్చను, నిన్ను అనుపమా !'

పోలికేలేని దివ్య సౌందర్యరాశివి ప్రియతమా ! రతీదేవి కనుబొమ్మల హరివిల్లువా ? ఇంద్రుని చిరునవ్వుల జల్లువా ?'

జయంతి మాటతో ఆనందు కవితా ప్రవాహానికి బ్రేక్ పడింది.

'నేనివ్వాళ నీతో ఒక విషయం చాలా సీరియస్‌గా మాట్లాడాలనుకుంటున్నాను ఏకాంతంగా !'

'ఇది ఏకాంతమే ! నీవు తప్ప ఏకాంతా లేదు, మాట్లాడు.'

"ఏమీ లేదు. నేనే నీ భార్య నయితే ఎలా వుంటుందో వూహించుకో !"

ఆనందు ఉలిక్కిపడ్డాడు.

'అవును మిస్టర్ ! మనిద్దరం భార్యా భర్తల మనుకో - అప్పుడు జీవితం ఎలా వుంటుంది ? నీవు రచయితవు కదా ! ఇమాజిన్ చెయ్యి'

'నువ్వు చెయ్యి'

'చెయ్యమంటావా....అయితే విను ! మనిద్దరం పెళ్ళి చేసుకున్నట్లు ఓ పత్రికా ప్రకటన ఇస్తాం. ఫోటోతో సహా.'

'ఇదేమిటి ; రిజిష్టర్ మారేజీయా ?'

'కాదులే. ట్రెడిషనల్ నాయే అయినా ఇదో స్టయిల్. నీకు బొత్తిగా మోడరన్ స్టయిల్స్ తెలియవు. ఆఁ .. ఏం చెప్పాను ? పత్రికల్లో న్యూస్ ప్లస్ ఫోటో ఇస్తాము. ఆ తర్వాత ఏ ద్వారకాలోనో సరోవర్‌లోనో పెద్ద పార్టీ యిస్తాం. తర్వాత హనీమూన్ వెళ్తాం. ఊటీ, కాశ్మీర్, సిమ్లా అలా అలా ఆ తర్వాత ఓ ఫారిన్ ట్రిప్ కూడా కొట్టాలి. ఎందుకంటే యీ డర్టీ కంట్రీలో ఫారిన్ పొయ్యొస్తేనేకాని గౌరవం లేదు. ఆ తర్వాత....ఆ తర్వాత ఏం చేయాలి ఆనంద్ ? చెప్పు - చెప్పు !" ఆనందు భుజాలమీద చేతులు వేసి వూపుతూ అడిగింది.

"నీ నెరేషన్‌లో ఎక్కడా ఇల్లూ, పిల్లలు, సంసారం యిలాంటి అంశాలే రాలేదు జయంతీ !" అన్నాడు ఆనందు.

'ఊహూఁ !' అని జయంతి ఆనందును నెట్టింది. ఆనందు వెల్లికలా గడ్డి మీద పడ్డాడు.

'యూ ఫూలిష్ క్రీచర్ ! నా మూడ్స్ మొత్తం పాడుచేశావు, నేనేదో స్వర్గసీమల్లో విహరిస్తూంటే నీవు చప్పటి అనుభూతులను గుర్తు చేసి రసభంగం చేశావు" అని జయంతి తన వానిటీబాగ్‌లోంచి కాస్త చూయింగ్‌గమ్ నోట్లోవేసుకొని నములసాగింది.

ఆనందు నవ్వాడు.

'ఎందుకలా నవ్వుతున్నావ్ ?' కోపంగా అడిగింది జయంతి.

'ఎందుకంటే - నీ వెనుక ఏదో కనిపిస్తేను'

జయంతి వెనుదిరిగి చూచింది.

వెనుక ఓ చెట్టుమీద కోతి ఏమిటో నములుతూ వుంది.

జయంతికి కోపం వచ్చింది. ఆనందు వీపుమీద దబదబా నాలుగు దెబ్బలు కొట్టింది.

'నేను కోతినా ? యూ డర్టీ బాయ్ !' అని గెంతింది.

'పద, నాన్నతో చెపుతాను.'

'చెప్పు - చెప్పు. ఆయన ఇవ్వాళే నీ పెళ్ళి చేస్తాడు.'

జయంతి ఆనందును రెక్కబట్టి గుంజింది. ఆనందు లేచి నిలబడ్డాడు.

'ఇవ్వాల్టికి పిక్నిక్ చాలు. ఒక రోజు సార్థకమైంది. రేపు ఇంకో వైపు - గండిపేటకో, హిమాయత్‌సాగర్‌కో. ఇంకో మజా - ఇంకో సరదా ! చల్ - చల్' అని జయంతి లేడిలా గెంతుతూ బయట కారు పార్కింగ్ చేసిన చోటికి బయలుదేరింది.

'చక్రవర్తితో జరిగిన సంభాషణ జయంతితో చెప్పలేదే !' అనుకున్నాడు ఆనందు.

'పోనీలే - ఆయనే చెబుతాడులే' ఇని ఊరుకున్నాడు.

## 11

జయంతి బొంబాయిలో బంధువుల ఇంటికి పెళ్ళికి వెళ్ళింది. ఎవరూ రిప్రజెంటు చేయకపోతే బాగుండదని చక్రవర్తి జయంతిని తన తరఫున పంపించాడు- సుభద్రాదేవితో, సుభద్ర తిరిగి వచ్చింది.

'జయంతి రాలేదేం ?' అని అడిగాడు చక్రవర్తి.

'వాళ్ళు జయంతిని వదలడంలేదు. ఓ పదిహేను రోజులైనా ఉండనిదే పంపమంటున్నారు గోపాల్, పద్మాక్షి,'

చక్రవర్తి ఆనందుతో మాట్లాడి పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టాడు. పెళ్ళి ద్వారకాలో చేయాలా, బాలాజీలో చేయాలా ? రిసెప్షన్ ఎక్కడ యివ్వాలి ? రమణను అమెరికా నుంచి ఎప్పుడు పిలిపించాలి ? ఇవన్నీ ప్లాన్ చేస్తున్నాడు చక్రవర్తి.

ఆనందు శుభలేఖలు పంపాల్సిన లిష్టు తయారు చేసుకున్నాడు. జయంతి ఇంకా రాలేదు. అర్జంటుగా పంపమని టెలిగ్రాం ఇచ్చాడు చక్రవర్తి గోపాల్‌కు.

మహబూబ్‌నగర్ నుండి రావలసిన డబ్బు వసూలు చేసుకొని రావడం కోసం కారుమీద వెళ్ళాడు ఆనందు. అక్కడ అనుకోకుండా ఒక రాత్రి ఉండి పోయాడు. మరునాడు మధ్యాహ్నం మహబూబ్‌నగర్, కల్వకుర్తి గ్రామాలలో బాకీలు వసూలైనాయి. సాయంత్రం కల్వకుర్తినుండి బయలుదేరాడు. హైదరాబాదు వచ్చేసరికి కొంచెం పొద్దుపోయింది గాలి దుమారం వచ్చింది తీవ్రంగా - లైట్లు పోయాయి.

నగరమంతా కొవ్వొత్తులు వెలుగుతున్నాయి.

ఆనందు కారును పోర్టికో కింద ఆపి తన గదిలోకి వెళ్ళాడు. కొవ్వొత్తులు వెలిగించి బట్టలు మార్చుకున్నాడు. మేడమీద ఎక్కడా అలికిడి వినిపించడంలేదు.

'అగమయ్యా ! అయ్యగారు లేరా ?' అని అడిగాడు వాకిట్లో వున్న నౌకరును-

అగమయ్య మాట్లాడలేదు.

'అగమయ్యా !' మళ్ళీ పిలిచాడు ఆనందు.

'బాబూ !' అన్నాడు అగమయ్య.

చీకట్లో అగమయ్య ముఖం కన్పించడంలేదు.

"అయ్యగారేంచేస్తున్నారు ?"

"పడుకున్నారండీ !" అగమయ్య కంఠం వణుకుతున్నది.

"అగమయ్యా ! ఇలా రా."

అగమయ్య యంత్రంలా నడుస్తూ ఆనందు గదిలోకి వచ్చాడు. అగమయ్య ముఖం చాలా భయంకరంగా వుంది.

అగమయ్యను అలా ఎప్పుడూ చూడలేదు ఆనందు.

"అగమయ్యా ! ఏమిటలా వున్నావు ?"

అగమయ్య మాట్లాడలేదు. వణికిపోతున్నాడు.

"అగమయ్యా, అగమయ్యా ! ఏమయింది అగమయ్యా ?"

"ఏంలేదు బాబూ !"

"అంతా బాగానే వున్నారు కదా ?"

"ఆ ! అంతా మంచిగనే వున్నారు బాబూ !" అని అగమయ్య గది లోంచి బయటకు పోయే ప్రయత్నం చేశాడు.

ఆనందు పోనివ్వలేదు అగమయ్య ఏదో దాస్తున్నాడని గ్రహించాడు.

'అగమయ్యా ! ఏమయింది అగమయ్యా ?'

"..................."

"అమ్మాయిగారు బొంబాయి నుండి వచ్చిన్రు బాబూ ;"

"అలాగా ! మేడమీద వుందా ?"

"లేదు బాబూ ! మన ఇంట్లో దిగలేదు."

"అంటే ?"

"ఆమె బొంబాయిలో - ఎవరినో పెళ్ళి చేసుకున్నారంట బాబూ !"

గాలికి కొవ్వొత్తి రెపరెపలాడుతున్నది నిలుద్దామా, వద్దా అన్నట్లు.

"ఆయనతోనే వేరే ఎక్కడో దిగింది. ఆబిడ్స్‌లోనో, బంజారాహిల్స్ లోనో మరి...."

"..................."

"ఉదయం వాళ్ళిద్దరూ వచ్చి అయ్యగారికి కనపడిన్రు బాబూ ! అయ్య గారు పరేశాన్ అయిన్రు. వాళ్ళిద్దరూ అయ్యగారికి మొక్కిన్రు. అయ్యగారు మొక్కించుకోలేదు. గదిలోకి పోయి తలుపులు మూసుకున్నారు. ఇప్పటిదాకా తెరవలేదు. మేమెవ్వరం కిటికీలోంచి పిలిచినా 'అగమయ్యా ! అవతలికి పో' అని కసురుకుంటున్నారు."

గాలికి ఆనందు గదిలోని కొవ్వొత్తి ఆరిపోయింది. అగమయ్య అన్నాడు. "అళ్ళు - మనోళ్ళు కాదు బాబూ ! వేరేవాళ్ళు. ఆయన పేరు క్రిస్టఫరుట !"

అగమయ్య కొవ్వొత్తిని వెలిగించేందుకై జేబులోంచి అగ్గిపెట్టెను తీసి పుల్ల గీచాడు. గాలికి నిలవలేదు పుల్ల.

'అగమయ్యా ! నువ్వెళ్ళు' అన్నాడు ఆనందు.

అగమయ్యకు ఇంక మాట్లాడే సాహసం లేకపోయింది, వెళ్ళిపోయాడు.

ఆనందు గదిలో కుర్చీలో కూలబడ్డాడు. సన్నగా వాన ప్రారంభమైంది. రివ్వున గాలి వీస్తున్నది. లోపలా బయటా మొత్తం చీకటి.

కిటికీ గుండా ఆకాశాన్ని చూస్తూ కూర్చున్నాడు, ఆకాశం నల్లగా వుంది మధ్య మధ్య ఉరుముతూ అలా ఎంత సేపు కూర్చున్నాడో మరి.

ఒక రాత్రికి లైట్లు వచ్చాయి ఆనందు బ్రీఫ్‌కేస్ తీసుకుని మేడ మెట్లెక్కాడు.

"బాబుగారూ - బాబుగారూ !" తలుపు తట్టాడు ఆనందు.

సుభద్రాదేవి తలుపు తీసింది. ఆనందును చూచి కంట తడిబెట్టుకుంది. గడియారం పన్నెండు గంటలు కొట్టింది. చక్రవర్తీ, సుభద్రా మేల్కొనే వున్నారు.

బ్రీఫ్‌కేస్ లోంచి డబ్బు తీసి టేబిల్ మీద పెట్టాడు ఆనందు.

"మహబూబ్‌నగర్‌లో అయిదువేలు వచ్చాయి. కల్వకుర్తి వాళ్ళు చెక్కు ఇచ్చారు ఆరువేలకు"

చక్రవర్తి ఆనందును కూర్చోమన్నాడు.

ఆనందు కూర్చున్నాడు

చక్రవర్తి ఏదో మాట్లాడాలని రెండు మూడు సార్లు ప్రయత్నం చేసాడు. కాని ఏమీ మాట్లాడలేకపోయాడు

"జయంతి వచ్చింది బొంబాయి నుంచి" అన్నాడు చివరకు.

"విన్నానండి. అగమయ్య చెప్పాడు" అన్నాడు ఆనందు మెల్లగా.

'నేనేదో ఊహించాను. ఏదో చేద్దామనుకున్నాను. చివరకు ఏదో అయింది! అన్నాడు చక్రవర్తి.

ఆనందు ఏమీ మాట్లాడలేదు. చక్రవర్తి ఆయాసపడుతున్నాడు.

"బాబుగారూ ! మీరు విశ్రాంతి తీసుకోండి" అన్నాడు ఆనందు.

చక్రవర్తి నవ్వాడు. ఆ నవ్వు మామూలు నవ్వులా లేదు. ఏదో విచిత్రంగా వుంది.

"ఆనంద్ !" అన్నాడు చక్రవర్తి.

ఆనంద్ తల పైకెత్తాడు. దగ్గరకు రమ్మన్నాడు చక్రవర్తి. ఆనందు దగ్గరకు పోయాడు. ఆనందు రెండు చేతులు పట్టుకొని "ఐయామ్‌సారీ ఆనంద్!"

అన్నాడు. అని చేతులు వదిలేశాడు. వదిలేసి అటు తిరిగి పడుకున్నాడు ముఖం చాటు చేసుకొని.

ఆనందు మేడ దిగి కిందికి వచ్చాడు. గది మొత్తం వెలుగుతో నిండి వుంది.

ఆనందు మంచంమీద పడుకున్నాడు. అతని గుండెలను గునపాలతో కుమ్మినట్లనిపించింది.

'జయంతీ ! జయంతీ ! నిద్రిస్తున్న శిలకు ఎందుకు నీవు ప్రాణం పోయాలని ప్రయత్నించావు ? అర్థంలేని ఆశలను ఎందుకు నాలో రెచ్చగొట్టావు ? ఎందుకు నా జీవితంతో ఆడుకున్నావు జయంతీ !'

ఆనందు కళ్ళ వెంట వెచ్చటి నీటిబిందువులు రాలాయి.

## 12

జయంతీ - క్రిస్టఫర్ కరుణానంద్ ల వివాహాన్ని పురస్కరించుకొని చక్రవర్తి పెద్ద పార్టీ ఏర్పాటు చేశాడు. వరుడు పారిస్ పోతున్నందువల్ల అర్జంటుగా బొంబాయిలోనే ఎక్కడా ఏ లోపం లేకుండా వివాహం జరిగింది. దానికి పార్టీ ఇక్కడ యిస్తున్నట్లు సంజాయిషీ చెప్పుకున్నాడు శ్రీనివాస చక్రవర్తి !

చక్రవర్తి పార్టీలో ఒక్కొక్కరినీ వరుడికి పరిచయం చేశాడు.

"వారే శేషాచార్లు - మన ప్రింటింగ్ వర్క్సుకు ప్రాణం ఈయన పోచయ్య - మన మిషన్ మెన్, ఈయన "

ఆనందు వచ్చి క్రిస్టఫర్ కు షేక్ హాండ్ ఇచ్చాడు.

"హ్వాహే ! వాట్ మిస్టర్ ! ఏం చేస్తున్నావ్ ?" జయంతి చిలిపిగా ప్రశ్నించింది.

"ఈయన పేరు ఆనందు మా ప్రెస్ లో ఎడిటర్ కం ప్రూఫ్ రీడర్ కం రీడర్. ఈయనే కథలు రాసుకొని వాటికి ఆయనే పాఠకుడవుతుంటాడు" అని విరగబడి నవ్వింది జయంతి.

"హల్లో ! నేను వ్రాయబోయే కథకు, తీయబోయే చిత్రానికి నీపై ఎక్స్పెరిమెంట్ చేశాను ...ఎలా వుంది నా యాక్టింగ్ ?" కొంచెం పక్కకు వచ్చి గుసగుసలాడినట్లు అడిగింది నవ్వుతూ -

ఆనందు ఈ ఛలోక్తులకు తట్టుకోలేకపోయాడు. కొత్తగా విడుదలైన తన "మధువని" నూతన వధూవరులకు కానుకగా సమర్పించాడు. మధువనిలో హీరోయిన్ జయంతి. జయంతి సజీవ చిత్రణం ఆ నవల.

"చెప్పలేదూ - ఈయనో పుస్తకాల పురుగు, కదిలితే పుస్తకం, మెదిలితే పుస్తకం" అని క్రిస్టఫర్‌తో చెప్పి మధావనిని అవతల ప్రెజెంటేషన్సు పెట్టిన టేబిల్ మీద పారేసింది జయంతి.

పార్టీ అనంతరం దేవయాని నాట్యం.

నారాయణ తీర్థుల సంగీతాన్ని అభినయించింది. ప్రేక్షకులు తన్మయులైనారు. ప్రదర్శన ముగిశాక అలాగే మేకప్‌తో వధూవరుల దగ్గరికి పిలిపించాడు దేవయానిని చక్రవర్తి.

దేవయానితో నూతన దంపతులకు ఫోటోలు తీయించాడు అంటే మర్నాడు అవి పేపర్లో వస్తాయన్న మాట. దేవయాని ఓ మూల కూర్చున్న ఆనందును చూచింది.

గజ్జెలు గలగలలాడించుకుంటూ నడిచి ఆనందు దగ్గరికి వచ్చి నవ్వింది ఆనందు కూడా సమాధానంగా నవ్వాడు.

"మీరొకసారి రేపు మా ఇంటికి వస్తారా, ప్లీజ్ !"

"అలాగే" అన్నాడు ఆనందు.

తర్వాత దేవయాని వెళ్ళిపోయింది.

పార్టీకి వచ్చిన వారంతా ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు

"బాబూగారూ ! నాకిక శెలవిప్పించండి వెళతాను" అన్నాడు ఆనందు.

"ఎక్కడికి ? పార్టీ కాగానే కారులో వెళదాం ఇంటికి" అన్నాడు చక్రవర్తి

"వద్దు. నేనా ఇంటిలో ఉండేటందుకు అర్హుణ్ణి కాదు ఇకమీద నేను ఉండటం అంతమంచిదికాదు. జయంతి భవిష్యత్తుకు" అన్నాడు ఆనందు.

చక్రవర్తి మారు మాట్లాడలేదు వెంటనే.

"నీకు నేను కొంత డబ్బివ్వాలి. సామానుంది" అన్నాడు కొంచెమాగి., మళ్ళీ ఆనందు పేలవంగా నవ్వుతూ, 'అందులో నాదనేది ఏమీలేదు బాబుగారూ! అంతా మీదే. ఓ పెట్టె, బెడ్డింగుతో వచ్చాను మొదట ఆ బెడ్డింగు ప్రయాణాల్లో చినిగిపోయింది. ఇక అక్కడి ప్రతి వస్తువూ నా బట్టలతో సహా మీదే. మీ

దయా ధర్మాలమీద నేను సంపాదించుకున్నవే. నాదంటూ ఇదుగో ఈ బ్రీఫ్ కేస్, ఈ పార్కర్ పెన్నూ నా వద్దనే వున్నాయి. ఇక డబ్బు అంటారా ? ఇవ్వాకే మీ సొమ్ము చాలా తిన్నాను. మీ అభిమానమే నాకిక మూలధనం" అన్నాడు

చక్రవర్తి ఇంక ఎక్కువ మాట్లాడలేదు. ఎవరో అతిథులు మళ్ళీ చక్రవర్తి వైపు వచ్చారు. చక్రవర్తి ఆనందు రెండు భుజాలూ ఆత్మీయంగా పట్టుకొని ఒకసారి వూపి గట్టిగా నిట్టూర్చి వెళ్ళిపోయాడు. ఆ నిట్టూర్పును 'నన్ను మరచిపోకు ఆనంద్ !' అన్న భావంకింద అనువదించుకున్నాడు ఆనందు

ఆ రాత్రి ఆనందు నారాయణగూడాలో ఓ హొటల్లో పడుకున్నాడు. పరునాడు ఉదయమే చక్రవర్తి ప్రింటర్స్‌లో తాను 'ప్రూఫ్‌రీడర్' ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు ఓ లెటర్ తన లెటర్ హెడ్ మీద రాసి పోష్టు చేశాడు.

పది గంటల ప్రాంతంలో నారాయణగూడా నుండి దేవయాని ఇంటికి వెళ్ళాడు. దేవయాని ఆనందును చిరునవ్వుతో ఆహ్వానించింది.

"ఏమిటి ఇంత ఆలస్యం చేశారు ? రండి, గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకోండి, భోంచేద్దాం" అన్నది దేవయాని.

ఆనందు గదిలో బ్రీఫ్ కేస్ పెట్టాడు,

అక్కడ రెండు రడీమేడ్ షర్టులూ, ఓ రెండు లక్నో షర్టులూ, రెండు పంచెలూ వున్నాయి.

"మీకే ! ఎవరో కట్టుకొని వదిలేసిన గుడ్డలు కాదులెండి మీ కోసమే ఉదయం తెప్పించాను." అన్నది.

"నాకోసమా ! ఎందుకు ?" అన్నాడు ఆనందు.

"ఎందుకంటే, మీరు చక్రవర్తిగారింట్లో గుడ్డలతో సహా అన్నీ అక్కడే వదిలి ఈ ఉదయం ఇక్కడికి రాగలరని రాత్రే నేను ఊహించాను కాబట్టి" అన్నది దేవయాని నవ్వుతూ, 'అంతేకాదు ఈపాటికి మీ రిజిగ్నేషన్ లెటర్ కూడా పోస్టు చేసి వుంటారు !" అప్రతిభుడైనాడు ఆనందు.

తర్వాత ఆమె అతనికి భోజనం వడ్డించి తానూ వడ్డించుకొని కూర్చున్నది డైనింగ్ టేబుల్ ముందు. భోజనం ముగించి వక్కపొడి, ఆకులు నములుతూ అన్నాడు మెల్లగా - 'దేవయానీ నేనిప్పుడు నిరుద్యోగిని"

"అంటే ? ...."

"చక్రవర్తి ప్రింటర్స్‌లో ఎడిటర్ కం ప్రూఫ్ రీడర్ పోస్టుకు రిజైన్ చేశాను కదా !"

"ఇంత ఆలస్యంగానా ? దిస్ ఈజ్ ఎ బ్లెస్సింగ్ ఇన్ డిస్‌గైజ్" అన్నది ఆమె నవ్వుతూ

"నాకిప్పుడు ఉద్యోగం కావాలి" అన్నాడు ఆనందు.

"ఏ యూనివర్శిటీలోనన్నా చేరిపోతారా ?" అన్నది.

"కాదు - మీరు నాకేదైనా ఉద్యోగం ఇప్పించండి"

"రాంగ్ నెంబర్. ఇది ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ కాదు. డాన్సు గర్లు ఇల్లు !"

"అందుకే అడుగుతున్నాను. నన్ను మీ డాన్సు ట్రూపులో చేర్చుకో కూడదూ ?" అన్నాడు ఆనందు.

ఆమె నవ్వింది. 'తంబూరా మీటుతారా లేక నా మేకప్ బాక్స్ పట్టుకోని వెనుక నడుస్తారా ?' అంది.

'మీ ఇష్టం' అన్నాడు ఆనందు.

సెంటెడ్ సున్నం రాసి తమలపాకులు చుట్టలు చుట్టి, 'అభ్యంతరం లేక పోతే... ' అని ఆనందు నోటికి అందించబోయింది.

ఆనందు వాటిని చేతితో అందుకున్నాడు.

'మంచిది, ఆలోచిస్తాను. మరి జీతభత్యాల విషయం ?' అన్నది,

"మీ ఇష్టం" అన్నాడు

"సరే ఆనంద్ బాబూ ! ఈ రోజునుండి మీరు నాకింద ఉద్యోగం చేస్తున్నట్లే లెక్క... కాబట్టి ఎంప్లాయిని నేను 'మీరు' అని పిలవను. 'నీవు' అని పిలుస్తాను' అన్నది దేవయాని.

'మీ ఇష్టం' అన్నాడు ఆనందు

'మా ఆఫీసులో తరతమ బేదా లేవు. ఎంప్లాయీస్ కూడా ఆఫీసర్‌ను నీవు అనవచ్చు అప్పుడే ఆత్మీయత ఫీల్ అవుతాము. అందుకని నీవు కూడా మమ్మల్ని 'నీవు' అనే పిలవాలి.' అన్నది దేవయాని.

ఆనందు ఏమీ మాట్లాడలేదు

"మంచిది నీ నేచర్ ఆఫ్ వర్క్ మేము తర్వాత నిర్ణయిస్తాము ప్రస్తుతానికి ఆ గదిలో విశ్రాంతి తీసుకో" అన్నది దేవయాని.

ఆనందు కొయ్యల డిజైన్ వున్న గదిలోపలికి వెళ్ళాడు. అక్కడ డబుల్ బల్ల మంచం వుంది. దానిమీద పరుపు, మెత్తడి దిండ్లూ వున్నాయి. ఆనందు అక్కడ నడుము వాల్చాడు.

సాయంత్రం ఆనందుకు మెల్కొవ వచ్చేసరికి గజ్జెలు గల గల మంటు న్నాయి. ఆ పసిడి మువ్వల శబ్దమే ఆనందును లేపిందన్న మాట!

దేవయాని ముగ్గురు ఆడపిల్లలకు డాన్సు నేర్పుతున్నది. ఆనందు కొయ్యా జిజైన్ సందులోంచి డాన్సును చూస్తున్నాడు ఆసక్తిగా. దేవయాని చాలా శ్రద్ధగా వారికి శిక్షణ నిస్తున్నది

చాలా సేపు ఆనందు ఆ శబ్దం వింటూ అలాగే కూర్చున్నాడు. ఇంతలో నౌకరు బిస్కెట్లు టీ తెచ్చి పెట్టి పోయాడు.

బిస్కెట్టు కొరుకుతూ టీ చప్పరిస్తుండగా ఆనందుకు కొత్తకొత్త భావాలు వచ్చాయి. "ఈ నృత్యం తాతా. లికం క్షణాల్లో కరిగిపోతుంది. కాని అక్షరాలు ?కరిగిపోవు. అవి శాశ్వతాలు. దేవయాని మువ్వల ఘలఘలలను నా అక్షరాలలో ?శాశ్వతంగా బంధిస్తాను" అనుకున్నాడు ఆనందు.

దేవయాని ఏ ప్రయోజనాన్ని ఆశించి ఆనందును తన ఇంటికి పిలిచిందో ఆ ప్రయోజనం మొదటినాడే నెరవేరింది.

ఆనందు బాలెడ్స్ రాయడం మొదలు పెట్టాడు. దేవయాని వాటికి అభి యాన్ని కూర్చుకోనాగింది

ఆనందు దేవయాని నుండి ప్రతిఫలాన్ని ఆశించలేదు

అట్లాగని దేవయాని ఆనందుకు ఏ లోటు చేయలేదు.

దేవయాని నర్తనంలో ఆనందు గతాన్ని మరచిపోయేందుకు ప్రయత్ని స్తున్నాడు.

ఆనందులో దేవయాని ఒక అమర సాహిత్య శిల్పిని చూస్తున్నది.

ఆనందు నిద్రాహారాలు మాని రాయడం మొదలు పెట్టాడు.

రాస్తున్న కొద్దీ కొత్త ఆవేశం. ఆవేశం వస్తున్న కొద్దీ ఇంకా ఇంకా రచనా వ్యాసంగం.

ఆనందు తన శరీరాన్నీ మనస్సునూ ఒక కార్ఖానా కిందికి మార్చాడు. అవిరామరంగా, పుంఖాను పుంఖంగా ఆనందు రచనలు చేయడం మొదలు పెట్టాడు రాత్రింబవళ్ళు

"ఎవరితో పోల్చను నిన్ను అనుపమా?

పోలికే లేని దివ్య సౌందర్యరాశివి ప్రియతమా!

బిథోవెన్ మూన్‌లైట్ సొనెటాతోనా?

పికాసో పెయింటింగ్‌తోనా ? మొనాలిసాతోనా ?

రవివర్మ రంగుల చిత్రంతోనా ? కాళిదాసు కావ్య నాయికతోనా ?

ఉమర్ దుబాయీ - షానామా - తాజ్‌మహల్ - మహాబలిపురం - గంగోత్రి నుండి జారిన బిందువువా ? రససింధువువా ? తల కావేరివా ?

కేరళ కొబ్బరితోటల మధ్య వీచిన మలయ పవనానివా ?

కోనసీమ అరటితోటలమధ్య చంద్రోదయానివా ?

కన్పడని అప్సరస చేలాంచలానివా ? విన్పడని నిశ్శబ్ద గాంధర్వానివా

అజంతా - రామప్ప - ఖజూరహో - కోణార్క - అమరావతీ-శిల్పానివా అనుపమువు - స్వయం ప్రభవు - స్వయంభువువు - ఎవరితో పోల్చను నిన్నో దేవయానీ !"

## 13

భూపాల్‌లో జరిగే కాళిదాస సమారోహ్‌కు ఆనందు విక మోర్వశీయాన్ని డాన్సు బాలేగా తయారు చేశాడు, అఖిల భారత స్థాయిలో దానికి ప్రథమ బహుమతి వచ్చింది రచన. నిర్వహణ, మొత్తం దేవయాని పేరుమీదనే ఆ బాలెట్‌ను ప్రకటించాడు ఆనందు.

"ఉత్తమ ప్రదర్శనకు విక్రమోర్వశీయం - దేవయాని" అని పిలిచారు మైకులో.

దేవయాని వెళ్ళి బహుమతి అందుకున్నది.

"ఉత్తమ రచనకు. విక్రమోర్వశీయం- దేవయాని" అని మళ్ళీ పిలిచారు

ఈసారి దేవయాని బహుమతి తీసుకోపడానికి లేవబోతే ఒళ్ళు జలదరించింది. పక్కనే కూర్చున్న ఆనంద్ చిరునవ్వు నవ్వి దేవయానిని పొమ్మన్నాడు. వెళ్ళి బహుమతి అందుకున్నది. ఉత్సవాలు ముగిశాక ట్రూపునుమాత్రం హైదరాబాదు పంపి, ఆనంద్. దేవయాని కొన్ని ప్రదేశాలు చూడాలని బయలుదేరారు.

ముఖ్యమైనవి చూస్తూ నాగపూర్ వైపు వచ్చారు. అక్కడికి రామ్‌టేక్ పద్దెనిమిది మైళ్ళు ఇద్దరూ బస్సులో అక్కడికి చేరారు. రామ్‌టేక్ వద్ద కొండ వుంది. ఆ కొండ సగం ఎక్కితే ఒక వెడల్పాటి ప్రదేశం వచ్చింది. అక్కడి నుండి వందల మైళ్ళు సుందర దృశ్యాలు కన్పడతాయి. మేఘాలు అక్కడికి వచ్చి వంగి మంచినీళ్లు తాగి పోతున్నాయి. "ఇదే కాళిదాసు మేఘ దూతం రాసిన ప్రదేశం"- అక్కడివారు చెప్పారు.

టూరిస్టులు చూచి వెళ్ళిపోతున్నారు. దేవయాని, ఆనందు, అక్కడ కాసేపు విశ్రాంతిగా కూర్చున్నారు.

ఆనందు ఆకాశంవంక చూస్తూ ఆలోచిస్తున్నాడు.

"ఆనంద్!" దేవయాని పిలిచింది.

"నీవు నా పేర రచనలు ప్రచురించడం మానెయ్ ఇక."

"ఏం?"

"అనవసరమైన కీర్తి నాకు వద్దు."

ఆనందు విచిత్రంగా నవ్వాడు.

"దేవయానీ! నీవు సమాజానికి కావాలి, నీ కళ కావాలి, నీ తపస్సు కావాలి. కాని నేనో? ఇవాళ వుండి రేపు రాలిపోయే పండుటాకును. నాకు పేరు ప్రతిష్ఠలూ, ధనమూ, ఏదీ వద్దు అలాంటది ఈ రచనలు మాత్రం ఎందుకు? .కాకుంటే బాధను మరచిపోయేందుకై రచనలు చేస్తున్నాను. చేస్తున్నకొద్దీ ఇంకా బాధ. బాధ పెరిగినకొద్దీ ఇంకా రచనలు- అదీ నా విషవలయం."

దేవయాని కళ్ళు అర్ద్రమైనాయి. "ఆనంద్! మూడు పదుల వయస్సులో ముసలి వేదాంతం చెపుతున్నావు. నీ జీవితంలో వసంతం విరిసే అవకాశం లేదా?" అన్నది దేవయాని.

"లేకేం? పునర్జన్మ అనేది వుండనే వుందిగా!"

"నిన్ను నిర్లక్ష్యంచేసి వారికోసం నీవెందుకింత త్యాగం చెయ్యాలి?" అన్నది దేవయాని. దేవయాని జయంతిని దృష్టిలో పెట్టుకొని అన్నది. కాని అది సరళకూ వర్తిస్తుందని ఆమెకు తెలియదు.

"ఇది త్యాగంకాదు కేవలం ఆత్మవంచన చేసుకోలేకపోవడం. మనస్సు తెల్లగా వుంటుంది ఒకసారి కనుక రంగు అద్దితే మళ్ళీ అది చెరగటం చాలా కష్టం అతి కష్టంమీద నేను నా మనస్సును స్ఫటికంలా మార్చుకుంటున్నాను. స్ఫటికం వెనుక ఏ రంగుపెడితే ఆ రంగే స్ఫటికంలో ప్రతిఫలిస్తుంది. కాని దేవయానీ! ఈ రంగుల రాట్నం ఆడటం నాకు చాలా కష్టంగావుంది. ఇష్టమై దగ్గరికి చేరిన ప్రతి సరోవరం నాకు ఎండమావిలా మారిపోతున్నది. ఈ దాహం ఈ జీవితానికి తీరదు" అన్నాడు ఆనంద్

ఆనంద్ కంటివెంట రెండు నీటి బిందువులు రాలాయి.

"ఆనందు! పోనీ పెళ్ళి చేసుకో''! అన్నది దేవయాని.

"ఎవరిని?" అన్నాడు ఆనంద్.

"ఎవరినో ఒక గొప్పింటి ఆడపిల్లను, బుద్ధిమంతురాలిని. నీకేం వయస్సు ఇప్పుడు మించిపోలేదు. విద్యా, రూపమూ అన్నీ వున్నాయి. ఇక పేరు ప్రఖ్యాతులకు లోటులేదు నీ రచనలమీద వచ్చే రాయల్టీలతో జీవితం సుఖంగా గడిచిపోతుంది. నువ్వు కో అంటే కోటిమంది పిల్లలు వస్తారు" అన్నది దేవయాని.

"నిజమే కావచ్చు కాని దేవయానీ! గత జీవితంలో ఒక రకంగా నామీద నాకే విశ్వాసం నశించింది. ఆడపిల్లలపట్ల కూడా విశ్వాసం నశించింది. మళ్ళీ నేను పెళ్ళిచేసుకోవాలని ఈ జీవితంలో ఆలోచించను దేవయానీ!" అన్నాడు ఆనందు.

దేవయాని మాట్లాడలేదు

ఆనందు అడిగాడు- "దేవయానీ! నీవెందుకు పెళ్ళిచేసుకోలేదు?" అని-

"చేసుకోలేదని ఎవరన్నారు?"

"చేసుకున్నావా?"

"ఆఁ- చేసుకున్నాను ఆనందు! అయితే అవేవీ పత్రికల్లో పడే నా జీవిత చరిత్రల్లో ఉండవు. నాకు చిన్నప్పుడే విజయనగరంలో పెళ్ళి అయింది మా అమ్మా, నా భర్తా ఇద్దరూ కలిసి నాకు నాట్యం నేర్పించారు. పదహారేళ్ళు వచ్చే సరికి బాగా ఆరితేరాను. మా ఆయనకు నన్ను చిన్నప టినుండి సినిమాల్లో చేర్పించాలనీ, నా నాట్యం ప్రదర్శనకు పెట్టి డబ్బు సంపాదించాలనీ కోరిక. నాకది అంత ఇష్టం లేకపోయింది. ఆయన శారదా కళామండలి సంస్థ స్థాపించి దాని తరఫున పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ట్రూపు సిద్ధంచేశాడు.

ఆ ట్రూపులో చేరాడు కోటీశ్వరరావు. ఆయన హీరో, నేను హీరోయిన్. కోటీశ్వరరావు వేదిక మీదనే కాకుండా గ్రీన్ రూంలో కూడా శృంగారం అభినయించడం ప్రారంభించాడు ఒకటికి రెండు సార్లు మా ఆయనకు చెప్పాను. ఆయన చూచి చూడనట్లు ఊరుకున్నాడు. చివరకు ఒకనాడు కోటీశ్వరరావు నేను ఒంటరిగా వున్నప్పుడు బలాత్కారం చేశాడు. కన్నీళ్ళతో ఈ విషయం ముందు మా అమ్మకు చెప్పాను.

ఆమె వినీ విననట్టు ఊరుకున్నది. తర్వాత మా ఆయనకు చెప్పాను. ఆయన తాపీగా విని, "నీ జాగ్రత్తలో నువ్వుండవలసింది ఇప్పుడు అనవసరంగా అనుకొని ఏం లాభం ?" అన్నాడు అంతే ! మరునాటి నుంచీ మళ్ళీ ఏమీ జరగ

నట్టే ప్రవర్తిస్తూ వచ్చాడు. దానితో నాకు ఆయన మీదా మానవ సమాజం మీదా ద్వేషం పుట్టుకొచ్చింది. స్వయంగా నా చేతుల్తో నేను నా మంగళసూత్రాన్ని తీసి వేశాను నేను పేరు మార్చుకున్నాను. "మిస్ దేవయాని"నైనాను.

"ఇదేమిటి, ఈ పేరుమార్పు ? నాటకాలు మానేస్తావేమిటి ?' అంటూ వచ్చాడు నా మొగుడు.

వాడు నా మొగుడు. తాళికట్టిన మొగుడు ! నా శీలాన్ని రక్షించలేని మొగుడు ! సమాజం కోసం తాళికట్టి, నన్ను తార్పుడు గత్తెను చేసి డబ్బు సంపాదించాలనుకుంటున్న మొగుడు ! ఛీ !

ఆనంద్ ! వాణ్ణి కాలితో తన్ని తరిమేశాను నా యింట్లో నుంచి. తల్లిని మాత్రం అలా తరమలేకపోయాను. అప్పటి నుంచి నా జీవితం పతనమయింది. నదిలో పడ్డ రాయి నలిగి నలిగి సాలగ్రామవుతుందట. నాకా పవిత్రత లేక పోయినా దొర్లి దొర్లి అలా నేను ప్రవాహ వేగంలో హైదరాబాదు చేరి పెద్ద నర్తకి నైనాను. నా నాట్యంలోని ప్రతి కదలికా అగ్నిగుండంలోంచి వస్తున్నదే ! అశాంతి నుండి వస్తున్నదే ! ! లావాను గుండెల్లో దాచుకొని లోకం మీద సన్న జాజులు వెదజిమ్మడం నేర్చుకున్నాను. క్రమంగా సమాజం నన్ను గౌరవించ వచ్చు. కాని నా లోటులు నాకు తెలుసు నేను పతితను ఆనంద్ ! సమాజంలో ఒక పతివ్రతకుండవలసిన లక్షణాలేవీ నాకు లేవు. మొగుణ్ణి తరిమేశాను. వాడు చచ్చిపోయాడు. నేను మిస్ దేవయానిని - సకల కళామూర్తిని . సన్మాన పత్రాలు, శాలువలూ రంగస్థలంపై అందుకుంటున్న దివ్య నర్తకిని ! నా పేరు దేవయాని !!" దేవయాని వెక్కి వెక్కి ఏడుస్తూన్నది.

## 14

ఆనంద్ ఆరోగ్యం బాగా క్షీణించింది క్షీణిస్తున్న కొద్దీ ఇంకా వ్రాయడం మొదలు పెట్టాడు.

దేవయాని భయపడింది. ఆనందును తన దగ్గర నుండి ఎక్కడికైనా పంపిస్తేనన్నా విశ్రాంతి దొరుకుతుందేమోనని ఆలోచించింది.

"ఆనంద్ ! కొంత కాలం దేశం తిరిగి వస్తావా ?" అన్నది దేవయాని.

"దేవయానీ ! నీ దగ్గర వుండటం నీకిష్టం లేకపోతే నాకామాట ప్రత్యక్షంగా చెప్పు." అన్నాడు ఆనందు.

దానితో దేవయాని మళ్ళీ ఆ ప్రసక్తి తీసుకురాలేదు. అయితే చంద్రలేఖ ఆనందును బొత్తిగా గౌరవించడం లేదు. కూతురు ఏమన్నా అంటుందేమోనని భయపడి పూరుకుంటున్నది తప్ప ఆనందు తన ఇంట్లో వుండటం ఆమెకు గిట్ట కుండా పోయింది.

ఆ భావాన్ని వాచ్యంగా, వ్యంగ్యంగా కూడా వ్యక్తం చేసింది.

దేవయాని అభిమానం, చంద్రలేఖ అవమానం రెండింటి మధ్య ఆనందు ఇటూ అటూ ఉయ్యాల ఊగాడు.

వెనుకటిలాగా దేవయానితో బాటు ఏ పట్టణంలోనైన కార్యక్రమాలుంటే వెళ్ళడం మానుకున్నాడు.

దేవయాని కూడా రమ్మని బలవంతం చెయ్యడంలేదు. ఆనందు ఆరోగ్యం బాగుండటంలేదని తెలిసి ఆమె పొరుగూరు ప్రోగ్రాములు ఒప్పుకోవడంలేదు.

ఆనందు దగ్గరే కూర్చొని నాట్య శాస్త్రాన్ని గూర్చి గంటలకు గంటలు చర్చించేది దేవయాని. నృత్యాలూ, ఆలయ నృత్యాలూ అందులోని మార్గదేశి భేదాలు వివరించేది,

"ఈ కళ మొత్తం నాశనమైపోతున్నది. విజయనగరంలో పూర్వం మేనకా సంప్రదాయం, ఊర్వశి సంప్రదాయం వుండేవి. ఇప్పుడవి నశించాయి. తెలంగాణంలో దశావతారాలవలె దశవిధ శివలీలలుండేవి. హైదరాబాదులో కుతుబ్ షాహీల సంపర్కంతో మత్తలి, హల్లీసిఖ సంప్రదాయాలు వచ్చాయి. అవి నేడు తెలిసినవారు లేరు ఈ కళ మొత్తం కాలగర్భంలో ఏం కానున్నదో ఏమో!" అని విచారపడుతూ వుండేది.

ఇవి వింటున్నకొద్దీ ఆనందు బాధ ఎక్కువ కాసాగింది. దానితో దేవయానిని నాయికగా చేసి సమస్త నాట్య సంప్రదాయాలు కథా వస్తువులో అతికేటట్లు చేసి 'మధులిప్త' అన్న పుస్తకం ఆనందు మొదలుపెట్టాడు. ఆనందు 'మధులిప్త' రాస్తున్నకొద్దీ దేవయానికి ఆనందం పొంగి పొర్లింది.

నగరంలోని డాన్సు ప్రోగ్రాములు కూడా మానుకొని గంటలకు గంటలు ఆనందుతో చర్చలలో గడపసాగింది. చంద్రలేఖ దీనిని భరించలేకపోయింది.

"అమ్మా! నేను రామప్ప గుడిమీది నాగినిలా శాశ్వతత్వాన్ని పొంద బోతున్నాను ఈ వ్యర్థమైన ప్రశంసలూ, సన్మానాలూ నాకెందుకు?" అని తల్లిని మందలించింది దేవయాని.

'వచ్చే డబ్బు మానుకొని ఈ అమరత్వం పొందడమేమిటో చోద్యంగా వుంది.' అని చంద్రలేఖ వెక్కిరించడం మొదలుపెట్టింది కూతురును.

ఇలా కాదని చంద్రలేఖ నగరంలోని పెద్దలను పట్టుకొని దేవయాని విదేశ పర్యటనకోసం ప్రయత్నం చేయసాగింది.

ఈ విషయంలో చంద్రలేఖకు సహాయం చేశాడు కుమారరాజా!

కుమారరాజా ఓ జమీందారు కొడుకు. తాతలనాటి ఆస్థిని ఫిల్మ్ ఇండస్ట్రీ క్రిందికీ, ఫ్యాక్టరీల క్రిందికీ మార్చి చిద్విలాసంగా కళాపోషణ చేసే ప్రముఖుడు.

కుమారరాజా తరుచు దేవయాని ఇంటికి రావడం మొదలుపెట్టాడు. అయిష్టంగానే దేవయాని ఆయనను గౌరవించసాగింది.

కుమారరాజా దేవయాని విదేశీ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాడు. తేదీ నిశ్చయమైంది. దేవయాని, చంద్రలేఖ మాత్రమే వెళ్ళేటట్లు నిశ్చయమైంది.

అది శుక్లపక్షం వెన్నెల రాత్రి. మేడపైన దేవయాని, ఆనందు కూర్చున్నారు.

'నేనీ ప్రోగ్రాముకు ఒప్పుకోదలచలేదు మొదట' అన్నది దేవయాని.

ఆనందు వింటున్నాడు.

'కాని మన కళలు నశించిపోతున్నాయి. వాటి లోతును ఒకసారి విదేశాల వారికి చూపాలని నాకనిపించింది అందుకని గత్యంతరంలేక ఒప్పుకున్నాను. దేవుడు ప్రసాదించిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మిడిల్-ఈస్టు కంట్రీస్-వారంకీ, యు.ఎస్ ఏ. వారికీ మన నృత్యాలంటే వెర్రి వ్యామోహం పుట్టేటట్టు చేయాలని అనుకుంటున్నాను' అన్నది దేవయాని.

'చాలా సంతోషం దేవయానీ! దానివల్ల నీ జీవితం సార్థకమవుతుంది' అన్నాడు ఆనందు.

'' 'మధులిప్త' నీవు ముగిస్తే నా జీవితం దానివల్లనే సార్థకమవుతుంది" అన్నది దేవయాని.

ఆనందు బలహీనంగా దగ్గాడు.

'నీ ఆరోగ్యం పాడుచేసుకోవద్దు. కావలసిన డబ్బు బ్యాంకులో వుంది. వేళకు తిండి నిద్రా మానవద్దు. నేను వచ్చేవరకూ నీవేమీ రాయవద్దు' అన్నది దేవయాని.

'రాయకుండా ఎలా వుండటం?' అన్నాడు ఆనందు

'నీవు రాయనని మాట ఇస్తేనే నేను ఫారిన్ పోతాను' ప్రయాణం చేయ మని చేయిజాచింది దేవయాని.

ఆనందు ఒక్క క్షణం ఆగి, 'అయితే దేవయానీ! నీవు నాకొక ప్రమాణం చేయగలవా?' అన్నాడు.

'ఏమిటి?' అన్నది దేవయాని

"నీవు నన్ను పెళ్ళి చేసుకోగలవా?" అని అడిగాడు ఆనందు.

'నీవు ఫారిన్‌నుంచి వచ్చాక నన్ను పెళ్ళిచేసుకుంటానని మాట ఇస్తే నేను నీవు చెప్పినట్టే చేస్తాను' అన్నాడు ఆనందు.

దేవయాని నవ్వింది. ఆ నవ్వులో ఎక్కడా మలినంలేదు. స్వచ్ఛమైన ముత్యంలా వెలిగింది ఆ నవ్వు.

'పెళ్ళంటే ఏమిటి?' అని అడిగింది దేవయాని. 'ఆనంద్! పెళ్ళంటే పీటలమీద మంత్రాలు చదవడమే అయితే అది నాకు ఎవడితోనో అయింది. పెళ్ళంటే శారీరక సంబంధమే అయితే ఆ పెళ్ళి నాకు చాలామందితో ఐంది. పెళ్ళంటే కేవలం ఆత్మా-ఆత్మా కలియడమే అయితే....అది నీతో నాకు. నీ పుస్తకాలు చదివినప్పుడే అయింది. నీ భావాలతో నేను ఏకమయినప్పుడే అయింది. ఇక నీకు ఏరకమైన పెళ్ళికావాలి ఆనంద్?' అన్నది దేవయాని.

దేవయాని పెద్ద మర్రిచెట్టులా కన్పించింది ఆనందుకు. తన అల్ప మనస్సుకూ, అవివేకానికీ తానే సిగ్గుపడ్డాడు.

'లేదు దేవయానీ! నేను కోరుకున్నది అదే' అన్నాడు ఆనందు తృప్తిగా.

దేవయాని లేచివచ్చి ఆనందు పక్కన కూర్చున్నది. ఆనందు తలను తీసుకొని తన ఒడిలో పెట్టుకున్నది.

ఆనందు దేవయాని కళ్ళల్లోకి చూస్తున్నాడు.

'ఆనందు! నీవు తపస్వివి' అని అన్నది దేవయాని.

'లేదు దేవయానీ! చాలా సామాన్యుణ్ణి. నీముందు మానసికంగా ఇంకా చాలా ఎదగవలసినవాణ్ణి. మానసికంగా ఆర్థికంగా నీవు నాకు ఎంతో సహాయం చేశావు. అందుకని అవివాహితవైన నీకు సమాజంలో డాన్స్ గర్ల్‌గా పేరుపోయి. ఒక విద్యావంతుని భార్యగా పేరురావాలని భావించి నేని కోరిక కోరాను. నీవు నాకు స్ఫూర్తిగా నిలిచి నా జీవితానికి మళ్ళీ కొంత ప్రయోజనం కల్పించినందుకు కృతజ్ఞతగా ...'

'కృతజ్ఞురాలిని. అయితే ఆ నీచకార్యం నీవు చేయనక్కర లేదు ఆనందు. అందుకు చాలా కుక్కలు క్యూలో నిలబడి వున్నాయి. కుమార రాజాతోసహా.'

ఆనందు ఏమీ మాట్లాడలేదు. కొంచెమాగి దేవయాని.

'ఆనంద్! నీ పెదవులమీద ఓసారి ముద్దు పెట్టుకోవాలి?' అన్నది. తియ్యగా నవ్వి 'వద్దు-దేవయానీ' అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

'ధన్యురాలిని. ప్రేమమూర్తీ! నా హృదయంలో నీవిప్పుడు హిమాలయమంత ఎత్తున ఎదిగావు' అన్నది దేవయాని.

## 15

నౌకరు పోచయ్య ఉదయం టీ తయారుచేస్తున్నాడు. ఆనందు ముఖం కడుక్కుంటూ తల తిరిగి పడిపోయాడు

పోచయ్య భయపడి కేకలు వేశాడు. పక్కనే వున్న పూలదుకాణం చాంద్‌పాషా, తబలావాయించే బుర్హానుద్దీన్ వచ్చి సాయంచేశారు. ఆనందును ఉస్మానియాలో చేర్పించారు. డాక్టర్లు పరీక్షచేసి మైల్డు హార్ట్ ఎటాక్ వచ్చిందని తేల్చారు.

"శరీరానికి, మనస్సుకూ పూర్తి విశ్రాంతి అవసరం" అని చెప్పారు. ఆనందు కొన్ని వారాలైనా అక్కడ ఉండటం మంచిదని సూచించారు.

'సరే'నన్నాడు ఆనందు.

అయితే 'మధులిప్త'ను వ్రాయడం మాత్రం మానలేదు

టైం ప్రకారం మందూ, టైం ప్రకారం చెక్-అప్ చేసి వెళ్తుంది ఒక నర్సు. ఆమె పేరు సుజాత! ఆమెకు తెలుగు రాదు.

"ఏమండీ! ఆ పుస్తకాలు ఏమిటి రాస్తున్నారు? అటూ ఇటూ కదలకుండా పడుకోవాలి" అన్నది సుజాత ఇంగ్లీషులో.

"రాయకపోతే బతకలేను" అన్నాడు ఆనందు ఇంగ్లీషులోనే

"రాస్తూవుంటే ఇంకా కష్టం" అన్నది సుజాత

సుజాత తండ్రి తమిళుడు. తల్లి ఇంగ్లీషుపిల్ల మద్రాసు సుజాత జన్మస్థానం. సుజాతకో అన్న వుండేవాడట ఆయన చనిపోయాడు

"మిమ్మల్ని చూస్తే అచ్చంగా మా అన్నయ్య గుర్తుకొచ్చాడు" అనేది సుజాత.

సుజాత తండ్రి ప్రస్తుతం పాండిచ్చేరిలో వుంటున్నాడు. ఇటీవల దాకా ఆయన సికిందరాబాదు రైల్వేలో పనిచేస్తూ మల్‌కాజగిరిలో వుండేవాడట. సుజాత ఏడ్యుకేషన్ మొత్తం సికిందరాబాదులోనే జరిగిందట. ఇటీవలే తల్లి పోయింది!

"మా అన్నయ్య మెడికల్ కేర్ అందక చనిపోయాడు. అలాంటి దురవస్థ ఇంకే బ్రదర్‌కూ లోకంలో లేకుండా చేయాలని నా ప్రయత్నం యథాశక్తిగా!" అన్నది సుజాత. సుజాత బక్కగా బలహీనంగా వుండేది.

'ఈ బక్కప్రాణికి ఇంత శక్తి ఎక్కడిదో?' అనుకున్నాడు ఆనందు.

ఆనందు తన అనారోగ్యం గూర్చి శ్యామలమ్మకు జాబు రాశాడు. పరంధామయ్య, శ్యామలమ్మ, ఆమె మరదీ ముగ్గురూ వచ్చి చూశారు. శ్యామలమ్మ దాదాపు సన్యాసినిలా వుంది. ఆనందును చూసి దుఃఖించింది.

పరంధామయ్యకు చాటుగా విల్లు అందించాడు ఆనందు. తల్లి తదనంతరం తనకు వచ్చిన ఆస్తి మొత్తం శ్యామలమ్మకు చెందేటట్లు రాశాడు అందులో.

ఆరోగ్యం ఆందోళనకరంగా లేదని తెలిసి శ్యామలమ్మా వాళ్ళు వెళ్ళిపోయారు.

ఒకనాడు ఆనందు ఏదో పుస్తకం చదువుతున్నాడు.

'మధులిప్త'లో దేవయాని నాట్యాన్ని వర్ణించడానికి కావలసిన కొన్ని నాట్య విశేషాలున్న గ్రంథం అది.

"ఆనందన ర్తనం ఆడె హరుడు
అలహిమగిరిపై సంధ్యావేళలో
తాంత్రెయ్యని తాండవ రీతుల"

ఈ గీత ప్రదర్శనంలో హస్తపాద విన్యాసాలు శివుని 108 కరణాల నుంచి వుంటాయి. దీనికి ఆధారం నందికేశుని భరతార్ణవం. అందులో శుద్ధ నృత్తముగూర్చి వివరించాడు. దేవయాని తనతో ఒకనాడు శుద్ధ నృత్యమును-నృత్తమును భరతుడు విడదీసి చెప్పలేదని అన్నది. అందుకే భరతునితోబాటు నందికేశుణ్ణికూడా నాట్య కళాకారులు ఆధారం చేసుకోక తప్పదని అన్నది ఆనందు పుస్తకంలో లీనమయి వున్నాడు.

చదివి చదివి చివరకు ఈ లోకంలోకి వచ్చాడు. వెచ్చటి నిశ్వాసాలు తగిలాయి. తల పక్కకు తిప్పి 'ఎవరా' అని చూశాడు.

ఎప్పటినుంచి కూర్చుని వుందోమరి, సుజాత పక్కనే కూర్చుని వున్నది.

ఆనందు పుస్తకాన్ని పక్కనపెట్టి "సిస్టర్! ఏమిటలా చూస్తున్నారు?" అన్నాడు ఇంగ్లీషులో.

"ఏమీలేదు. మీరేదో తీవ్రంగా చదువుతుంటేను" అన్నది సుజాత.

"నేను దాదాపు అరగంటనుండి ఇక్కడ కూర్చున్నాను. కనీసం మనిషి వచ్చిన అలికిడి కూడా మీకు తెలియలేదు. ఎంత ధ్యానం, ఎంత తపస్సు!" అన్నది సుజాత.

ఆనందు నవ్వి "ఏమైనా కబుర్లుచెప్పు సిస్టర్! రిలీఫ్‌గా వుంటుంది నాకు" అన్నాడు.

"మీరే చెప్పండి"

"నాకు నీలా కబుర్లు చెప్పడం రాదు"

"వచ్చినవే చెప్పండి"

"ఏం చెప్పను? ఇప్పుడు నేనో పుస్తకం చదివాను. అందులో శివుని నాట్య రీతులు వర్ణించబడి వున్నాయి శివుని నాట్యంపై నందికేశుడు ఒక శాస్త్రంకూడా రాశాడు"

"నాన్సెన్స్!" అన్నది సుజాత.

ఆనందు నివ్వెరపోయాడు.

"శివుడికేమీ పనిలేదా పొద్దుగూకులూ డాన్సు చేసుకుంటూ కూర్చునేందుకు? బ్రదర్స్! ఈ హాస్పటల్‌లో రోగులు చూడండి, విలవిలా ఎలా ఏడుస్తున్నారో! వాళ్ళమాటేమీ అయ్యకు పట్టినట్లులేదు. ఎందుకుట చేతులెత్తి డాన్స్ చేయాలి? ఆ నందికేశునికేమీ పనిలేదా శివుడి డాన్సుమీద పుస్తకం రాయడానికి? హాస్పటల్లో నా పేషెంట్స్‌మీద పుస్తకం రాయమనండి. కనీసం ఆనందుమీద ఒక నవల రాయమనండి"

ఆనంద్ సుజాత నాస్తికురాలని అనుకున్నాడు. హాస్పటల్ అధికారులు రౌండ్స్‌కు వస్తుంటే సుజాత లేచి వెళ్ళిపోయింది.

'ఛీ! ఈ పిల్ల రూపానికి తగ్గట్టే బుద్ధులున్నాయి. ఏమిటలా నాట్య శాస్త్రాన్ని తిడుతున్నది?' అనుకున్నాడు ఆనందు.

అనుకున్నాడే కాని సుజాత వేలెత్తి చూపిన అంశాలకు సమాధానం మాత్రం ఆనందుకు దొరకలేదు.

'శివుడెందుకు డాన్స్ చేయాలి? నందీశ్వరుడెందుకు పుస్తకం రాయాలి? తాను దేవయానిపై ఎందుకు నవల రాయాలి? తనకు వేరే పనిలేదా? ఈ హాస్పటల్లో ఏ రోగంపైనో ఓ నవలని ఎందుకు రాయకూడదు?'
ఇలా ఆలోచించేసరికి ఆనందుకు ముచ్చెమటలు పోసినట్లనిపించింది.

తనకు తెలియకుండానే తనేదో తప్పు చేస్తున్నట్లు అనిపించింది.

'సుజాతా! నాలుగు మాటల్తో నాలో ఎంత కల్లోలం సృష్టించావు?' అనుకున్నాడు ఆనంద్.

మరునాడు సుజాత మామూలుగా డ్యూటీలోకి వచ్చింది వస్తూనే ఆనంద్ యోగక్షేమాలు అడిగింది.

"అన్నయ్యా! నేను రాగానే మీ ముఖం ప్రతిరోజూ నూరురేకుల కమలంలా వికసించేది. ఇవ్వాళేమిటి అదోలా వున్నారు. శరీరంలో ఏదైనా బాధగా వుందా?" అన్నది సుజాత ఇంగ్లీషులోనే

సుజాతకు బదులు చెప్పలేదు ఆనంద్.

"మీకూ నాపైన కోపం వచ్చిందా ఏమిటి?" అన్నది సుజాత.

"మీకూ అంటే-ఇంకెవరికైనా వచ్చిందా?" అన్నాడు ఆనంద్.

"ఆ! ఈ హాస్పటల్లో చాలామంది నా కొలీగ్స్ నన్ను గౌరవించరు."

"ఎందుకనీ?"

"ఎందుకనంటే నేను అందంగా వుండననీ. నాకు చాకచక్యంగా వుండటం తెలీదనిట!" అన్నది సుజాత ఏమీ బాధపడకుండానే.

ఆనంద్ మాత్రం ఈ మాటకు బాధపడ్డాడు. సుజాత అందమైనదికాదు, నిజమే! -నీ లోకంలో శరీర సౌందర్యాన్నిబట్టే విలువ నిర్ణయించాలా?

సరళ చాలా అందమైనది జయంతి ఇంకా అందమైనది. దేవయానిది దివ్య సౌందర్యం.

వాళ్ళతో పోల్చిచూస్తే సుజాతను మనిషిగానే గౌరవించనక్కరలేదు. కాని సుజాతలో గల సేవాభావం, ఓర్పు, నమ్రత, నూటికి కోటికి ఏ ఒక్కరిలోనో ఉంటుందో ఉండదో?

"నీమీద నాకు బాగా కోపం వచ్చింది చెల్లీ!" అన్నాడు ఆనందు.

"అది నేను గమనించాను. కాని ఎందుకో నేను తెలుసుకోవచ్చా?"

"నీకు దేవునిపై విశ్వాసంలేదా?" అన్నాడు ఆనందు.

"దేవుడంటే ఏమిటో చెపితే విశ్వాసం వుందో లేదో చెపుతాను" అన్నది సుజాత.

దేవుడంటే ఏమని చెప్పాలో ఆనందుకు వెంటనే స్ఫురించలేదు.

కొంచెం ఆగి "అదొక సర్వవ్యాప్తమైన భావం" అన్నాడు.

"ఇంకేం మరి? ఆ భావాన్ని నేనీ హాస్పటల్లో రోజూ బెడ్స్‌మీద ఉపాసిస్తున్నానా-లేదా?" అన్నది సుజాత.

ఆనందు నివ్వెరపోయాడు.

'దేవీ దేవతలపై విశ్వాసం లేనివాడు నాస్తికుడని ప్రాచీన మతములు చెపితే ఆత్మవిశ్వాసం లేనివాడు నాస్తికుడని అనుష్ఠాన వేదాంతం చెపుతున్నది.'

"సుజాతా! నీవు ఫిలాసఫీ చదువుకున్నావా?" అన్నాడు.

"లేదు - అనుభవించాను" అన్నది సుజాత

సుజాత వేదాంతాన్ని చదవలేదట! అనుభవించిందట!

వేదాంతాన్ని చదవడమూ రాయడమూ, మాట్లాడటమూ పండితులు చేసే పని. వేదాంతాన్ని అనుభవించడం ఋషులు చేసే పని!!

సుజాత మునికన్య??

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నది సుజాత.

"ఏమీలేదు. శివుడు డాన్స్ చేస్తుంటాడా? ఆయనకేమీ పనిలేదా అన్నావే. ఎందుకలా అన్నావు?" అన్నాడు ఆనందు.

అప్పుడు సుజాత ఆనందువైపు ఒక చూపు చూచింది. అమాయకుడైన కొడుకును తల్లి చూచే చూపు అది. సుజాత అన్నది "శివుడు నాట్యంచేయడం ఎవరుచూచారు? అసలు శివుడంటే ఎవరు? అదొక భావం. అదొక సంకేతం. శివుని నాట్యం మృత్యుంజయత్వానికి సంకేతం. మానవుడు అమరుడు కావాలని యుగయుగాలుగా పడే తపనకు చిహ్నం. శివుడు వెండి కొండమీద కూర్చున్నాడు, విష్ణువు పాల సముద్రంలో - బ్రహ్మ హంసమీద. ఎందుకు?? ఈ తెల్లని వస్తువులన్నీ సత్వగుణానికి సంకేతాలు. దేహస్థితి నుండి అతి మానస దశకు ఎదగడానికి మన ఋషులు నిర్ణయించిన సింబల్స్! న్యూట్రాన్ ప్రోటాన్ ఎలక్ట్రాన్ - పరిభ్రమణం ఓ చిరంతన నిరంతర పరిభ్రమణం - తాండవం".

ఆనందు ఏదో కొత్త లోకాలకు వెళ్ళాడు. తనకింతవరకూ పరిచయంలేని ఒక శాస్త్రాన్ని సుజాతనుండి తెలుసుకున్నాడు.

"సుజాతా! ఈ సంగతులన్నీ నీకెలా తెలిశాయి?"

"కొన్ని నేను మా నాన్నగారినుండి విన్నాను. కొన్ని అరవిందుడి పుస్తకాలలో చదివాను" అన్నది సుజాత.

సుజాత మరునాడే ఆనందుకు కొన్ని అరవిందుడి పుస్తకాలు తెచ్చి పెట్టింది.

ఆనందు వాటిని చదువుతున్న కొద్దీ ఏదో కొత్త ఆరాటం మొదలైంది.

సుజాత ఎప్పుడు మాట్లాడినా రోగులగూర్చి వారి శారీరిక మానసిక అస్వస్థతలగూర్చి మాత్రమే చెపుతూవుండేది. మధ్యమధ్య చిన్నచిన్న జోక్స్ వేసేది. వాటిల్లో కూడా పవిత్రత వుండేది.

అంతేకాదు-సుజాత ఎప్పుడైనా సీరియస్‌గా ఆలోచిస్తూ ఆనంద్‌వైపు చూచేది.

ఆమె చూపులలోనుండి ఏవో భావాలూ, సంకేతాలు ఆనంద్ మస్తిష్కంలో రికార్డు అవుతూవుండేవి

"సృష్టి పుట్టి ఒకరోజయితే మానవుడు పుట్టి ఒక గంట అయింది. అంటే ఇప్పటివరకు జరిగిన 23 గంటల సృష్టి ప్రేక్షకుడు లేని నాటకం. అందుకే అతిమానవ అవతారానికై సృష్టి ఇంకా పురిటినొప్పులు పడుతూనేవుంది-

మానవునిలో అంతర్నిహితంగా దివ్యత్వం ఉన్నట్లే బాహిరంగా పశుత్వం వుంది. విషమవాంఛల సంతృప్తికై స్వార్థచింతనతో కులం, వర్గం, మతం, భాష, ప్రాంతం, దేశం వంటి ఆయుధాలు ఎప్పుడేవి ఉపయోగపడితే అప్పుడు వాటిని సాధనంగా మానవుడు వాడుకుంటుంటాడు- స్వార్థమే కేంద్ర బిందువు, మిగిలినవన్నీ ఆలంబనాలు- మానవుడు లోకాన్నే కాదు, చాలాసార్లు తననుతాను మోసగించుకుంటూ బ్రతుకుతుంటాడు. ఇది ఇతర జీవ జంతువులకు లేని కళ."

అనే భావం సుజాత కంటి వైబ్రేషన్స్ ద్వారా ఆనంద్‌లో స్పందించింది- ఈ భావాలను ఆమె ట్రాన్స్‌మిట్ చేసిందా?? లేక చేసిందని తాను భ్రమిస్తున్నాడా??

ఏ మోమరి!!

"కోరలులేని పాములు, జింకలుగా మారిన పులులు, పుట్టడం నేడు అసహజంగా కన్పడవచ్చు కాని అసంభవం మాత్రం కాదు" అనే భావం ఆమె చూపులలో స్ఫురించింది ఆనంద్‌కు- ఒకసారి.

'కొందరు విషయసుఖాలు సర్వస్వమన్నారు కొందరు పరలోక సుఖానికై ఇహలోకం తిరస్కరించారు- మరికొందరు కన్పడుతూన్నదిమిధ్య అనీ. నశ్వరమనీ అన్నారు- కాని స్వర్గాన్ని భూమిపైకి దింపడం నిజమైన తత్వం కాగలుగుతూంది' అన్నట్లు చూచింది సుజాత మరోసారి.

సుజాత అప్పుడప్పుడూ చిన్నచిన్న తార్కిక చర్చలు చేసేది. ఐతే అవి చాలా సంగ్రహంగా సూత్రప్రాయంగా వుండేవి.

'నిరీశ్వరశక్తిని ఉపాసించే అదృష్టంకొందరికే వుంటుంది. అట్లని విగ్రహారాధకులను విమర్శించే హక్కు వారికి లేదు. ఐన్‌స్టీన్ గొప్పవాడే కాని ఆయన రెండో ఎక్కం నేర్చుకునే విద్యార్థిని విమర్శించినట్లు ఎక్కడా మనం వినలేదు' అన్నది సుజాత ఒకసారి.

ఈమెకీ విజ్ఞానం ఎలా వచ్చింది?? ఏం ఉపాసన చేసింది??

'ఉపాసనా?' అని గలగలా నవ్వి 'రోగులకు రాత్రింబవళ్ల శ్రద్ధాభక్తులతో సేవజేయడమే నా ఉపాసన' అన్నది సుజాత ఆనంద్‌తో.

ఆమె కన్నులనిండా దయ-కరుణ.

ఆనంద్ నేత్రాలలో ఆరాధన.

'ఎవరితో పోల్చను, నిన్ను సావిత్రీ!

ఏ దివ్య సీమలనుండి డిసెండ్ ఐనావు గాయత్రీ!'

అనే కవిత ఆనందు మదిలో మెదిలింది.

ఒకనాడు సుజాత డ్యూటీకి రాలేదు. ఇంకెవరో నర్సు వచ్చింది. ఆనాడు ఆనందుకు ఏమీ తోచలేదు.

"సిస్టర్!" ఆనంద్ పిలిచాడు.

ఆమె దగ్గరికి వచ్చింది. 'ఏం కావాలి?' అన్నట్లు చూచింది.

"మీ పేరేమిటన్నారు?"

"ఎందుకు స్వంత పేర్లు? సిస్టర్ అనండి చాలు" అన్నది ఆమె.

ఆనందు షాక్ తిన్నాడు.

"సుజాత ఎందుకు రాలేదు డ్యూటీలోకి?"

"కాజువల్ లీవ్ పెట్టిందా గొంగళిపురుగు.అయినా ఆమె అంటే మీకెందుకంత ప్రత్యేక అభిమానం-యోగక్షేమాలు అడుగుతున్నారు?"

'గొంగళిపురుగు' అన్న మాటతో వాళ్ళు సుజాతను ఎంత చులకనగా చూస్తున్నారో ఆనందుకు అర్థమైంది.

ఆనందుకు బాగా కోపంవచ్చింది ఆ ఆవేశాన్ని ఆపుకోలేకపోయాడు. వెళుతున్న ఆ నర్సుని మళ్ళీ వెనక్కి పిలిచాడు.

"ఏమిటి?" అంటూ వచ్చింది.

"ఇదిగో.చూడు. నీవు చేసే వృత్తిమీద నీకు ప్రేమలేదు. సుజాత కాలి గోటితో నీవు పోలవు తెలిసిందా?" అన్నాడు ఆనందు.

"షటప్. డాక్టర్‌తో రిపోర్టుచేస్తాను" అన్నది నర్సు.

"నీవు గొంగళిపురుగు అన్న సంగతి కూడా ఆ డాక్టరుతోనే చెపుతాను రానీ" అన్నాడు ఆనందు.

ఆ నర్సే నోరు మూసుకొని వెళ్ళిపోయింది. ఫళ్ళీ ఆనందు ముఖం చూడ లేదు ఆమె.

మర్నాడు సుజాత డ్యూటీలోకి వచ్చింది.

"సుజాతా! సుజాతా!"

"ఏమిటలా కలవరిస్తున్నారు అన్నయ్యా!" అంటూ దగ్గరికి వచ్చింది సుజాత.

"నీవు ఒక్కరోజు రాకపోయేసరికి నాకేదోలా అనిపించింది"

"హంబగ్! గత పాతికేళ్ళుగా మీరెవరో నేను చూడలేదు ఈ నాలుగు రోజుల అనుబంధంతో ఇలా అయిపోతారా ఎవరైనా?" అన్నది సుజాత.

"ఎందుకు కాకూడదు? నన్ను చూచిన దగ్గరనుండి మీ అన్నయ్యను చూచినట్లున్నదని నీవు అనుకోవడం లేదూ - అలాగే" అన్నాడు ఆనంద్.

"అఫ్‌కోర్సు! నిజమే ఆత్మీయతలు ఈ జన్మలోనే ప్రారంభంకావు, అవి జన్మాంతర సంబంధాలు. అలా ప్రవాహంగా సాగిపోతూ వుంటాయి కాలంలో" అన్నది సుజాత.

నిన్న జరిగిన సంగతి మొత్తం సుజాతతో చెప్పాడు.

సుజాత చాలా నొచ్చుకుంది. "అరెరే! ఆమె జీవితంలో ఓడిపోయింది. ఎందుకామెను మీరు బాధపెట్టారు?" అంది.

"ఎవరు?"

"నిన్న వచ్చిన సౌందర్య. ఆమె ఒక డాక్టర్‌ని ప్రేమించి పెళ్ళిచేసు కుంది. అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్నుంచీ ఆమె సైకిక్ అయి పోయి ఏమిచేమిటో అంటుంది. అఫ్‌కోర్సు ఆమె అన్న మాటల్లో నేను గొంగళి పురుగునని అన్న మాటమాత్రం నిజం" అన్నది సుజాత నవ్వి.

ఆనందుకు సౌందర్యమీద జాలి కలిగింది.

"పాపం! ఎందుకాయన ఆత్మహత్య చేసుకున్నాడో?"

"ఎందుకేమిటి? మోడరన్ సైన్సు బుద్ధినుండి వికసిస్తున్నది. ఆ సైన్సుకు హృదయంతోనూ ఆత్మతోనూ స్పర్శ లేకుండాపోయింది. ఆధ్యాత్మిక స్పర్శ లేకపోతే సైన్సు మానవ విధ్వంసానికి దారితీస్తుంది. చాలామంది సైంటిష్టులు ఆత్మహత్యలు చేసుకోవడానికి అదే కారణం" అన్నది సుజాత

'సుజాత మానవ మాత్రురాలు కాదు' అనుకున్నాడు ఆనందు.

"ఆనంద్! మీ రెస్టు పీరియడ్ పూర్తవుతున్నది" అన్నది సుజాత.

"అయ్యో!" అన్నాడు ఆనందు.

"ఏం?"

"ఇక నేను హాస్పటల్‌నుండి వెళ్ళిపోవాలా?"

"వెళ్ళండి సుఖంగా. దానికి విచారమెందుకు?"

"సుజాతా! నాకిక్కడ చాలా హాయిగా వుంది" అన్నాడు.

"అది ఎస్కేపిజం. పడుకోని సేవలు చేయించుకునేందుకు కాదు మనం వున్నది. సమాజానికి సేవలు చేసేందుకు. చిన్న హాస్పటల్‌లోనుండి మీరు ఈ ప్రపంచమనే పెద్ద హాస్పటల్‌లోకి పోతున్నారు. దాన్ని సేవించకూడదూ మీరు" అన్నది సుజాత.

"బ్రతికివుంటే అలాగే చేస్తాను సుజాతా! ముఖ్యంగా నీమీద ఓ నవల రాస్తాను" అన్నాడు ఆనందు.

"ఈ గొంగళి పురుగుమీద నవల రాస్తే ఎవరూ చదవలేరు" అన్నది సుజాత నవ్వుతూ.

తన అందవికారం మీద తానే జోక్స్ వేసుకొని నవ్వడానికి ఎంత ఆత్మశక్తి కావాలి? ఎంతటి మనోబలం కావాలి?

"మీరొకసారి పాండిచ్చేరి వెళ్ళిరండి. మీకది చాలా ఉపయోగపడుతుంది" అన్నది సుజాత.

"నన్నెవరు తీసుకువెళ్తారు?" అన్నాడు ఆనంద్.

"మీవాళ్ళు. ఎవరైనా ..."

"మావాళ్ళు నాకు సహాయపడగలిగేవాళ్లు ఎవరూలేరు ఒకామె ఉంది కాని ప్రస్తుతం పారిస్‌లో వుంది. ఆమె వచ్చేవరకూ నేను ఉంటానో చస్తానో ఎవరికి తెలుసు?" అన్నాడు ఆనంద్.

"అలా అనకండి. మీరు ఇప్పుడు పూర్తిగా ఆరోగ్యవంతులైనారు. మరణమనే భావాన్ని జయించడంకోసం మనం భవిష్యత్తులో శరీరస్థాయిలో కాక మానసిక స్థాయిలో యుద్ధంచేయాలి" అన్నది సుజాత.

"ఆ యుద్ధం చేయడం ఎలా? నాదగ్గర ఆయుధాలు లేవే" అన్నాడు ఆనంద్.

సుజాత నవ్వింది. "ఆనంద్! నీ మనసే నీకు ఆయుధం, మనస్సుతో మనస్సులోనే యుద్ధంచేసి మనస్సును జయించాలి అదే క్షీరసాగర మధనం, అదే మన్మధవధ" అన్నది సుజాత.

రెండు రోజుల తర్వాత సుజాత, "అన్నయ్యా! మా నాన్నగారు నన్నొందుకో ఒకసారి రమ్మని రాశారు. బహుశా అక్కడేదైనా ఉద్యోగం చూచారేమో! రేపు నన్ను హాస్పటల్‌నుండి రిలీవ్ చేస్తున్నారు. నీ అడ్రసు ఇవ్వు ఎప్పుడైనా ఈ వూళ్ళోనే వుంటే కలుద్దాం" అన్నది.

"సుజాతా! నాదొక చిన్న కోరిక. కాదనకుండా తీరుస్తావా?"

"ఏమిటి?"

'నన్ను నీవెంట పాండిచ్చేరి తీసుకొని పోగలవా?'

'అంతకంటేనా? తప్పకుండా. రా అన్నయ్యా! మా నాన్నగారిని పరిచయం చేస్తాను. మీరు తెలుగులో రైటర్ అని తెలిస్తే ఆయన ఎంతో సంతోషిస్తారు'

మరునాడు ఆనందును హాస్పటల్‌నుండి డిశ్చార్జి చేశారు.

## 16

మద్రాసు ఎక్స్‌ప్రెస్ గాలిని కాలాన్ని దూసుకుంటూ దక్షిణంగా పోతున్నది.

సుజాత, ఆనంద్ త్రీటైర్ స్లీపర్‌లో కూర్చున్నారు. సుజాత ఏవేవో కబుర్లు చెపుతున్నది. ఆనందు వింటున్నాడు. వీళ్ళకు ఎదురుగా ఎవరో తమిళ కుటుంబం మద్రాసుకు ప్రయాణం చేస్తున్నది.

అందులో ఒక ముసలామె వుంది. ఆమె సుజాతను పరిశీలనగా చూస్తున్నది. కొడుకు కావచ్చు-ఆపిల్ పండు కొరుకుతూ పడుకొని సినిమాపుస్తకం పేజీలు తిప్పుతున్నాడు. ఆమె తమిళంలో కొడుకునేదో మందలిస్తున్నద. దానితో సుజాత వాళ్ళతో మాటల్లోపడింది. ఆనందుకు నిద్రపట్టింది మెలకువ వచ్చేసరికి కాజీపేట దాటింది ముసలమ్మా, కొడుకూ ప్లాట్‌ఫారం మీదకి పోయారు.

'ఏమిటి వాళ్ళతో తమిళంలో మాట్లాడుతున్నావు సిస్టర్?' అన్నాడు ఆనందు.

''ఏవో కబుర్లు. ఆమె నిన్ను 'మీ అయనా!' అని అడిగింది" అన్నది సుజాత నవ్వుతూ

అనందు కళ్ళు విచిత్రంగా వణికాయి.

'మగ - అడ పక్కపక్కన వుంటే చాలు, భార్యా-భర్తలని తప ఊహించలేని సమాజం ఇది. అన్నా చెల్లెళ్లు ఉండకూడదా? అక్కా- తమ్ముళ్లు ఉండకూడదా?? సమాజం లైంగికంగా తప్ప వేరే పద్ధతిలో స్త్రీ పురుషులను గూర్చి ఆలోచించలేకపోతున్నది. సమాజానికి శరీరం పెరిగిందే కాని మనస్సు పెరగలేదు ఇంకా ఇన్ని వేల సంవత్సరాలైనా-' అన్నది సుజాత.

సుజాత ఆలా కబుర్లు చెబుతూవుంది అవి కేవలం మాటలు కావు. తల్లి పసిపాపకు పాడే జోలపాటల్లాంటివి-

ఆ లాలింపులో ఆనందు తనకు తెలియకుండానే నిద్రలోకి వెళ్ళిపోయాడు.

తెల్లవారుజాము నాలుగు గంటలయింది. ఆనందుకు మెలకువ వచ్చింది. లేచి సుజాతవైపు చూశాడు. స్వచ్ఛమైన కలువపువ్వులా నిద్రపోతున్నది సుజాత! నిమీలితమైన ఆమె కన్నులమీద గౌతమబుద్ధుని శాంత సౌందర్యం వుంది.

'వెరిలోకం- ఈ పిల్ల అందమైనది కాదట. మరెవరు? జయంతేనా అందమైనది?' అనుకున్నాడు ఆనందు.

బిట్రగుంట వచ్చింది అర్ధగంటకు పైగా ఆగింది రైలు. సుజాత లేచింది ఇద్దరూ ముఖాలు కడుక్కొన్నారు. ప్లాట్‌ఫారంమీద వేడివేడి టీ తాగారు డైలీ పేపర్ వచ్చింది. ఆనందు ప్లాట్‌ఫారంమీదే పేజీలు తిప్పాడు. 'దేవయాని కుమారరాజాల వివాహం' అని ఓ వార్త వుంది. డెల్ఫిలోని ఒక పురాతన గ్రీకు దేవాలయం వద్ద వారు తీయించుకున్న ఫోటోకూడా పత్రికలో పడింది. ఆనందు నిర్లిప్తంగా పేపరు చదివాడు.

తూర్పురేఖలు తెల్లబడ్డాయి మధ్యలో ఓ అరుణ కాంతి కిరణం.

చల్లని గాలి వీస్తున్నది.

'సుజాతా! ఈ ప్రకృతి ఎలావుందో చెప్పు?' అన్నాడు.

'నేను కవయిత్రిని కానుగా. ఈ తూర్పుదిక్కు మాత్రం శివునిలా వుంది' అన్నది సుజాత.

ఎంత గొప్ప పోలిక! తెల్లని రేఖలు విభూతి రేఖలు. మధ్య అరుణ రేఖ కుంకుమ, సూర్యోదయం శివోదయం.

ట్రెయిన్ ఉదయం పదకొండు గంటలకు మద్రాసు చేరింది.

'మహాబలిపురం చూస్తావా అన్నయ్యా! రేపు వెళదాం పాండిచ్చేరి' అన్నది సుజాత.

ఆనంద్ సంతోషంతో అంగీకరించాడు. మధ్యాహ్నం రెండు గంటలకు మహాబలిపురం చేరారు.

అక్కడ సముద్రం వడ్డున హోటల్లో స్నానం, భోజనం ముగించారు ఆనంద్-సుజాతా.

సుజాత మహాబలిపురం చరిత్ర చెప్పింది. అక్కడ పూర్వం పెద్ద దేవాలయం వుండేదట. అందులో కొంతభాగం సాగరగర్భంలో కలిసిపోయిందట ఇప్పుడు.

సుజాత సముద్ర తీరానికి వెళ్ళింది. సముద్రపు అలల పొంగును చూస్తుంటే ఆనంద్‌లో ఏవో కొత్త కొత్త భావావేశాలు పొంగి పొర్లాయి.

ఆ ఆవేశ లహరులతో పార్కర్ పెన్ తీశాడు. గది తలుపులు బిగించాడు. నిర్విరామంగా రాశాడు.

చీకటి పడింది.

'మధులిప్త' పూర్తయింది.

ఆనంద్ తలుపులు తీశాడు.

'ఏమిటి తలుపులు మూసుకొని తపస్సు చేస్తున్నారు?' అన్నది సుజాత.

'తపస్సు పూర్తయింది సుజాతా! వరం వచ్చేజన్మలో రావాలి' అన్నాడు ఆనంద్.

ఆనంద్, సుజాత ఇద్దరూ సముద్ర తీరానికి వెళ్ళారు. కిందా పైనా చీకటి ముసురుకుంటున్నది. చీకట్లో సముద్రం చాలా విచిత్రంగా కనిపిస్తున్నది. సాగర రంగస్థలంపై అలలు నాట్యమాడుతున్న దేవయానిలా వున్నాయి.

'చిన్నీ! అటు పరుగెత్తకు. ఏమండీ! వాణ్ణి పట్టుకోండి ఇసుకలో పరుగెత్తున్నాడు'

ఎక్కడో విన్న గొంతు!

ఆనంద్ వెనుదిరిగి చూచాడు తాను కూర్చున్న బండమీదినుండి. పోల్చుకున్నాడు-సరళ.

ఇద్దరు పిల్లలు ఇసుకలో పరుగెత్తుతున్నారు.

శ్రీకాంత్‌లాగే వున్నాడు, చీకట్లో పిల్లలు పరుగెత్తకుండా అడ్డం పోతున్నాడు.

శ్రీకాంత్ చేయి పట్టుకొని ముందుకు పోయింది సరళ. చిన్నవాణ్ణి ఇసుక దులిపి చంకకెత్తుకుంది. రెండవవాడు సరళ కొంగు పట్టుకొని గుంజుతున్నాడు. వాళ్లు టూర్‌కు వచ్చారని గ్రహించాడు ఆనంద్!

ఆనంద్ అలాగే వాళ్ళను చూస్తూ కూర్చున్నాడు కొంతసేపు!

ఆనంద్ ఏం చేస్తున్నాడో సుజాతకు తెలియదు.

సరళావాళ్లు వెళ్ళిపోయారు సముద్ర తీరంనుండి. మనోభూమికపై కాలం అద్దిన ఏవేవో దృశ్యాలు - అనుభూతులు - జ్ఞాపకాలు-ప్రవాహరూపంలో సుప్త చైతన్యం. ఎదురుగా స్ఫూర్తికి సంకేతం సుజాత!! ఎవ్వడే కాకృతి వెల్లునోవాని ఆనంద తాండవంలా వుంది ప్రకృతి.

ఆనందుకు గుండె ఎందుకో బరువుగా వున్నట్టు అనిపించింది. కుడిచేత్తో గుండెను పట్టుకున్నాడు.

'సుజాతా! గదికి వెళదాం.' అన్నాడు భారంగా.

సుజాత లేచింది. ఆనంద్ నడవలేకపోతున్నాడు.

ఓ కొబ్బరిచెట్టు వచ్చింది. దాన్ని పట్టుకొని నిలబడ్డాడు.

'రేపీవేళకు పాండిచ్చేరి సముద్రం వద్దున ..' అంటున్నది సుజాత.

'సుజాతా! పాండిచ్చేరి నాకు చాలా మైళ్ళ దూరంలో వుందమ్మా?' అన్నాడు ఆనంద్.

'కాదన్నయ్యా! చాలా దగ్గర- తెల్లవారితే వెళదాం' అన్నది సుజాత.

'తెల్లవారదు. తెల్లవారడానికీ నాకూ మధ్య ఓ జన్మ దూరం వుంది' అన్నాడు ఆనంద్.

'ఏమిటట్లా అంటున్నారు?' అన్నది సుజాత.

'సుజాతా! నేనెందుకో నడవలేకుండా వున్నాను.' అన్నాడు ఆనంద్. భయపడిందామె!

వెంటనే ఆనంద్‌ను సుజాత సాయంపట్టి నడిపించింది.

ఆనందు గదికి చేరాడు. ఓ బెడ్ మీద కూలబడ్డాడు.

సుజాత బాగ్‌లోంచి స్టెతస్కోపు తీసింది. వారించాడు ఆనందు.

సూట్‌కేస్‌లోంచి చెక్ బుక్ తీశాడు. దానిమీద అంకె వేసి సంతకం పెట్టి 'చెల్లీ!' అని పిలిచాడు.

'అన్నయ్యా!'

'ఇదిగో ఈ చెక్ తీసుకో. అదుగో టేబిల్ మీద వుంది 'మధులిప్త'. నీవు మళ్ళీ హైదరాబాదు పోగానే ఏ ప్రింటర్కైనా ఇచ్చి దాన్ని అచ్చువేయించు. ఆ పని చేశావో నీ మేలు వచ్చే జన్మలో ఎటుతిరిగి మరచిపోను'

'అలాగే' అన్నది సుజాత భయం భయంగా చూస్తూ

ఆనంద్ కాసేపు పడుకున్నాడు పక్కమీద. అతని పెదవులు కదిలాయి. 'మధులిప్త'లోని చివరి పంక్తులు గాలిలో దోబూచులాడాయి

'ఎవరితో పోల్చను, నిన్ను అనుపమా!
పోలికే లేని ఆత్మ సౌందర్యం నీది సుజాతా!!
తల్లి రొమ్ముపై నిద్రించే పసిపాప బోసినవ్వుతోనా?
సహారా ఎడారిలో ఒయాసిస్సువద్ద పూచిన పుష్పంతోనా?
సవితవా? అచ్చతెలుగు పద కవితవా??
ఎవరితో పోల్చను నిన్ను చెల్లీ!!
అతీంద్రియ లోకానికి నాకూ వారధివి తల్లీ!! కల్పవల్లీ!!
అగ్నిమీళే పురోహితం - పలికిన ప్రథమముని భావనవా??
పాండిచ్చేరీ యోగి స్వప్న కామనవా??
తిరువళ్లువర్ జ్ఞానానివా?
తిరుప్పావై మాధుర్యానివా?
ధీ మార్గానికి ప్రచోదితమైన సవిత్రివా??
సుదీర్ఘ జీవన నిశాంత లతాంతంలో వికసించిన ఉషస్సువా??
ఎవరితో పోల్చను నిన్ను అనుపమా.

పోలికే లేని ఆత్మ సౌందర్యం నీది, సు....'

ఆనంద్ ఆయాసపడుతున్నాడు.

అతి కష్టంమీద, ఓ పది నిమిషాల తర్వాత లేచి నిలబడ్డాడు.

'వద్దు కదలకండి. కాసేపు విశ్రాంతి తీసుకోండి' అన్నది సుజాత.

ఆనందుకు సుజాత మాటలు వినిపించడంలేదు. ఆనంద్ నడచి పోతున్నాడు సుజాత నిస్సహాయురాలై అతనివెంట నడిచింది.

'అన్నయ్యా! ఏమిటి ఎక్కడికి వెళ్తున్నావు?' సుజాత అడ్డం నిలబడింది ఆనందును సాగనివ్వకుండా.

ఆనంద్ ఇసుకలో కూలబడిపోయాడు. అతి కష్టంమీద నిశ్వాసం తీస్తున్నాడు-

'సుజాతా!'

'అన్నయ్యా!'

'నాదొక కోరిక తీరుస్తావా అమ్మా!'

'ఏమిటన్నయ్యా?'

'నా నుదురు నొకసారి ముద్దుపెట్టుకుంటావా?'

సుజాత కంటినుండి రెండు వెచ్చని నీటి బిందువులు ఆనందు బుగ్గలమీద రాలాయి. సుజాత ఆనంద్ రెండు కనుబొమ్మల మధ్య భాగాన్ని చుంబించింది.

ఆనందు కళ్ళు రెండు జ్యోతుల్లా మెరిశాయి ఒకసారి చీకట్లో.

మళ్ళీ యధాప్రకారం చీకటి.

సముద్రం ఉన్నట్టుండి ఎందుకో ఒక్కసారి పెద్దగా ఘోషపెట్టింది.